తత్వశాస్త్రం

# చార్వాకం

నాస్తిక తత్వవేత్త : బి.రామకృష్ణ

చార్వాక ఆశ్రమం
చిడమూరు

చార్వాకాశ్రమ ప్రచురణ

# చార్వాకం

బి. రామకృష్ణ

ప్రచురణ :
చార్వాకాశ్రమం, నిడమర్రు.

# చార్వాకం

జి. రామకృష్ణ

మొదటి ముద్రణ : జూలై 1994
రెండవ ముద్రణ : ఫిబ్రవరి 2006 (జనసాహితి)
మూడవ ముద్రణ : ఫిబ్రవరి 2011

హక్కులు : చార్వాకాశ్రమం

వెల. **50.00** రూ॥లు
ప్రతులకు :
బి. సుధాకర్,
చార్వాకాశ్రమం,
నిడమర్రు పోస్ట్ – 522503,
మంగళగిరి మండలం,
గుంటూరుజిల్లా.
ఫోన్ : 9290619550
08645–231778

మైత్రి బుక్ హౌస్,

విజయవాడ.

ముద్రణ :
లోకాయత ప్రింటర్స్,
నిడమర్రు.

# స్వీకారం

నేను హేతువాదిని. నాస్తికుణ్ణి. నాకు హేతువాద, 'నాస్తిక' సంఘాలతో విడదీయరాని అనుబంధం వుంది.

ఈ దేశంలో తాత్త్విక పునరుజ్జీవనం జరగాలని బాగా కాంక్షించే వాళ్ళల్లో నేనూ ఒకడిని. అది లేకుండా ఏదీ జరగదనీ – ఏమీ చేయడానికి వీల్లేదనీ గాఢంగా విశ్వసిస్తున్నా. నా ప్రయాణం ఆ మార్గంలోనే జరుగుతుంది కూడా.

ఆ భావ ప్రభావాలకు లోనై, ఆ చింతనలోనే ప్రయాణిస్తున్న నాకు, దానికి సంబంధించిన వారితో మైత్రి వుండడం అబ్బురం గాదు; భావ బంధుత్వం నెరపటం అంతకంటే విచిత్రమూ కాదు.

రామకృష్ణగారు నాస్తికోద్యమానికి సర్వస్వం ధారపోసి, దాని వ్యాప్తికి అహర్నిశము కృషి చేస్తున్నారు.

దానికి మచ్చుతునక ఆయన నిర్వహిస్తున్న చార్వాకాశ్రమం – అందులోని చార్వాక విద్యాపీఠం. సవాలక్ష కబుర్లు చెప్పవచ్చుగాని ఆచరణాత్మక కార్యక్రమం కత్తిమీద సాము వంటిది.

సంప్రదాయ విద్యకు ప్రత్నామ్నాయ విద్యావిధానాన్ని రూపొందించిన వారీయన.

ఆయన మార్గం ప్రయాణం కష్టతమంగా భాసించినా, వాటిని సాపుగా చేసుకుని ప్రయాణాన్ని సుగమం చేసుకుంటున్నారు.

నేనూ దీనిలో భాగస్వామిని. అందుకే రామకృష్ణగారు సేకరించి విపులమైన పీఠికతో నవసమాజ నిర్మాణం కోసం ఆయుధంగా అందిస్తున్న 'చార్వాక' – అనే ఈ గ్రంథాన్ని స్వీకరిస్తున్నా.

మాకిద్దరికీ ఎడతెగని భావ బంధుత్వం వుంది.

దానికి సంకేతమే ఈ స్వీకారం.

మీ

**కతారి ప్రభాకరరావు**

# చెలిమికి గుర్తు

ఆయన ప్రభాకరుడు
కాదు... కాదు...
కఠారి ప్రభాకరుడు...
పేరులోనూ... ఇంటి పేరులోనూ
సార్థక్యాన్ని సంతరించుకొన్న
సార్థక నామధేయుడు

వేల సంవత్సరాల నుండి
తన సమాజాన్ని ఆవరించి
చుట్టుముట్టిన
బ్రాహ్మణ, భావ, వాద
భావ నిబిడ తమోంధకార
నిర్మిథిత ప్రభాకరుడు

ఆస్తికతా నిర్హేతుక
కీకారణ్య సంవలిత
వివిధ దాంభికాచార
సంప్రదాయాలతా
సముచ్ఛేదన దక్ష
శేముషీ కఠారాంచిత
కఠారి ఈయన

అందుకే మా యిద్దరికీ
చెలిమి...
ఆ చెలిమికి గుర్తుగా
ఈ సిద్ధాంత గ్రంథం
ఇస్తున్నా...

– బి.రామకృష్ణ



# మామాట

నిడమర్రు సమీపాన (మంగళగిరి దగ్గర) గల చార్వాక విద్యాపీఠాన్ని 1973 నుంచి ప్రముఖ భౌతికవాది బి.రామకృష్ణ నిర్వహిస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు చార్వాక వాచకాలు తయారుచేసి అచ్చు వేశారు. భారత నాస్తిక సమాజ నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు. 'నాస్తిక యుగం', 'నాస్తికత్వం', 'చార్వాకం' మొదలైన పత్రికలను తమ విద్యాపీఠం ప్రెస్సు ద్వారా ప్రచురించారు.

తాడికొండ సంస్కృత కళాశాల యాజమాన్యంతో భావపరమైన విభేదంతో ఆ కళాశాల ప్రిన్సిపల్ పదవికి రాజీనామా ఇచ్చి, స్వచ్ఛదంగా లోకాయత, చార్వాక తత్త్వాన్ని క్రియాశీలంగా ప్రచారం చేయడానికి అవిరళ కృషి చేశారు.

ఈ నాటి మూఢ విశ్వాసాలను పెంచి పోషిస్తున్న పాలక వర్గ సంస్కృతులకు ప్రత్యామ్నాయంగా ప్రజానుకూల సంస్కృతి నిర్మించే భాగంలో గత 19 ఏళ్ళుగా(1992 నుంచి) ప్రతి ఏడూ ఫిబ్రవరి రెండవ శనివారం, ఆదివారాల్లో నాస్తికమేళా అనే పండుగను జరుపుతున్నారు. ఈ మేళాలో భౌతికవాదాన్ని నమ్మి, ఆచరించే కుటుంబాల వారందరూ వివిధ తాత్త్విక, సమకాలీన అంశాలపై పరస్పరం చర్చించుకుంటున్నారు. వివిధ కుటుంబాలకు సంబంధించిన పిల్లలు ఆట, పాటలు, చిత్రలేఖనం, కథలతో ఆనందిస్తారు. కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.

ఈ 19వ నాస్తికమేళా(2011 ఫిబ్రవరి 12,13) సందర్భంగా. బి.రామకృష్ణ రాసిన రెండు పుస్తకాలను ప్రచురిస్తున్నాం. తత్త్వశాస్త్రానికి చెందిన 'చార్వాకం' ఒక పుస్తకం కాగా,'ప్రజాకవి వేమన', రెండో పుస్తకం. ఈ రెండు పునర్ముద్రణలే.

వ్యవస్థను విమర్శించకుండా, దేవుడు లేడనడమే నాస్తిక ఉద్యమంగా నమ్మిన వారికంటే భిన్నంగా బి.రామకృష్ణ తన రచనల్లో మూఢవిశ్వాసాలను పెంచే వ్యవస్థ పట్ల, దాన్ని కాపాడుతున్న రాజ్యం పట్ల విమర్శనాత్మక వైఖరి చూపుతున్నారు. సమాజంలో సృష్టిస్తున్న రాజకీయ, సామాజిక సంక్షోభం ప్రజలను కొత్త దేవుళ్ళు, కొత్త దీక్షల వైపు నెడుతోంది. పాలకులు పనిగట్టుకొని ఈ దేవుళ్ళను, బాబాలను విరివిగా ప్రచారం చేసి, ప్రజలను ప్రక్కదారి పట్టిస్తున్నారు.

ఈ సామాజిక వాతావరణంలో భౌతికవాదం విరివిగా ప్రజలకు, విద్యావంతులకు చేరవలసిన అవసరం వుంది. ఈ అవసరాన్ని కొంతవరకు ఈ రెండు పుస్తకాలూ తీరుస్తాయని ఆశిస్తున్నాం.

ఈ పుస్తక ప్రచురణకు ఆర్థికంగా సహకరించిన ప్రముఖ హేతువాద నాయకులు **డా॥ భానుప్రసాద్** గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

**– ప్రచురణకర్తలు**

# పరిచయం

మనం ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి – ఈ ప్రపంచాన్ని వివరించడానికి రెండు దృక్పథాలను అవలంబిస్తున్నాం.

(1) ఈ ప్రపంచం, విశ్వం అంతా ఏదో అతీతశక్తి వల్ల ఏర్పడి – దాని చేతనే నడిపింపబడుతుందనీ, ఈ ప్రపంచంలో జరిగే మంచిచెడ్డలకూ, వివిధములైనవాటికి ఆ శక్తే కారణమనీ, మానవులమైన మనం కూడా ఆ శక్తి చేతనే సృష్టించబడ్డామనీ, మనం కేవలం దేనికైనా నిమిత్తమాత్రులమేననీ అంటారు కొందరు. దీన్ని భావవాదం, ఆధ్యాత్మికవాదం అని వ్యవహరిస్తారు.

(2) రెండోది దీనికి భిన్నమైనది --

మనం నివశిస్తున్న ఈ ప్రపంచంగాని, చూస్తున్న విశాల విశ్వంగాని ఏ అతీత శక్తివల్లనో ఏర్పడింది గాదనీ, ఇది సహజంగానే పదార్థ పరిణామం వల్ల అంటే మార్పు వల్ల ఏర్పడిందనీ, దీనిలోని మంచిచెడ్డలకూ, ఇతరాలకూ కారణం వుంటుందనీ, మానవులమైన మనం నిమిత్తమాత్రులం కామనీ, ఈ సమాజాన్ని మార్చుకోగల శక్తి సామర్థ్యాలు, ఆలోచన, మేథా సంపత్తి మనకున్నాయని చెబుతారు. దీన్ని భౌతికవాదం అంటారు. అంతేగాక నాస్తికత్వం, లోకాయతం అనే పేర్లతో గూడా దీన్ని పిలుస్తారు.

ఇంతవరకూ భారతీయ తత్వశాస్త్రాన్ని రాసినవాళ్ళు గాని, అధ్యయనం చేసినవాళ్ళు గాని భారతీయ తత్వచింతన అంటే అది ఆధ్యాత్మిక చింతన అనే సంకుచిత అభిప్రాయంతోనే వున్నారు. అంతేగాని, భారతదేశంలో ప్రజల మనోభావాలను ఉద్దీప్తం చేసిన తాత్వికాలోచన వుందనే సంగతినే విస్మరించారు. దాన్ని వెలుగులోకి రాకుండా చేశారు.

దీనికి కారణం వుంది. ఆధ్యాతికవాదం ఈ దేశంలో బ్రాహ్మణ సంస్కృతికి మూలాధారంగా నిలచింది. దాన్ని నిలుపుకుంటేనే, దాన్ని ప్రచారం చేస్తేనే ఇక్కడి సాంఘిక, రాజకీయ సాంస్కృతిక వ్యవస్థలు పదిలంగా వుంటాయి. వీటిని అంటిపెట్టుకొన్న ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా వుంటుంది. అందుకే దైవ చింతన మూలాధారమైన ఆధ్యాత్మిక సంస్కృతిని, ఆధ్యాత్మికవాదాన్ని సామాన్య ప్రజల దగ్గర నుంచి, పైవర్గం వరకూ ఆచరించేట్టు చేయటం కోసం ప్రచారం జరిగింది. నేటికీ జరుగుతోంది.

భౌతికవాదం అంటే చార్వాకం, లోకాయతం, నాస్తికత్వం అనేది బ్రాహ్మణ సంస్కృతికి భిన్నమైనది. దీని వివరణ ముందు ముందు తెలుసుకొంటాం.

భౌతికవాదం లేక పదార్థవాదం అందరిచేతా రకరకాలుగా అవహేళనకు గురిచేయబడ్డది. దీన్ని ఇంతగా అవహేళనకు గురికావించిన భావవాదపు సత్తా ఎట్లాంటిదో తెలుసుకోవడం ముందుగా మనకెంతో అవసరం.



# భావవాదం

భావవాదమంటే చైతన్యమే ప్రధానమనే భావం. అంటే భావాలు మాత్రమే ప్రధానమని చెప్పే తత్వం.

భావవాదుల్లో చాలా విభేదాలున్నాయి. కాని ప్రపంచం గూర్చిన వీళ్ళ అభిప్రాయం మౌలికంగా ఒక్కటే. అది – మనం చూస్తున్న ఈ విశ్వం అవాస్తవమని చెప్పటం.

ఉపనిషత్తుల్లో ఉండీ ఉండనట్టుగా, సూక్ష్మంగా దాగుకొని వున్న ఈ భౌతిక ప్రపంచ మిధ్యావాదం, సనాతనీకరించబడ్డ బౌద్ధం నుంచి బయటపడ్డది.

మత వ్యవస్థను – అందులోనూ, హైందవ మత వ్యవస్థను కాలరాయటానికి బయలుదేరిన బౌద్ధం తనకు చార్వాకాన్ని పునాదిగా భావించి, తన కర్తవ్య నిర్వహణలో సఫలత సాధించింది.

కాని, బౌద్ధం చేసిన ఈ కృషికి తమ మనుగడకు ముప్పు వాటిల్లి, నిలువ నీడ లేకపోయేటప్పటికి – బ్రాహ్మణవర్గమంతా ఒక ఎత్తుగడగా బౌద్ధంలో దూరి దాన్ని సనాతనీకరించి – దాని అసలు స్వరూపాన్ని మట్టిపాలు చేసి – ఇది కూడా హిందూ మతంలో ఒక విభాగమన్నట్టుగా తామే సాహిత్యాన్ని సృష్టించారు. అందులో భాగమే, వారి యత్న ఫలితమే బౌద్ధంలో చోటుచేసుకున్న శూన్యవాదం.

బౌద్ధాన్ని ప్రచారం చేసిన నాగార్జునుడి సిద్ధాంతాన్ని శూన్యవాదమని అంటారు. ఎన్నో రకాల వైవిధ్యంతో వున్న ఈ చలన గుణం గల ప్రపంచం మన కండ్లకు కూడా కనిపిస్తున్నది. కాని, దీన్ని నాగార్జునుడు శూన్యం అనిపిలిచాడు. ఉనికి లేనిదన్నాడు. ఈతడు క్రీ.శ. రెండో శతాబ్దం వాడు.

ఇతని తర్వాత అనంగ, వసుబంధులు కూడా దీన్ని మరో పరిభాషలో అస్తిత్వం లేనిదనే చెప్పారు. వాళ్ళు చెప్పినదాన్ని విజ్ఞానవాదం అంటారు. వీళ్ళను యోగాచారులని కూడా అంటారు. యోగం మీద వీళ్ళు చాలా సాహిత్యాన్ని సృష్టించారు. అందుకనే వీళ్ళను యోగాచారులంటారు. వీళ్ళు కూడా బౌద్ధులే. బాహ్యదృష్టికి కనిపించే ఈ భౌతిక ప్రపంచమంతా ఊహాజనితమైందని, ఇదంతా ఇంద్రజాలమేనని వీళ్ళు చెపుతారు. గారడీ వాడి కనికట్టు విద్య లాంటిదని భౌతిక ప్రపంచాన్ని యోగాచారులు వర్ణిస్తారు. వీళ్ళు 5వ శతాబ్దం వాళ్ళు.

వీళ్ళ తర్వాత భావవాదుల్లో పేర్కొనదగ్గవాడు శంకరుడు. ఇతడు ఎనిమిదో శతాబ్దం వాడు. ఈతని సిద్ధాంతాన్ని అద్వైతం అని చెపుతారు. ఇతనికి వైదికమతంలో ఎంతో విశ్వాసముంది. బౌద్ధాన్ని వ్యతిరేకించి, బౌద్ధుల్ని ఎంతోమందిని దుంపనాశనం చేసినవాడు. కాని ఇతడికి కూడా ప్రచ్ఛన్న బౌద్ధుడని పేరుంది.

అతడు చైతన్యవాదంతో ఈ ప్రపంచాన్ని మిధ్య అని చెప్పాడు. ఉదాహరణగా తాడు – పాము భ్రాంతిని చూపించాడు. తాడును చూసి మనం పాము అని

భ్రాంతి పడ్డట్టే – అసత్యమైన ఈ విశ్వాన్ని సత్యంగా భ్రమిస్తున్నామని ప్రచారం చేశాడు.

వీళ్ళంతా – కలల్నీ – ఎండమావుల్నీ తమకు సాధనాలుగా వాడుకొన్నారు. కలలో కనిపించేవి ఏవీ మేల్కొన్న తరువాత వాస్తవంగాదు. ఎండమావుల్లో నీరున్నట్టు భ్రమిస్తాం. కాని, దగ్గరకు పోయి చూస్తే అందులో నీరే వుండదు. అట్లాగే ఈ ప్రపంచం గూడా బాహ్యదృష్టికి మాత్రమే వాస్తవంగా కనిపిస్తుంది. ఆధ్యాత్మిక సత్యం తెలిసిన తరువాత అంతా మిధ్యగానే, అబద్ధంగానే, అవాస్తవంగానే వుంటుంది.

భావవాదులందరికీ ప్రపంచం గూర్చి అభిప్రాయం సామాన్యంగా ఇదే. ఇతరమైన అభిప్రాయభేదాలు చాలా వున్నాయి. వాటితో మనకు పనిలేదు.

ఇక్కడ ఓ విషయం గమనిద్దాం. భౌతిక ప్రపంచమంతా మిధ్య అని భావవాదులు చెపుతారు. అయితే, ఆకలైతే అన్నం తింటున్నాం, ఆకలి తీరుతుంది. శరీర రక్షణ కోసం బట్టలు ధరిస్తున్నాం. చలికి, ఎండకు, వానకు కాపుగా ఇళ్ళు కట్టుకొంటున్నాం. రోగాలు వస్తే వైద్యం చేయించుకొంటున్నాం. ఒకటేమిటి? శారీరక, మానసిక అవసరాలను భౌతికంగానే తీర్చుకొంటున్నాం. అంతేగాని, భావవాదులు చెప్పినట్టుగా మిధ్య అని వాటిని కొట్టిపారవేయలేం.

అయితే, భావవాదులు ఈ సందేహాలను శంకించకపోలేదు. వాళ్ళకూ ఈ ఆలోచన తట్టింది. అందుకే ఇట్లాంటివాటికి సమాధానం చెప్పటం కోసం కొంత పదాల గారడీ చేయవలసి వచ్చింది.

భౌతిక ప్రపంచాన్ని అసత్యం అని చెప్పిన భావవాదులు నాగార్జునుడు, శంకరుడు మొదలైనవాళ్ళు – తమ అభిప్రాయాలను కప్పి పుచ్చుటం కోసం భాషతో కొంత తమాషా చేశారు.

ఈ ప్రపంచం శూన్యం – అసత్యం – మిధ్య – అని చెప్పిన అభిప్రాయం అనుభవంలో విరుద్ధంగా కనిపించడం ప్రారంభించింది. ఇది కలగానో, ఎండమావులలోని నీరుగానో గాక, అనుభవంలో భిన్నమైన ఫలితాల్నిస్తుంది.

అందుకని – ఈ ప్రపంచం కలలాగా – ఎండమావిలోని నీరులాగా బొత్తిగా అసత్యంగాదనీ, సత్యంలాగా కనిపించే అసత్యమని భాషా భేషజాన్ని ప్రదర్శించి ఓ గమ్మత్తు చేశారు.

దానికి నాగార్జునుడు మొదలైనవాళ్ళు – సంవృతసత్యమని పేరెడితే శంకరుడు వ్యావహారిక సత్యం అని పేరు పెట్టాడు.

సంవృత సత్యమంటే – ఆవరింపబడిన లేక చుట్టబడిన సత్యం – అంటే అజ్ఞానం చేత, మాయచేత ఆవరింపబడ్డ సత్యం అని అర్థం. అర్థరాత్రి కంటికి సత్యంగా కనిపించే సత్యంగాని సత్యం – అసత్యం అని అర్థం.



అట్లాగే – శంకరుడి వ్యావహారిక సత్యం కూడా అర్థం చేసుకోవాలి. మన కంటికి కనిపిస్తున్న ఈ భౌతిక ప్రపంచంలో, వ్యవహారంలో సత్యంగా కనిపిస్తుంది. కాని వాస్తవానికి సత్యం కాదు.

ఈ భావవాదుల పదాల గారడీ నుండి మనం బయటపడాలంటే సిద్ధాంత రాద్ధాంతాలతో కూర్చుంటే కానిపని. రకరకాల ముదులు వేసి మనల్ని ఈ భావవాద పండితులు ఆధ్యాత్మిక ఊబిలోకి దించుతారు. అందుకని వీళ్ళతో మాట్లాడాలంటే సిద్ధాంతాలు వల్లిస్తే అయ్యే పని కాదు. మన జీవితానుభవాల్ని కొలబద్ధగా తీసుకుని మాట్లాడండని భావవాదులకు చెప్పాలి. ఆ దెబ్బతో ఏ భావవాదీ – భౌతికవాది ముందు నిలబడే అవకాశం వుండదు.

## నాస్తికత్వం ఎంత ప్రాచీనమైనది?

నాస్తికత్వం, చార్వాకం, లోకాయతం, పదార్ధవాదం, భౌతికవాదం పేర్లతో పిలువబడే ఈ సిద్ధాంతం ఎంత ప్రాచీనమైందనే సందేహం కుహనా భావవాద – అందులో హిందూ భావవాదమ్మన్యులకు కొరకరాని సమస్యగా కనిపిస్తుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే, మానవజాతి ఎంత ప్రాచీనమైందో నాస్తికత్వం అంత ప్రాచీనమైంది. ఈ మాట అంటే మనవాళ్ళకే అతిశయోక్తిగా వుండవచ్చు. ఎందుకంటే మనం కూడా ఆధ్యాత్మిక భావ ప్రపంచంలో మునిగి తేలుతున్నవాళ్ళం. తత్త్వశాస్త్రమంటే ఆధ్యాత్మికమైనదే అనే అభిప్రాయం మనవాళ్ళల్లో కూడా చాలామందికి వుంది. అందులో భారతీయ తత్త్వశాస్త్రమంటే దైవాన్ని గూర్చి చెప్పే ఆధ్యాత్మికమేనని అందరిలో వున్న అపోహ. అందుకే నాస్తికత్వం మానవజాతి ఎంత ప్రాచీనమైనదో, అంత ప్రాచీనమైనదని చెపితే విడ్డూరంగా వుంటుంది.

కాని, ఇది వాస్తవం, నాస్తికత్వం చాల ప్రాచీనమైనది.

నాస్తికత్వం అని ఈనాడు మనం అంటున్నది భౌతికవాదాన్నే. ఇది మొట్టమొదటి అనాగరిక మానవుడి ఆలోచనల నుండి తొంగిచూచిన భావసంపుటి, నాటి మానవుడు వ్యావసాయక జీవనం కలవాడు. మాతృస్వామిక వ్యవస్థలో బ్రతికినవాడు.

అలనాటి మానవుడు తన జీవిత సమస్యల్ని సాధించుకోవడం కోసం ఏ అతీత శక్తిపైనా ఆధారపడలేదు. భౌతికంగానే ఆలోచించి. తన కోర్కెలు సాధించుకోవటం కోసం యత్నించాడు.

ఈ విషయం మనకు బాగా తెలియాలంటే, భారతీయ తంత్ర వాదాన్ని నిష్పక్షపాతంగా గమనించాలి. ఆధునిక తంత్రవాదం మనల్ని సత్యం నుంచి ఎన్నో అపోహల్లోకి లాగుకొనిపోతుంది.

తంత్రవాదమని పేరెత్తగానే అందరిలాగానే మనకూ చిరాకు కలగవచ్చు. దీన్ని బ్రాహ్మణ సంస్కృతీ పరాయణులు చిలువలు పలువలుగా చేసి భ్రష్టు పట్టించారు. అదేదో విపరీతమైందన్నట్టుగా, లోక విరుద్ధమైనదన్నట్టుగా వింతగానూ, అసహ్యకరంగానూ చూడడం, ప్రచారం చేశారు.

దీనిక్కారణం గమనించడం పెద్ద కష్టమేమీ గాదు.

తంత్రవాదంలో వామాచారాలు ప్రధానం. దీనితో పాటు పంచమకారాలు పాటించాలి.

పంచమకారాలంటే మద్యం – మాంసం – మైధునం – ముద్ర – మత్స్యం – ముద్ర అంటే నానబెట్టిన గోధుమలు.

ఇందులో వామాచారం అంటే – స్త్రీలకు సంబంధించిన ఆచారం అని అర్థం. వామ అంటే స్త్రీ అని అర్థం. అంతేగాని ఆధునికులు కొందరు చెపుతున్నట్టుగా ఎడమ అని అర్థంగాదు.

తంత్రవాదం బయలుదేరటానికి కారణం ప్రాపంచిక దృక్పథమే. ఇది భౌతిక చింతనకు సంబంధించిందే.

సంతానం కనే లక్షణం, వంశాభివృద్ధి చేసే లక్షణం స్త్రీకి వుంది. స్రీ పురుష లైంగిక సంపర్కం వల్ల సంతానం కలుగుతుందనే అభిప్రాయం లోకంలో చోటుచేసుకుంది. అందుకే స్త్రీకి సమాజంలో ప్రత్యేక స్థానం ఇచ్చి, స్త్రీని ముందుభాగాన నిల్పి ప్రత్యేక కర్మకాండ చేయడం మొదలుపెట్టారు. అలా స్త్రీకే అధిక ప్రాధాన్యం ఇచ్చిన మాతృస్వామికి వ్యవస్థ చోటుచేసుకుంది.

మొట్టమొదట స్త్రీ ఒక్కతే సంతానం కనేదనీ, ఇందులో కూడా స్త్రీ స్తనభాగాలు సంతానం కనే భాగాలని భావించారు. అందుకనే స్త్రీ ప్రతిమలు బాగా పెద్ద స్తనాలు గలవిగా కనిపిస్తాయి. ఇది అసహ్యకరమని మనం ఈనాటి దృష్టితో పరిగణిస్తే మన పూర్వ సంస్కృతిని మరచిపోయినవాళ్ళమౌతాం.

ఈ ఆలోచన క్రమక్రమంగా మారింది. స్త్రీ పురుష లైంగిక సంపర్కం వల్లనే సంతానం కలుగుతుందనే నిర్ణయం రూఢి అయింది. దీన్ని ఆధారంగా చేసుకొనే ప్రకృతిని అన్వయించుకోగలిగారు. పైరు పంటలకు కారణం ప్రకృతి– పురుషుల కలయిక అని భావించారు. అంతేగాని ఈ విశాల విశ్వానికి గాని, చరాచర ప్రపంచానికి గానీ ఏ ఆతీతశక్తో కారణమని మాతృస్వామిక వ్యవస్థను పాటిస్తున్న నాటి మానవ సమాజం అభిప్రాయపడలేదు.

తమ ముందు సంతానం – స్త్రీ పురుష సంపర్కం వల్ల కలగడం అంతా చూస్తూనే వున్నారు. దీనికి భిన్నంగా, కృత్రిమంగా, ప్రపంచ సృష్టికి అలౌకికమైన, అభౌతికమైన శక్తిని భావించవలసిన పరిస్థితి నాటి సమాజానికి రాలేదు. ఈ భావనే క్రమక్రమంగా భౌతికవాదానికి దారితీసింది. స్త్రీకి జీవశక్తిని ప్రసాదించే



అర్హత, శక్తిసామర్థ్యాలు వున్నాయని గ్రహించారు. కాబట్టే ఆనాటి సమాజం స్త్రీకి సమున్నత స్థానం ఇచ్చింది. ప్రతి కార్యానికి స్త్రీని ముందు నిలబెట్టింది.

వర్షం కురవకపోయినా, పంటలు బాగా పండకపోయినా స్త్రీ తన కర్తవ్యం తాను నిర్వహించవలసి వచ్చేది. స్త్రీలు వివస్త్రలుగా వర్షం కోసం ఆరుబయట సంచరించడమో, పంటలు పండకపోతే స్త్రీ పురుషులు దిగంబరంగా పంటపొలాల్లో విహరించడమో జరుగుతూ వుండేది. ఈ రకమైన ఆచారాలు ప్రపంచంలో అన్ని జాతుల్లోనూ వున్నట్టు దాఖలాలున్నాయి.

అంత దూరానికి పోనవసరం లేదు. ఇటీవలకాలంలో కూడా ఉత్తర హిందూస్థానంలో వర్షం కోసం రాత్రిపూట స్త్రీలు బట్టలువిడిచి తిరగడం–పంటలు పండడ కోసం వివస్త్రలై నాగలి దున్నటం చేసినట్టు మనం విన్నాం. పత్రికల్లో చదివాం.

ఇట్లా చెప్పుకుంటూ వెళితే అట్లాంటివి చాలా వున్నాయి. మొత్తం మీద మనం తెలుసుకోవలసిందేమిటంటే – ప్రాచీన మానవ సమాజాలు ప్రపంచ సృష్టి భౌతికంగా జరిగిందే గాని, ఏ అతీత శక్తి వల్లనో జరిగింది కాదని భావించాయి. మానవ సంతానాభివృద్ధిని, ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకొని ప్రపంచాన్ని అర్థం చేసుకున్నారు. ఇదంతా భౌతిక చింతనగానే మనం గమనించాలి.

దీన్ని నాటి మానవులు ఒక రకమైన క్రతువులుగా భావించారని చెప్పాలి. అవి భౌతిక చింతనగల క్రతువులు. ఈ మాట ఎందుకంటున్నానంటే ఈ రకమైన కార్యక్రమాలలో ఏ అతీతశక్తికీ, ఆధ్యాత్మికభావానికీ చోటు లేదు.

ఇదంతా శుద్ధ అవైదిక కర్మకాండ.

అందుకే వైదిక మతాన్ని ప్రచారం చేసేవాళ్ళు తంత్రవాదాన్ని చాల బలహీనమైనదన్నట్టుగా, ఇది కేవలం లైంగికము, విషయలంపటత్వమూ గల మొరటు, అనాగరిక ఆచారమన్నట్టుగా ప్రచారం చేశారు.

వైదిక పండితుల అభిప్రాయాలను ప్రమాణంగా భావించినవాళ్ళంతా నిజంగానే ఈ తంత్రవాదం క్షీణ సంస్కృతికి ప్రతిబింబమని తలచారు; ప్రచారం చేశారు.

ఇక్కడ మనం ఓ విషయం గమనించాలి.

వైదిక కర్మలన్నీ ఎంతో నాగరికత, సంస్కారం కలవి అని దబాయించినా, అది కూడా పచ్చి లైంగిక కార్యకలాపాలతో కూడుకున్నదే అని చెప్పడానికి ఎన్నో ఋజువులున్నాయి.

అంతేగాక, మనం చూస్తున్న ప్రసిద్ధ దేవాలయాలపై వున్న బూతుబొమ్మలు ఏ సంస్కృతికి వారసత్వమో చెప్పమనండి? అవి అట్లా చెక్కబడటానికి కారణాలేమిటో అడగండి శుద్ధ వైదీకిగాళ్ళని.

మనందరికీ తెలిసిన  ఒకటి రెండు ఉదాహరణలిస్తే చాలు, వైదిక సంస్కృతి రక్షకుల సంస్కారం, నాగరికత బయటపడుతుంది.

పౌండరీకమనే యాగం వుంది. ఇది పచ్చి బూతుకు సంబంధించిన తంతు. భార్యాభర్తలిద్దరూ అందరూ చూస్తూ వుండగా హోమగుండంపై వేసిన పందిరి ఎక్కి రమించాలి. పురుష వీర్యం క్రింద వున్న హోమ గుండంలో పడాలి. అప్పుడు ఆ యాగం ఫలితాన్ని ఇస్తుంది.

అట్లాగే – అశ్వమేథం, దాన్ని మన మాజీ ముఖ్యమంత్రి రామారావు కూడా చేయించినట్లు మనకు తెలుసు.

అశ్వమేథాన్ని శాస్త్రీయంగా చేయడమంటే ఏమిటి?

యజ్ఞం చేయించే యజమాని భార్య రెండు తొడలూ వెడల్పుగా చాచి పడుకుంటే ఆమె మర్మాంగంలో గుర్రం తన మర్మావయవాన్ని లోపలికి పెట్టాలి. అంటే మగ గుర్రంతో యజమాని భార్య రమించాలి. ఇది కల్పించి చెప్పడం కూడా కాదు. తెలుగు కవి శ్రీనాథుడు కూడా ఈ విషయం తన శృంగార నైషధం కావ్యంలో రాశాడు. కొంతమంది ఇటీవల ఆయన నైషధాన్ని అచ్చు వేయించేవాళ్ళు అసహ్యంగా వుందని ఈ పద్యాన్ని ఆ పుస్తకంలో నుంచి తొలగించి అచ్చు వేస్తున్నారు. ఇంతమాత్రంచేత అది పోతుందా?

శ్రీనాథుడు రాసిన పద్యం కావాలంటే ఇదిగో చదవండి.

"యజమాని ప్రమాదానివినస్వర భగిన్యస్తాశ్వ

... ... .... ... ... ..

వైదిక కర్మకాండలోకూడా ఇదే గాక, ఇట్లాంటివి స్త్రీ పురుష లైంగిక విచ్చలవిడితనాన్ని చెప్పేవి చాలా వున్నాయి. అందుకని ఈ వైదికంగాళ్ళు తంత్రవాదాన్ని గేలి చేయవలసిన పనిలేదు.

మీకు తెలుసో – తెలియదో గాని – మంచి శృంగార పురుషుణ్ణి మన వాళ్ళు "వీడు ఒట్టి పౌండరీకంగాడురా!" అని అనటం కూడా వుంది.

వీటన్నిటిబట్టి చూస్తే ప్రాచీనకాలంలో వైదికులు కూడా తంత్రవాద ప్రభావానికి లోనైనవారనే చెప్పాలి.

అయితే, భౌతికవాదానికి మూలమైన అసలు సిసలైన తంత్రవాదం వ్యవసాయమూలకం, మాతృస్వామ్యం గలది.

వైదిక సంప్రదాయం – పితృస్వామికం – దీన్ని మనం గమనించాలి.

ఇంకో విషయంగూడా మనం గుర్తించాలి.

ప్రాచీన భౌతికవాద శాఖల్లో ఒకటైన సాఖ్యం – దీన్ని అంటిపెట్టుకున్న యోగం – ఈ రెండూ కూడా ప్రాచీన తంత్రవాదం నుండి అభిప్రాయాలను ఎరువు తెచ్చుకొన్నవే.



సాఖ్యం – ఈ సృష్టికి దైవాన్ని అంగీకరించదు. తంత్రవాదం చెపుతున్నట్టుగా – ప్రకృతి పురుష సంపర్కం వల్లనే ఈ విశ్వం ఏర్పడ్డదని చెపుతుంది.

ఇట్లా శుద్ధ భౌతికవాదానికి సంబంధించిన అవైదిక తంత్రవాదం కాలక్రమంలో ఆధ్యాత్మీకరించబడింది. ఇది తరువాత తరువాత పెక్కు మార్పులకు లోనై తన నిజస్వరూపాన్ని కోల్పోయి రకరకాల స్థితులకు దిగజారిపోయింది. బౌద్ధులు కూడా దీన్ని ప్రచారం చేసే స్థాయికి వచ్చింది.

## మధ్యయుగంలో చార్వాకం –లోకాయతం (నాస్తికత్వం)

ప్రాచీనకాలంలోని పదార్థవాదాన్ని అంటే భౌతికవాదాన్ని గురించి తెలుసుకోవటానికి తంత్రవాదం కొంత సహాయకారిగా నిలిచింది. అయితే తరువాతి మధ్యయుగంలో భౌతిక – పదార్థవాదాన్ని గూర్చిన వివరాలు అంతా అయోమయంగా వున్నాయి. ఆధ్యాత్మికవాదానికున్నట్టు దీనికి ప్రత్యేకమైన సాహిత్యం ఏది వెలుగుచూచింది లేదు. అందుకే మనకు మనవాళ్ళు భోగట్టా స్పష్టంగా తెలియకుండా పోయింది. అయితే అంతమాత్రం చేత నిరుత్సాహపడనవసరం లేదు. ఉన్న సమాచారాన్ని బట్టి మనం భారతీయ పదార్థ వాదాన్ని లోకాయత – చార్వాక – నాస్తికత్వ సిద్ధాంతాన్ని క్రోడీకరించి ఒక క్రమంలో పునర్నిర్మించుకొనే యత్నం చేయవచ్చు. దీనికి మూడు రకాలైన ఆధారాలు గ్రహించవలసి వుంటుంది.

(1) ప్రాచీన మత గ్రంథాల్లో లోకాయతులను గూర్చిన ప్రస్తావనలున్నాయి,

(2) భిన్న దృక్పథాలున్న రచయితల గ్రంథాల్లోని విమర్శలు.

(3) భారతీయ తత్వశాస్త్రంలో చాటు పద్యాల రూపంలో వున్నవి.

బౌద్ధ జైన గ్రంథాల దగ్గర నుంచి చాలా సిద్ధాంతాలు చార్వాక లోకాయతులను విమర్శించటమో, దూషించటమో చేశాయి.

బుద్ధుడు చార్వాక ఉద్యమం నుండి స్ఫూర్తిని పొందినవాడే. కాని, అనంతరం వచ్చిన బౌద్ధమత ప్రచారకులు, జైనులు లోకాయతం పట్ల చాలా వ్యతిరేక భావాన్ని ప్రదర్శించారు. అందుకే తమ తమ గ్రంథాల్లో భారతీయ పదార్థవాదాన్ని, దాన్ని ప్రచారం చేసిన కొందరు వ్యక్తుల గూర్చీ వ్యతిరేక వైఖరి ప్రదర్శించారు.

తరువాత వచ్చిన బౌద్ధంలో బ్రాహ్మణులు చాలామంది చొరబడ్డారు. ఈ బ్రాహ్మణ బౌద్ధులే బహుశ: బౌద్ధాన్ని పతనం గావించారు. వాళ్ళే ఈ పదార్థవాదాన్నీ, పదార్థవాద ప్రచారకుల్నీ నిందించారు. ఇకపోతే ప్రాచీన బౌద్ధం నాస్తికత్వాన్ని బోధించేది. భారతీయ పదార్థవాదాన్ని వ్యతిరేకించడంగాని, దాన్ని ప్రచారం చేసినవారిపై రాళ్ళు రువ్వడం గాని చేసి వుండరు.

ఇక వైదిక మతాన్ని ఆరాధించే బ్రాహ్మణత్వ ప్రచారకులు మనువు లాంటివాళ్ళు. దానిపై గుప్పించిన విమర్శనాస్త్రాలు విపరీతంగా మన భౌతికవాదాన్ని గాయపరచాయి. భయంకరమైన తూట్లు పొడిచాయి.

బ్రాహ్మణవ్యవస్థను సమూలంగా నాశనం చేయటానికి కంకణం కట్టుకొన్న పదార్థవాదంపై ఈ వైదిక పండితులు ఎంతగా విరుచుకుపడ్డారో వాళ్ళ గ్రంథాలు చదివితేనే అర్థం అవుతుంది.

మనువు తన ధర్మశాస్త్రమైన మనుస్మృతిలో ఎక్కడ గుర్తుకువస్తే అక్కడే నాస్తికుల్ని ఆడిపోసుకున్నాడు.

శంకరుడు బ్రహ్మసూత్రాలకు రాసిన తన శారీరక బాష్యంలోనూ భగవద్గీతా వ్యాఖ్యలోనూ ఎంతో తీవ్రంగా భౌతికవాదులను దుయ్యబట్టాడు.

కృష్ణమిశ్రుడు - ప్రబోధ చంద్రోదయమనే సంస్కృత నాటకంలో చార్వాక సిద్ధాంతాన్ని బాగానే విమర్శించాడు.

ఒకటేమిటి? వివిధ పురాణాల్లో, రామాయణ, భారతాల్లో ఈ దేశ పదార్థవాదాన్ని వ్యతిరేకిస్తూ రాసిన రాతలు అనేకం.

వీళ్ళందరూ ఇంత అక్కసు వెళ్ళగక్కడానికి కారణాన్ని ఊహిస్తే చాలు; మన భౌతికవాదం - అంటే నాస్తికత్వం ఎంత బలీయమైందో అర్థం అవుతుంది. ఏమీ బలంలేని సిద్ధాంతమైతే పుట్టిన ప్రతివాడూ దీనిపై ధ్వజమెత్తవలసిన పనిలేదు.

ఇవీ - ఇట్లాంటివీ అక్కడక్కడా విమర్శనాపూర్వకంగా వున్నవి ఒక ఎత్తు - వీటన్నిటినీ మించినదింకొకటి వున్నది.

14వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్య నిర్మాణ దీక్షాదక్షుడైన విద్యారణ్యుని సోదరుడు మాధవాచార్యుడున్నాడు. ఇతడు రాజకీయవేత్త, మంత్రి, తన సోదరుడితో కలసి హిందూమత రక్షణ ధ్యేయంగా బ్రతికినవాడు. విజయనగర సామ్రాజ్య నిర్మాణానికి కృషిచేసినవాడు. అన్నదమ్ములిద్దరూ మూర్తీభవించిన హిందూ ధర్మోద్ధారకులు.

ఈ మాధవాచార్యుడు 'సర్వదర్శన సంగ్రహ'మనే పుస్తకం రాశాడు. దీనిలో చార్వాక దర్శనం గురించి వివరించాడు. ప్రత్యేకంగా ఒక దర్శనంగా తీసుకొని ప్రచారం చేసే ఆధునికులకందరికీ ఇదే ఆధార గ్రంథంగా కనిపిస్తుంది.

మాధవాచార్యులకు ఈ దేశ పదార్థవాదంలోని సత్తా తెలుసు. అయితే, దీన్ని పక్కదారి పట్టించటం కోసం ఎంతో జాగ్రత్తగా చేయవలసిందంతా చేసేశాడు. అంతేగాదు, ఒక్కోచోట తానే - చార్వాక ఉద్యమప్రచారకుణ్ణన్నట్టుగా ఎంతో ఆవేశంతోనూ, ఉత్సాహంతోనూ కనిపిస్తాడు. కాని, అదంతా అతని కపట నటనా వైదుష్యం మాత్రమే. శంకరుడు కూడా బౌద్ధాన్ని సర్వనాశనం చేయటం కోసం ప్రచ్ఛన్న బౌద్ధుడిననిపించుకొన్నాడు గదా! అదే ఎత్తుగడతో మాధవాచార్యులు



చార్వాకాన్ని అపహాస్యం చేయటం కోసం తంటాలు పడ్డాడు.

మాధవాచార్యుల తరువాత చెప్పుకోదగ్గవాడు హరిభద్రసూరి. ఇతడు శైవ పండితుడు. హరిభద్రుడు షడ్దర్శన సముచ్చయం అనే గ్రంథం రాశాడు. దీనిలో కూడా ఈయన లోకాయత దర్శనం - పేరుతో ఈ సిద్ధాంతాన్ని వివరిస్తూ విమర్శించాడు. సూరి గ్రంథానికి వ్యాఖ్యానం రాసిన గుణభద్రుడు, మణిభద్రుడు అనేవాళ్ళు కూడా తమ వ్యాఖ్యానాల్లో దీనిపై బురదచల్లారు.

ఇదంతా వింటుంటే ఏమనిపిస్తుంది?

ఒక సత్పురుషుడిపై, ఒక వీరునిపై, ఒక యోధానయోధుడిపై, ఒక మహోన్నత వ్యక్తిపై ఈర్ష్యతో, అసూయతో, అక్కసుతో, ద్వేషంతో, కార్పణ్యంతో తమ తమ బాణాసనాలకు బాణాలను సంధించి వేయిమంది చుట్టు చేరి అతని శరీరం నిండా గ్రుచ్చినట్లు లేదా? అతన్ని నామరూపాలు లేకుండా చేయటానికి కసిదీరా మీదకురికినట్లు లేదా?

అయినా ఇన్ని విమర్శనలు, నిందలు, అపోహలు, ఇంకా ఏవేవో భరించి, తట్టుకొని మన పదార్థవాదం నేటికీ నిలిచి, మన దాకా వచ్చిందంటే దీనిలోని చేవ, ప్రజాదరణ, సిద్ధాంత పటిమ సామాజిక దృష్టి ఎంతటిదో అర్థంకావటం లేదా?

ఇట్లాంటి చెత్తంతా పోగుచేసుకొని తూర్పారబట్టి పొల్లునంతా ఏరిపారవేసి, గట్టిగా మిగిలిందేమన్నా తీసుకుని మనం నాస్తికతా సిద్ధాంతాన్ని పునర్నిర్మించవలసిన అవసరం వుంది.

## మన సాహిత్యం ఏమైనా వుందా? వుంటే ఏమైంది?

వ్యతిరేకుల గ్రంథాలను ఆధారంగా చేసుకొని సిద్ధాంతాన్ని రూపొందించుకోవటమేనా? లేక మన ప్రాచీనులేమైనా సాహిత్యాన్ని సృష్టించారా? అని ఆలోచిస్తే, తప్పనిసరిగా సాహిత్యసృష్టి జరిగే వుంటుందని భావించాలి.

సామాన్యంగా మన భారతీయ భౌతికవాద చింతనకు సంబంధించిన సాహిత్యమంతా శత్రువుల చేతిలో నశించిందనే అభిప్రాయం ప్రబలంగా వుంది. అందుకనే దీనికి సంబంధించిన మౌలిక సిద్ధాంత గ్రంథమేదీ ఇంతవరకూ లభించలేదనే చెప్పాలి. అయితే పండితలోకంలో ఈ విషయంపై తర్జనభర్జనలు జరిగాయి. కొందరు లోకాయతకు సంబంధించిన తత్వశాస్త్ర గ్రంథమంటూ ఏదీలేదని అంటే, మరికొందరు తప్పనిసరిగా వుండివుంటుందని అంటున్నారు.

"లోకాయత, చార్వాక అనే పదాలను బట్టి చూస్తే ఇవి కొంతమంది ఆలోచనాపరుల భావాలను మాత్రమే సూచిస్తాయి కాని, గ్రంథాన్ని కాద"ని రిస్ డేవిడ్స్ లాంటి వాళ్ళంటే,

తుచ్చిదాస్ గుప్తా, గార్బే లాంటివాళ్ళు –

"లోకాయతకు సంబంధించిన తత్త్వశాస్త్ర గ్రంథం ఏదీ మనకు దొరకని మాట నిజమే! కాని, అంతమాత్రాన దీనికి గ్రంథమేదీ లేదని అనడం సబబు కాదు. అట్లా అనడం చాలా విపరీతం కూడా. నాకు తెలిసినంతవరకు ప్రాచీనకాలంలో లోకాయతను సూచించే గ్రంథాలున్నాయని చెప్పటానికి కావలసిన ఆధారాలున్నాయి" అని అంటున్నారు.

చంద్రకీర్తి అనే అతడు తన ప్రజ్ఞాశాస్త్రంలో ఒక లోకాయత శాస్త్రాన్ని పేర్కొన్నాడు, ఆర్యదేవుడు రాసిన శతశాస్త్రం అనే గ్రంథంలో బృహస్పతి శాస్త్రంలోని రాతలు కనిపిస్తున్నాయి.

సందర్భం వచ్చింది కాబట్టి ఇక్కడ ఒకమాట– బృహస్పతి అనే వ్యక్తి నాస్తికత్వాన్ని బోధించాడనీ, అందుకే బార్హస్పత్యమని అంటారని చెపుతారు. నాస్తికత్వాన్ని చెప్పే బృహస్పతి సూత్రాలున్నాయని, ఇటీవల అవి వెలుగులోకి వచ్చాయని చెపుతారు. కాని, వాటిని పరిశీలిస్తే ఆ శ్లోకాల్లో భౌతికవాదానికి వ్యతిరేకమైన రాతలు కూడా వున్నాయని చాలామంది విమర్శకులు, పండితులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాబట్టి బృహస్పతి పేరుతో వున్న ఆ గ్రంథం లోకాయత సిద్ధాంత గ్రంథంగా మనం భావించరాదు.

పురందరుడు అనే ఇంకొక వ్యక్తి చార్వాక మత గ్రంథంగా ఒకటి వున్నదని అంటాడు.

గార్బే అనే పండితుడు బౌద్ధ గ్రంథమైన "దివ్యవదన" లోకాయతకు భాష్యమూ, ప్రవచనమూ వున్న గ్రంథాలు చాలా వున్నాయని పేర్కొన్నట్టు రాశాడు.

క్రీ.పూ. 300 సం.లలో ఉన్న కాత్యాయనుడు అనే వైయాకరణి (వ్యాకరణ పండితుడు) లోకాయతపై "భాగురి వ్యాఖ్యానం" వుందని ఉదహరించాడు. అంటే కాత్యాయనుడి కాలం నాటికే – ఇప్పటికి దాదాపు రెండువేల మూడువందల ఏళ్ళనాడే లోకాయతకు సిద్ధాంత గ్రంథమూ, దానిపై వ్యాఖ్యానమూ వున్నట్లు భావించాలి.

దీన్నంతటినీ గమనిస్తుంటే చార్వాకకు బలమైన సాహిత్యమే వుండి వుండాలనీ, తన శత్రువుల విధ్వంసానికి గురైందనీ తేలికగా భావించవచ్చు. అయితే, ఈ వినాశనం క్రీ.శ. పూర్వమే జరిగివుండాలి.

## ఇది విదేశీయమా?

మనం లోకాయతగా చెప్పుకొనే భౌతికవాదం ఈ దేశానికి సహజమైందే కాదని, ఇది ఇతర ప్రాంతం నుంచి వచ్చిందనీ కొందరంటారు. దీనికి కారణం – లోకాయతం అనేది అసురమతంగా పేర్కొనబడడమే.



బ్రాహ్మణ మతానికీ, ఆధ్యాత్మిక వాదానికీ మూల స్తంభాలుగా, ప్రచార గ్రంథాలుగా వున్న పురాణాలు, ఇతిహాసాలు తమ వ్యతిరేకుల్ని నిందిస్తూ వాళ్ళకు అసురులు, దస్యులు, దాసులు, దైత్యులు, రాక్షసులు, రాత్రించరులు మొదలైన పేర్లు పెట్టాయి. అంటే అవైదిక కర్మకాండ గలిగి, తమ వైదిక కర్మకాండను వ్యతిరేకించేవారికందరికీ ఈ బిరుదులే తగిలించారు.

పురాణాలనిండా రాసిన రాక్షసుల, అసురుల కృత్యాలు, కార్యకలాపాలు అన్నీ లోకాయతకు దగ్గరగానే వున్నాయి. అందుకని లోకాయతకూ అసురులకూ దగ్గర సంబంధమున్నదనీ పండితులు చాలామంది పేర్కొన్నారు.

ఈ పరిస్థితుల్లో ఈ అసురులెవరు? అనే ప్రశ్న తలఎత్తుతుంది.

పురాణాలన్నీ పరిశీలించినా, సంస్కృత సాహిత్యాన్ని మొత్తం తిరగవేసినా అసురులు, దైత్యులు, రాక్షసులు మొదలైన పేర్లతో వున్నవాళ్ళంతా ఆర్య సంస్కృతిని వ్యతిరేకించినవాళ్ళుగానే కనిపిస్తారు.

లోకాయతులు దేహాత్మవాదులు – అంటే శరీరం కంటే భిన్నంగా ఆత్మ అనేది ఏదీ లేదు. శరీరమే ఆత్మ. శరీరము + చైతన్యము – ఆత్మ అని గ్రహించాలి. చైతన్యం శరీర ధర్మం.

అంతేగాక చచ్చిన తరువాత శవాలను ఖననం చేసే పద్ధతి లోకాయతులకున్నట్టు దాఖలాలున్నాయి.

విశ్వసృష్టికి సంబంధించిన అభిప్రాయం కూడా అసురులకు పోలి వుంది. కాబట్టి లోకాయతులకూ, అసురులకూ సంబంధం వుంది.

అయితే ఈ ఆలోచన – సంస్కృతి కల ప్రాంతం సుమేరియా. లోకాయతులలాగే సుమేరియనులు కూడా భావిస్తారు. అందుకని మనం లోకాయతం అని చెప్పుకొనే ఈ భావజాలం సుమేరియా ప్రాంతం నుంచి వచ్చి వుంటుంది అని కొంతమంది అభిప్రాయం.

అసుర అనే శబ్దం – అస్సీరియా – అను పదం నుంచి వచ్చింది. కాబట్టి అసురకు, అస్సీరియాకు దగ్గర సంబంధం వుంది. అందుకని లోకాయతం అస్సీరియా ప్రాంతం నుంచి ఇక్కడికి దిగుమతి అయివుంటుంది.

అస్సీరియనులు ఆర్యులకంటే ముందుగానే ఈ దేశం వచ్చి సింధునదీ ప్రాంతంలో నగరాలను నిర్మించారనీ, సింధు నాగరికత అస్సీరియనులు నిర్మించిందేనని ఇంకా కొందరు చెప్పుతారు.

భారతదేశం మధ్యభాగంలో ఛోటా నాగపూర ప్రాంతంలో ఇప్పటికీ అసుర తెగ ప్రజలున్నారు. వీళ్ళు బయట నుంచి వచ్చారా! లేదా? అనే విషయం

వివాదాస్పదం. చారిత్రకులు ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు చెబుతున్నారు. ఎవరెన్ని చెప్పినప్పటికినీ లోకాయత వైదిక ధర్మాన్నీ, ఆర్య సంస్కృతినీ వ్యతిరేకించి నిలచినది భౌతికవాద ఉద్యమం. దీన్ని పాటించిన వాళ్ళు చార్వాకులై వుండవచ్చు. దీని ప్రత్యేకత మొదటి నుంచీ దీనికుంది.

## నామౌచిత్యం

భారతీయ పదార్థవాదానికి చాల పేర్లున్నాయి. వీటి ఔన్నత్యాన్ని గురించి తెలుసుకోవాలి. ఇవి నిందారోపణలా? పొగడ్తలా? అనే విషయం కూడా మనం గమనించవలసిన విషయం వుంది.

నాస్తికత్వం, చార్వాకం, బార్హస్పత్యం, లోకాయతం అనే పేర్లతో ప్రస్తుతం ఘన భౌతికవాదాన్ని, పదార్థవాదాన్ని వ్యవహరిస్తున్నాం.

మనందరం ప్రచురంగా వాడు పదం నాస్తికత్వం అనేది . దీన్ని రెండు రకాలుగా నిర్వచిస్తారు.

మనువు తన ధర్మశాస్త్రంలో 'నాస్తికో వేద నిందకః" అని చెప్పి నాస్తికులపై విరుచుకుపడ్డాడు.

ఈ నిర్వచనం ప్రకారం వేదాల్ని నిందించేవాళ్ళు నాస్తికులు. వేదాల్ని ప్రధానంగా భావించేవాళ్ ళ ఆస్తికులు.

అంటే అవైదికులు నాస్తికులు – వైదికులు ఆస్తికులు.

ఈ లెక్క ప్రకారం వేద సామ్రాజ్యాన్ని ధిక్కరించేవాళ్ళంతా నాస్తికులే.

బౌద్ధులు, జైనులు, కాపాలికులు, శాక్తేయులు, వీరశైవులు మొదలైన అవైదికులంతా నాస్తికులు. ఈ పదం చాలా విశాలార్థాన్ని బొధిస్తున్నట్టు కనిపిస్తుంది. నిజానికి వీళ్ళంతా కూడా పదార్థవాదులే. దీని వివరాల జోలి మనకిప్పుడు అనవసరం.

తరువాత బార్హస్పత్యం. నాస్తికత్వాన్ని ప్రచారం చేసినవాడు బృహస్పతి అనే వాడున్నాడని అంటారు. అందుకే బృహస్పతి ప్రచారం చేసిన సిద్ధాంతం కాబట్టి బార్హస్పత్యం అని దీనిని పిలవడం కద్దు. ''బార్హస్పత్యస్తు నాస్తిక:'' అని హేమచంద్రుడు తన నిఘంటువులో రాశాడు. మాధవాచార్యుడు "బృహస్పతి అనుయాయుడు" అయిన చార్వాకుడు అని అన్నాడు. మేథావులనబడే వాళ్ళల్లో ఈ పేరు కొంచెం ప్రచారం అయింది.

అయితే ఈ బృహస్పతి ఎవరు?

దేవతల గురువు బృహస్పతి వున్నాడు. అతడే దీన్ని ప్రచారం చేశాడా? లేక



నాస్తికత్వాన్ని ప్రచారం చేసిన బృహస్పతి వేరే వున్నాడా? ఇదమిత్థంగా తేలని విషయమిది. దేవతల గురువైన బృహస్పతే సమాజంలో అవినీతిని కలిగించడం కోసం నాస్తికత్వాన్ని ప్రచారం చేశాడని అంటారు.

ఇక చార్వాక, లోకాయత అనే పదాలున్నాయి.

చార్వాక అనే పదం చారు + వాక్ అనే రెండు పదాలతో ఏర్పడిన సమాసపదం. చారు= అందమైన, వాక్= మాట, మాటలు కలవాడు. అంటే అందమైన మాటలు చెప్పి ప్రజల్ని తనవైపు ఆకర్షించేవాడు, చార్వాకుడు అని అంటారు.

అంతేగాక – చర్వ్ – అనే పదం నుంచి – చార్వాక– అనే పదం వచ్చిందని కూడా అంటారు. చర్వ అంటే తిను, తాగు, సుఖంగా బ్రతుకు అని అర్థం. దీన్ని బట్టి చార్వాక ఉద్యమం ప్రచారం చేసేవాళు ్ళ ఉదాత్తమైన జీవన విధానాన్ని విడిచి భోగలాలసమైన జీవనం గడుపండని ప్రజలకు బోధించారనీ, వీళ్ళకు జీవిత పరమార్థం తిని, తాగటం తప్ప వేరే ఏమీ లేదని అంటారు.

చర్వ్ – అంటే నాకుట అని కూడా అర్థం వుంది. మత సంప్రదాయాలైన స్వప్న, నడక, పుణ్య పాపాదులను నాకివేస్తారు అని కూడా అర్థం చెప్పుతారు.

కాని చారు+వాక్ అని చెప్పినా చర్వ్ అనే దాని నుంచి వచ్చిందని చెప్పినా చార్వాక అనే పదం వ్యాకరణయుక్తం గాదు. కాబట్టి ఇది ఈ ఉద్యమ ప్రచారకులకిచ్చిన పేరేగాని వేరేమి గాదు.

అయితే కొంతమంది చార్వాకుడు అనే వ్యక్తి వున్నాడనీ, అతను దీన్ని ప్రచారం చేశాడనీ అంటారు. కాని అట్లాంటిదేమీ లేదు, చారిత్రకంగా ఎంత పరిశోధించినా ఈ ఉద్యమాన్ని ప్రచారం చేసినవారిలో ఆనాడు చార్వాకుడు అనే వ్యక్తి లేడు.

నాస్తికత్వం అనేదానికి ఇంకో నిర్వచనం కూడా వుంది. పాణిని 'అష్టాధ్యాయి'లో "అస్తి, నాస్తి విషమ్మతి;" అనే సూత్రం రాశాడు. దీన్ని భాష్యకారుడు "నాస్తి పరలోకం యస్యస: అస్తిక:" అని వివరణ ఇచ్చాడు.

అంటే పరలోకం లేదనేవాడు నాస్తికుడు, పరలోకం వుందనేవాడు ఆస్తికుడు అని గ్రహించాలి.

వీటిని బట్టి కొంతమంది విపరీతార్థం తీసే ప్రమాదం వుంది. ప్రముఖ రచయిత్రి రంగనాయకమ్మ తమాషాగా వ్యాఖ్యలు రాసి విపరీతార్థాలు తీసి ఉద్యమంపై బురద చల్లటానికి యత్నం చేశారు.

చార్వాకపదాన్ని వృషోదరాది గణంలో చేర్చి పదాన్ని సాధురూపంగా సాధించడం కూడా వుంది. ఈ పని ప్రబోధ చంద్రోదయ నాటక వ్యాఖ్యాత చేశాడు.

"చారు – రమణీయా, వాక్ – ఉక్తిర్యస్యేతి – విగ్రహే – చార్వాక పద సిద్ధిః " అని రాశాడు.

ఇందులో నాస్తిక, చార్వాక అనే రెండు పదాలూ, ఈ భౌతికవాదాన్ని అపహాస్యం చేయటం కోసం శత్రువులిచ్చిన బిరుదు పదాలే కాని, ఈ ఉద్యమాన్ని గౌరవించటం కోసం వాడిన పదాలు గాదు.

నాస్తిక అనే శబ్దమే – ఇది ప్రతిపక్షులు ఆస్తిక శబ్దానికీ వ్యతిరేకంగా కల్పించిన పదమని అర్థం అవుతోంది.

అట్లాగే చార్వాక అనే పదం కూడా మనం పై చెప్పుకున్న వివరణను బట్టి శత్రువులు తాలించిందే గాని, నాటి సిద్ధాంత ప్రచారకులు తమలు పిలుచుకున్న పదం కాదని తేలికగానే అర్థం అవుతుంది.

చివరగా లోకాయత అనే పదాన్ని మనం గమనించాలి. మన ఉద్యమానికి ఇదే సరైన పదం అని అనుకుంటున్నా.

ఈ పదాన్ని లోక + అయత్ + అ – అని విడదీయవలసి వస్తుంది లోక– అంటే "లోక స్తుభువనే జనే – అని నిఘంటువులు అర్థం చెపుతున్నాయిః ఈ లోకం, ప్రజలు అని రెండర్థాలున్నాయి.

లోకంలో ప్రజల్లో – ఆయత – అంటే విస్తరించింది, వ్యాపించింది అని అర్థం. ఈ లోకానికి సంబంధించిన సిద్ధాంతం అని గూడా చెప్పవచ్చు.

ప్రత్యేకంగా – అయత – అనే దానికి కూడా అర్థం చెప్పవచ్చు.

అ+యత్+అ– దీనికి కృషి సల్పుట (యత) అని అర్థం. ప్రాచీన కాలంలో లోక అనే పదం ఉ అనే అచ్చు ముందు కలదిగా కనిపిస్తుంది. అంటే – ఉ లోక – అని కనిపిస్తుందన్నమాట. ఇంకా కొంతమంది "ఊరు – మేక – అవ– లోక సమానంగా వున్నదానికి సంక్షిప్త రూపమని చెపుతారు. దీనికి అర్థం బహిరంగ ప్రదేశం – లేక – విడి ప్రదేశం అని గ్రహించాలి.

లోక అనే పదం లాటిన్ భాషాపరమైన లుకాస్ అనేదానికి సంబంధించింది. ఎందుకంటే సంస్కృతం, లాటిన్ ఇవన్నీ ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినవి.

లాటిన్ బాషలో లుకాస్ అంటే అడవులను నరికి శుభ్రం చేయడం అని అర్థం.

ఇంతేగాకుండా లిథూనియన్ బాషలో "లౌకాన్" అనే పదం వుంది. ఆ భాషలో "లౌకాన్" అంటే పోలం అని అర్థం.

ఇవన్నీ దేన్ని సూచిస్తున్నాయి?

లోకాయత అనేది వ్యవసాయానికి సంబంధించిన పదమని తెలియచేయటం లేదా?



తాత్వికంగా ఇది ఈ లోకానికి, ప్రజలకు సంబంధించిన సిద్ధాంతమని ఋజువవుతోంది.

శ్రమజీవుల సిద్ధాంతం నాస్తికత్వం అని లోకాయత నిర్వచనం ద్వారా మనం గ్రహించవచ్చు. దీన్ని ప్రచారం చేసిన వ్యక్తులగూర్చి సంక్షిప్తంగా తెలుసుకొనేటప్పుడు నిజంగా ఇది బానిసల, పీడిత ప్రజా సిద్ధాంతమనీ ఋజువవుతుంది.

ఇంతేగాక బృహస్పతి సూత్రాలబట్టీ 'ప్రబోధ చంద్రోదయ' నాటకాన్ని బట్టి కూడా ఇది మనకు వాస్తవమని తెలుస్తుంది.

బృహస్పతి సూత్రాలలోనూ, 'ప్రబోధ చంద్రోదయ' నాటకంలోనూ లోకాయతులు "వర్త"ను ఎక్కువ ప్రాధాన్యం గలదానిగా పరిగణిస్తారని రాశారు. "వర్త" అంటే ప్రాథమికార్థం వ్యవసాయం.

కాబట్టి లోకాయతులు, నాస్తికులు వ్యవసాయం ప్రధానవృత్తిగా బ్రతికినవాళ్ళని తేలికగా చెప్పవచ్చు.

ఇప్పుడు చెప్పండి! నాస్తికత్వమంటే ప్రజల సిద్ధాంతమో! ప్రజా వ్యతిరేక సిద్ధాంతమో?

ఈ నిర్వచనాలన్నీ చూచాం. ఇప్పటికి దీన్ని గురించిన ఒక అవగాహనకు వచ్చి వుంటాం.

నేడు పదార్థవాద, భౌతికవాద, చార్వాక, లోకాయత, నాస్తిక అనే పదాలన్నీ పర్యాయపదాలుగా వాడబడుతున్నాయి.

అయితే, ఇందులో చార్వాక అనే పదానికున్న ప్రాచుర్యం లోకాయత అనే అసలు పదానికి లేదు. అదెట్లా జరిగిందో కూడా మనం గమనించాలి.

చార్వాక ఉద్యమం చాలా ప్రాచీనమైందని అనుకొన్నాం. ఇది నిజంగా ఉపనిషత్తులకంటే కూడా ముందుకాలంలో పరిఢవిల్లిన సిద్ధాంతం అంటే క్రీ.పూ. 7,8 శతాబ్దాలకు ముందునుంచే బాగా ప్రచారంలో వుంది. అయితే దీనికి మొదటిపేరు లోకాయతమే.

చార్వాక అనే పేరు క్రీ.శ. 8వ శతాబ్దంవాడైన శాంతరక్షితుని గ్రంథానికి వ్యాఖ్య రాసిన కమలశీలుడి వ్యాఖ్యలో కనిపిస్తుంది. శాంత రక్షితుడు బౌద్ధుడు "తత్వసంగ్రహ" అనే పుస్తకం రాశాడు. ఈ పుస్తకానికి శిష్యుడైన కమలశీలుడు 'పంజలి' అనే వ్యాఖ్య రాశాడు. ఈ వ్యాఖ్యలో భౌతిక వాదాన్ని విమర్శిస్తూ పేర్కొన్నాడు, ప్రస్తుతం మనకు దొరికిన సమాచారాన్ని బట్టి చార్వాక పదాన్ని మొదట వాడినవాడు కమలశీలుడేనని తెలుస్తుంది. చార్వాక సిద్ధాంతానుయాయి అయిన పురందరుడి ప్రసక్తి అందులో కనిపిస్తుంది.

కమలశీలుడి తరువాద ఈ పదం బాగా ప్రచారం పొందింది. న్యాయ వైశేషిక దర్శనానికి ప్రతినిధిగా వున్న జయంతభట్టు కూడా చార్వాకపదాన్ని వాడాడు. ఇతడు

తొమ్మిదో శతాబ్దం వాడు. పదకొండో శతాబ్దంవాడైన రామానుజాచార్యుడు రాసిన వేదాంతసూత్ర భాష్యంలో చార్వాక పదం వుంది. పదార్థవాదాన్ని గుణరత్నుడనే జైన పండితుడు కూడా చార్వాకమనే వ్యవహరించాడు. ఇతడు దాదాపు 15వ శతాబ్దం వాడు. 14వ శతాబ్దంవాడైన మాధవాచార్యులు 'సర్వదర్శన సంగ్రహం'లో 'చార్వాక దర్శనం' అనే పేరుతోనే తన గ్రంథం మొదలుపెట్టాడు. పండితుల అభిప్రాయం ప్రకారం 11వ శతాబ్దంవాడైన కృష్ణమిశ్రుడు 'ప్రబోధచంద్రోయం' నాటకంలో చార్వాక పాత్రను ప్రవేశపెట్టి ఈ పేరును బాగా వ్యాప్తిలోకి తెచ్చినట్టు తెలుస్తుంది.

ఇక్కడ ఇంకో విషయం గమనించాలి. చార్వాక పదాన్ని లోకాయతకు పర్యాయపదంగా వాడిన రచయితలంతా మూల గ్రంథకర్తలు గాదు, మూల గ్రంథ కర్తలు లోకాయత అనే పదాన్ని వాడితే వాటికి వివరణలు, వ్యాఖ్యలు రాసిన వాళ్ళంతా చార్వాక అనే పదాన్ని వాడారు.

ఆఖరికి శంకరుడు కూడా లోకాయత అనే పదాన్ని వాడాడు. కాని అతని అనుయాయి అయిన మాధవాచార్యులు చార్వాక పదాన్ని వాడాడు. అయినా ఈతడు లోకాయత పదాన్ని గుర్తించాడు. దీన్ని కూడా అవహేళన చేయటం కోసం గుర్తించి వాడాడు.

ఇంతమంది రచయితలు లోకాయత పదానికి బదులుగా చార్వాకపదాన్ని వాడటంలో కారణం ఏమైనా వుందా? లేక అనుకోకుండానే ఈ పని జరిగిందా? అని మనం ఆలోచించాలి. కాని, అనుకోకుండా అయితే ఏ ఒక్కరో ఇద్దరో చేస్తారుగాని, పనిగట్టుకొని ఇంతమంది రచయితలు తమ మూల గ్రంథాలను దాటి చార్వాక పదం వాడటంలో కారణం వుందనే చెప్పాలి. ఏ ఉద్దేశం లేకుండా ఈ మార్పు జరిగిందని భావించలేం.

కమలశీలుడి రాతలకంటె ముందే మహాభారతంలో చార్వాక పాత్ర కనిపిస్తుంది. భారతం అనుశాసవిక పర్వంలో చార్వాక పాత్రను గ్రంథకర్త ప్రవేశపెట్టాడు. అతడు దుర్యోధనుని స్నేహితుడైన రాక్షసుడు.

అంటే చార్వాకుడు రాక్షసుడు. చార్వాకమతం రాక్షసమతం. కాబట్టి ప్రజలెవ్వరూ దీన్ని అనుసరించరాదని ప్రజల్ని భీతావహుల్ని చేయటానికే లోకాయతను చార్వాకగా మార్చి వుంటారు.

దీనిలో బౌద్ధ జైనులకు గూడా పాత్ర వుంది. 8,9 శతాబ్దాల్లో బౌద్ధ జైనాలు బ్రాహ్మణ మతంలాగానే సనాతనత్వానికి లోనైనాయి. ప్రజల్లో చోటుచేసుకున్న లోకాయత అంటే పదార్థవాదాన్ని ప్రజల నుంచి దూరం చేయవలసిన అవసరం వాటికి కూడా వుంది. అందుకే పనిగట్టుకుని అవి కూడా భారతంలోని చార్వాక పాత్రను వాడుకొన్నాయి.



## చార్వాకం కల్పితమా?

భారతీయ తత్వశాస్త్ర ప్రపంచంలో ఎనలేనిదిగా గణింపబడి అసూయాపరులందరి దృష్టికీ సహించరానిదిగా వుండి చీల్చి చెండాడబడ్డ చార్వాక సిద్ధాంతం లోకాయత సిద్ధాంతం భారతీయ తాత్త్విక ప్రపంచంలో వాస్తవమైంది కాదనీ, ఇది కేవలం ఊహాజనితమైందనీ రిస్ డేవిడ్స్ అనే పండితుడు చెప్పడం హాస్యాస్పదంగా వుంది.

తన భావవాదపు గొప్పదనాన్ని లోకానికి తెలిసేట్టు చేయటానికి శంకరుడు ప్రతివాదాన్ని తయారుచేసి తన పాండితీ ప్రకర్షచే దాన్ని తృణీకరించి భావవాదం ఎంత గొప్పదో ఋజువు చేయడం కోసం, చాటటం కోసం శంకరుడు దీన్ని ప్రవేశపెట్టాడని రిస్ డేవిడ్స్ చెప్పడం చాలా ఆశ్చర్యకరమైన విషయం. భారతీయ సంప్రదాయానికి పదార్థవాదం అసంభవమని అతని భావన.

లోకాయతకు భారతీయ తాత్త్విక ప్రపంచంలో సముచిత స్థానం వుండి వుంటుంది. అందుకే సంపన్న వర్గాలవారూ, బ్రాహ్మణపండితులూ ఇతర మేధావులూ మధ్యయుగంలో దీన్ని పఠించి, ప్రచారం చేసి వుంటారు. ఇంత బలమైన తాత్త్వికశాఖను రిస్ డేవిడ్స్ ఊహాజనితమని కొట్టిపారవేయడం సమంజసమని ఎవ్వరూ అనరు.

అతని మాటల్లో చెప్పాలంటే–

"... తనను తాను లోకాయతుడనని పిలుచుకున్నవాడు ఎవడూ లేదు. అలాగే లోకాయత జ్ఞానం కూడ లేదు. లోకాయత అనే పేరు గల తత్త్వశాస్త్రంగాని, ఆలోచనావిధానం ఏ ఛాయనూ మిగల్చలేదు.

## లోకాయత జ్ఞాన సిద్ధాంతం

జ్ఞాన సముపార్జనకు లోకాయతులు ఇంద్రియాలపైనే ఆధారపడ్డారు. జ్ఞాన సంపాదనకోసం ప్రమాణాలు తార్కికంగా వివిధాలున్నాయి. ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణం, ఆప్త ప్రమాణం, ఆగమ అంటే వేద ప్రమాణం ఇట్లాంటివి వున్నాయి.

"ప్రత్యక్షానుమానోపమాన శాబ్దాః ప్రమాణాని – "

"ప్రత్యక్షోహ్యేత యోర్మూలమ్
కృతాంతౌ తిహ్యా యోరపి।
ప్రత్యక్షేణా గమో భిన్నః
కృతాంతోవా న కించన॥"

మానవ జ్ఞాన సంపాదనకు ప్రత్యక్షమే పరమావధి. ఎన్ని ప్రమాణాలున్నా ప్రత్యక్షానుభూతికి లొంగక తప్పదు. మతం చూపే ప్రమాణ గ్రంథాలన్నీ అనుభవానికి దూరంగా వుంటాయి. కాబట్టి ఇవి ప్రత్యక్ష ప్రమాణానికి నిలవవు. ఋజువుకు పనికిరావు. అనుమానము మొదలైన ప్రమాణాలను చార్వాకులు తిరస్కరించారు. అయితే అవి అన్ని విషయాలలో గాదు.

"యత్ర యత్రాను మానేస్మిన్
కృతం భావయతో పిచ ।
నాన్యో జీవః శరీరస్య
నాస్తికానాం మతే స్థితః ॥

అనుమాన ప్రమాణానికి సంబంధించినంతవరకూ ఏదీ ముఖ్యమైంది గాదు. ఆశాస్త్రీయ గ్రంథాలైన మత గ్రంథలనాధారంగా చేసుకొనీ, మతాలు చెప్పే నమ్మకాలకు సంబంధించి అనుమాన ప్రమాణాన్ని గానీ నమ్మి ఆత్మ సిద్ధాంతాన్ని ఋజువు చేయలేం.

అంటే చార్వాకులు – అనుమానాది ప్రమాణాలను త్రోసి పుచ్చి కేవలం ప్రత్యక్ష ప్రమాణాన్నే నమ్ముతారని మాధవచార్యులు తమాషాగా వక్రీకరించి ఈ సిద్ధాంతం పట్ల మేధావులకు వైముఖ్యం కలిగేట్లు చేయడానికి యత్నం చేశాడు.

తన 'సర్వదర్శన సంగ్రహం'లో లోకాయతుల జ్ఞాన సిద్ధాంతాన్ని వివరిస్తూ వీళ్ళు అనుమాన ప్రమాణాన్ని తిరస్కరిస్తారని చెప్పాడు. మాధవాచార్యులీ పని చేయటానికి బౌద్ధ దృక్పథం బాసటగా నిలిచింది.

అనుమానాన్ని ప్రమాణంగా తీసుకోకపోతే దినసరి జీవితంలో చాలా అసాధ్యాలను ఎదుర్కోవలసి వస్తుందని ఉదయనుడనే తార్కికుడన్నాడు. ఇదంతా మాధవాచార్య కృతక వ్యాఖ్య వల్ల వచ్చిన ప్రమాదం.

మతం ఊహాజనితంగా చెప్పే – స్వర్గం – నరకం – పుణ్యం – పాపం – ఆత్మ– దైవం – పూర్వజన్మ – పునర్జన్మ– లాంటి వాటిని అనుమాన ప్రమాణం ఆధారం చేసుకొని నమ్మరాదనీ, వాళ్ల అనుమానం చెల్లదనీ లోకాయతులు చెప్పారు.

అంతేగాని, ఇతర విషయాలలో గాదు. ఇంద్రియానుభవానికి దగ్గరగా వుండే వాటి విషయంలో అనుమాన ప్రమాణాన్ని చార్వాకులు అంగీకరిస్తారు.

బుద్ధఘోషుడు లోకాయతుల జ్ఞానసిద్ధాంతాన్ని విమర్శిస్తూ దీనిని 'వితండవాద శాత్త' – అంటే వితండవాద శాస్త్రంగా పేర్కొన్నాడు.

వితండ – వాద – అనేవి రెండు లక్షణాలు. ఒకటి గాదు. ఈ రెండూ పరస్పర విరుద్ధ గుణాలు కలవి.

వితండ – విచ్ఛిన్నానికి దారితీసే, వాదం – నిర్మాణానికి పనికివస్తుంది. ఈ పరస్పర విరుద్ధ లక్షణాలను లోకాయతులకంటగట్టి బౌద్ధులు లోకాయతాన్ని అపహాస్యం చేయటానికి పూనుకొన్నాడు. మాధవాచార్యుడు వీళ్ళనే అనుసరించాడు.



తర్కశాస్త్రంలో వితండ లక్షణం :

"స ప్రతిప% స్థాపనాహీ వో వితండా" అని చెప్పబడ్డది.

స్వపక్షమును స్థాపింపక, పరపక్షమును ఖండించుటయే ఫలముగల వార్తాలాపం వితండ – అని చెప్పబడుతుంది.

**వాద లక్షణం:**

"ప్రమాణ తర్క సాధనో పాలంభః సిద్ధాంతా విరుద్ధః పంచాపయనోప పన్నః పక్ష ప్రతిపక్ష పరిగ్రహో వాదః" ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారాను వానికి అనుకూలించు తర్కముల ద్వారాను తన పక్షమును సాధించుచు పరపక్షమును నిషేధించునట్టిదియు, సిద్ధాంతమును విరోధింపనట్టిదియు, ప్రతిజ్ఞ మొదలగు అయిదు అవయవములు గలదియు, వాది ప్రతివాదులచే పక్ష ప్రతిపక్షములు కలదియు నగు చర్చావిశేషము వాదనమనబడును.

ఈ రెంటికీ ఒకే అర్థం చెప్పి పనికిమాలిన కుతర్కంగా భావించి చెప్పారు. అయితే ఇది వాస్తవమా?

'శుక్ర నీతిసారం' అనే గ్రంథం నాస్తికుల్ని తార్కిక వివాదాల్లో అరితేరినవాళ్ళుగా పేర్కొంది. మత భావాలను తూర్పారబట్టటంలో వీరి వాదనాపటిమ అజేయం. ఇది విధ్వంసక లక్షణం. అదే సమయంలో సిద్ధాంత స్థాపన విషయంలో నిర్మాణాత్మక వైఖరి వీళ్ళ తర్కంలో కనిపిస్తుంది. పునాది లేని, అర్థరహితమైన మతాచారాలను తమ తార్కికశక్తితో తునాతునకలు చేసి వాటికి ప్రజల్లో స్థానం లేకుండా చేస్తున్నాడనే కారణంలో లోకాయతాన్ని వైదికమత ప్రచారకులూ, వాళ్ళతోపాటు సనాతన ధర్మానికి మారిపోయిన బౌద్ధ జైనులూ పనిగట్టుకొని ఈ పని చేశారు.

"పశుశ్చే న్నిహత స్సర్గమ్
జ్యోతిష్టో మేగ మిష్యతి ।
స్వపితా యజమానేన
తత్ర కస్మాన్న హస్యతే ॥

జ్యోతిష్టోమం మొదలైన యజ్ఞాలలో చంపబడ్డ జంతువుకు స్వర్గం వస్తుందని అంటారు. అయితే యజ్ఞకర్త తన తండ్రినే చంపితే తండ్రికే స్వర్గం ఇప్పించినవాడౌతాడు గదా! తండ్రిని ఎందుకు చంపడు?

వృక్షాన్‌భిత్వా పశూన్ హత్వా
కృత్వారుధిం కర్దమం ।
ఇత్యేవం గమ్యతే స్వర్గం
నరకం కేన గమ్యతే ॥

చెట్లను నరికి, జంతువులను చంపి రక్తపు మడుగులు గావించే వాళ్ళంతా స్వర్గానికి వెళుతుంటే నరకానికి ఎవరు వెళతారు?

గచ్ఛతా విహ జంతూనామ్
వ్యర్థం పాథేయ కల్పనమ్ ।
గేహస్థ కృత శ్రాద్ధేన
పధి తృప్తి రవారితా ॥

మనం శ్రాద్ధం జరుపుతూ ఇంటిలో పెట్టిన ఆహారం పై లోకాలలోని పితరులకు చేరుతుందని అంటారు. అయితే పనిమీద పొరుగూరు పోయిన మన కుటుంబ సభ్యులకు వేళ ప్రకారం ఇంటిలో అన్నం విస్తరిలో వడ్డిస్తే ఆకలి తీరుతుందా?

ఈ రకంగా చార్వాకులు మతాచారాలను తమ తార్కిక శక్తితో చాల సరళంగా, నిశితంగా ఖండించి ప్రజల్లో దానికి స్థానం లేకుండా చేయడానికి ప్రయత్నించారు.

హరిభద్రసూరి రాసిన 'షడ్దర్శన సముచ్చయా'నికి లఘువ్యాఖ్య రాసిన మణిభద్రుడు లోకాయతుల ప్రత్యక్ష ప్రమాణాన్ని తెలియజేస్తూ ఇంద్రియానుభవానికి విరుద్ధమైనవాటికి ప్రాధాన్యం ఇస్తే ఎంత నష్టం వస్తుందో వివరించాడు.

"దరిద్రోహి స్వర్గరాశిర్మే అస్తీత్య సుధ్యాయ హేలయై వాదౌః స్థదలయేత్, దాసోపిస్వ చేతసి స్వావితామవలంబ్య కిం కరతాం నిరాకుర్యాదితి ..."

కనపడనివాటికి అస్తిత్వాన్ని అంగీకరిస్తే– దరిద్రుడు తాను బంగారుకుప్పపై కూర్చున్నట్టుగా భావించి తన పేదరికాన్ని అనాసక్తంగా చూచే ప్రమాదం వుంది. బానిస తాను యజమానిని అని భ్రమించే ప్రమాదం వుంది.

లోకాయతులు హేతువుకు నిలబడనివాటిని, కేవలం విశ్వాసం మీద ఆధారపడ్డవాటిని తిరస్కరించారు.

జ్ఞాన సంపాదనా విషయంలో అనుభ వానికి గోచరం కాని దానిని వ్యతిరేకించారు. రెండు విభిన్న సంస్కృతుల మధ్య జరిగిన చర్యగా దీన్ని మనం గమనించాలి. ఎవరెన్ని చెప్పినా లోకాయతులు ఈ దేశపు తొలి తార్కికులు. తమ తార్కికశక్తితోటే విశ్వాసమే ఆధారంగా వున్న అహేతువులైన మత సంప్రదాయాలను, ఆచారాలను బట్టబయలు గావించి ప్రజల్లో వాటికి స్థానం లేకుండా చేయడానికి యత్నం చేశారు. అందుకే వీళ్ళ ధాటికి తట్టుకోలేని మత ప్రచారకులు గుంపుగా చేరి వివిధ రకాల విమర్శనాస్త్రాలను గుప్పించారు. అయినా, ఏమీ చేయలేకపోయారు.

## లోకాయతం – నీతి

నాస్తికులు – "తిను, తాగు, సుఖం అనుభవించు – అప్పు చేసైనా సరే భోగాలనుభవించు" అనే చవకబారు నీతిని చెప్పి, జీవిత విధానాన్ని ఉన్నత



విలువల నుంచి నీచస్థితికి దిగజార్చారని ప్రచారం గావించాడు. అంతా పనిగట్టుకొని ఈ సిద్ధాంత కర్తలపై దుమ్మెత్తిపోశారు.

'సర్వదర్శన సంగ్రహం' రాసిన మాధవాచార్యులు "ఋణం కృత్వా ఘృతంపిబేత్" అని కల్పించి చెప్పాడు.

షడ్దర్శన సముచ్చయకర్త హరిభద్రుడు కూడా –

"పిబ ఖారచజాత శోభనే! యతీతం పరగాత్రి! తన్నతే!
నహి భీరు! గతం నివర్తతే, సము యమమాత్రమిదం కళేబరమ్

ఇది ఉమ్రఖయ్యాము భావాలనే పోలివుంది.

ఓ జాత శోభనా! తిను, తాగు – గడచిన సమయం తిరిగి రాదు. అందుకే ఇప్పుడే అనుభవించు" ఇది చాల పేలవమైన అభిప్రాయం. లోకాయత కేవలం ఇంద్రియ సుఖాలపై వెంపరలాడిన సిద్ధాంతంగా వక్రీకరించటానికి చేసిన యత్నం.

కృష్ణమిశ్రుడు కకూడా 'ప్రబోధ చంద్రోదయ' నాటకంలో చార్వాక పాత్ర ద్వారా లోకాయతుల నీతి ఏమిటో చెప్పిస్తాడు.

క్వా లింగనం భుజని పీడిత బాహు మూలం
భుగ్నోన్న తస్త న మనోహర మాయాతాక్ష్యాః ।
భిక్షోపవాస నియమార్క మరీచి దాహైః
దేహోపశోషణ విధిః కుధియాం క్వచైషః ॥

పురుష బాహుమూలాలచే పీడనములైన మనోహరములైన స్త్రీ కుచాలింగనమెక్కడ? భిక్ష, ఉపవాసం, పంచాగ్నులతో దేహం శుష్కింపచేయటం వంటి శారీరక కష్టముల ఆచారాలెక్కడ? ఇంద్రియ సుఖాన్ని పొందడమే పరమార్థం.

"త్యాజ్యం సుఖం విషయ సంగమ జన్మ పుంసాం
దుఃఖోప స్పష్టమితి మూర్ఖ విచార ణైషా ।
వ్రీహీన్ జిహా సతి సిలోత్తమ తండులాఢ్యాన్
కోనామ భోస్తు షకణోప హితాన్ హితార్థీ ॥

ఇట్లాంటివే చాలా రకాలుగా అంటగట్టారు.

లోకాయతం ఇంత చవకబారు సిద్ధాంతాన్ని ప్రచారం చేసేదైతే, ఇది ప్రజల్లో వేళ్ళూనుకుని వుండేది గాదు. అన్ని తరగతుల ప్రజల్ని ఆకర్షించేది గాదు. మనం కేవలం ప్రతిపక్షుల గ్రంథాలపైనా, వాళ్ళ విమర్శపైనా ఆధారపడడం వల్ల లోకాయతను గూర్చి సరైన విధంగా ఆలోచించలేము. భారతంలోనూ, హరివంశంలోనూ బ్రాహ్మణ పండితులే లోకాయతను అధ్యయనం చేసినట్లు దాన్ని అధ్యయనం చేయటం సగర్వంగా ఒక గొప్ప అర్హతగా చెప్పుకున్నారు. ఇది పైవారు చెప్పినట్లుగా కేవలం ఇంద్రియ సుఖ లంపటత్వంలో మునిగిందైతే ఇంత ప్రభావం చూపేదా? కాదని సులభంగానే చెప్పవచ్చు.

అయితే లోకాయతుల నీతిని, జీవన విధానాన్ని ఎట్లా రచించాలి? దీనికి శత్రువులకు కూడా ఆశ్చర్యం గొలిపే వృత్తాంతం భారతంలోనే వుంది.

ఇంతకుముందు చెప్పిన భారతంలోని చార్వాకుడి వృత్తాంతం లోకాయత నీతికి నిదర్శనంగా వుంది.

ముందు భారతంలోని కథ చూద్దాం. (శాంతి పర్వం - ప్రథమాశ్వాసం).

"...అట్టియెడ దుర్యోధన సఖుండైన చార్వాకుండను నొక్క రక్కసుండు విప్రాకారంబు గైకొని త్రిదండి వేషం బలపడ నయ్యవనీ దేవతాకోటిలో నిల్చియున్నరాధమునకిట్లనియె-

చంప. వినుము నరేంద్ర! సర్వమును విప్రజనంబును గూడి నన్ను బం
చిన విధ మీతడేటి పతి సేసిన పాపము పెద్ద చంపుచో ।
జనకుడు భ్రాత పుత్రుడను శంక యొకించుక లేదు సద్గురుం
డనియెడి కొంకు బుద్ధి నిసుమంతయు బుట్టదు వీని గాల్పనే? ॥

వ॥ అనుమనిరని పలికి వెండియు

ఆ. ఇట్లు శిష్టజనము నేవగింపగజేయు
రాజ్యమేల బంధు రాజినెల్ల
బొలియజేసి యెట్టి భోగంబు లనుభవిం
చెదవు, కల్మషంబు చిక్కె నీకు.

వ॥ అనిన విని యవ్విప్రు లత్యంత వ్యధితాంతఃకరణులగుచోనొందురుల మొగంబులు చూచి, యిట్లు పుట్టంబనియేమియను వచనంబులతో నిరుగుడుపడిరి. ధర్మనందనుడు లజ్జావనతవదనుండై యూరకుండి వారలవలను కనుంగొని కేలుమొగిచి ఫాలభాగంబున గదియించి యిట్లనియె -

తే. మ్రొక్కి వేడెద నను మీరు ధిక్కరింప
కాదరింపుడు మునిసమోహానమతుడ ।
నై వినిశ్చయ పరికి లతాంతరంగ
వర్తనముతోడ నిచటికి వచ్చినాడ ॥

వ॥ అనవుడు భయ సంభ్రమ భరితములగుచు నా భూసురులు "దేవా! ఈ వాక్యంబులు, మావలనం బుట్టినవికావిది యేమియోగాని నీవుత్తమ క్షాత్రధర్మంబున సముపార్జించిన యుజ్జ్వలశ్రీ సుస్థిరతంబొందుమని యతనికి నాశ్వాసంబొనర్చి య మ్మాయాభిక్షువు నాలోకించి పరమబోధంబున నప్పురుషాధము నెరింగి యమ్మహీపతితో - వీడు దుర్యోధన సఖుండగు రాక్షసుండు. సన్యాసి వేషంబున నేతెంచి యాతనికి హితం బాచరించువాడై యీ దుర్వచనంబులాడె, నీ కుక్క మొరిగిన,యంతన పాలమున్నీరుంబోని నీకు గలంగనేల ధర్మాత్ములగు తమ్ములు పమపుసేయం బూజ్యంబగు సామ్రాజ్యంబు వహింపుమని యాదరించి -

కం॥ ఆ రాక్షసు గనుగొని కో
పారంజిత నేత్రులగుచు నవ్విప్రులు హుం ।
కార ముఖరులగుటయు నతి
ఘోరాకృతితోడ వాడు గూలెం బుడమిన్ ॥

తే. బ్రహ్మతేజో నిహతినిట్లు పడి మహాశ
ని ప్రహతి పాతితోర్విజ విభాతినొంది ।
యున్న యద్దానవుని జూచి యన్నరేంద్రు
డెలమి సొంపు వహించె దమ్ములును దాను. ॥

వ॥ ఇట్లు ప్రీతుండై యజాతశత్రుం డవ్విప్రవనమూహంబునకు సవిశేషార్చనంబొనర్చి వీడుకొలిపె. నప్పుడచ్యుతుండు బ్రాహ్మణస్తుతి చేసి యజ్ఞపతితో నిట్లను, గృతయుడంబునం జార్వాకుండను దైత్యుండు తవంబొనరించి వదమ్మభవుండు ప్రత్యక్షంబయిన నిఖిల భూతంబులవలనను నభయంబు వేడిన నద్దేవుండు భూదేవతల కనిష్టంబైన పనులు చేయకుండువాడవు చేసితేని యదియ నీకు దుదియని పలికి యవ్వరంబొసంగె నట్లు లబ్దవరుండై వాడు గర్వించి గీర్వా ణుల బాధింపందొడంగిన వారు విరించింగాంచి యారక్కసుండు సేయు బాధలంజెప్పిన యమ్మహాత్ముండేను మున్న యెరింగి యొనర్చిన నాడె, దుర్యోధనుండును రాజునకు నెచ్చెలియై యచ్చవలుండు తత్కార్యంబాచరింపజొచ్చి యమ్మహీసురులకు మనోవ్యథాకరం బగు కర్మంబుసేయు నప్పని కారణంబుగా వారలకోపంబునంగూలం గలవాడని పలికె, నద్దానవుండు నేడిట వచ్చి తన దుర్వినయంబున బ్రహ్మదండ నిహతుండై పడియున్నవాడని చెప్పి, యప్పీనుంగు వెడల పైపించి, యా భూపాలు నుద్దేశించి వెండియు-

ఆ. మారుకొన్న వారి నీరుసేయము ప్రజ
నరసి మనుపు ధరణి సురుల బ్రోవు ।
మఖిల బంధుజనుల నాశ్రితులను సుఖ
వృత్తి మనపు వెంపు వెలయ నధిప ॥

కురుక్షేత్ర యుద్ధం ముగిసింది. ధర్మరాజు తన తమ్ములతో యుద్ధరంగం

నుండి పట్టణానికి వస్తున్నాడు. పట్టణం బయట ధర్మరాజుకు స్వాగతం పలకటానికి బ్రాహ్మణవర్గం పోగైవుంది. ధర్మరాజు వస్తున్నాడు. ఆ గుంపు లోనుండి ఒక వ్యక్తి, చార్వాకుడి పేరుతో వున్నవాడు ముందుకుపోయి ధర్మరాజుతో అన్నాడు.

"ఏమయ్యా! ఈ బ్రాహ్మణవర్గం నిన్ను శపించమని నన్ను పంపింది. తండ్రి, తాత, సోదరుడు, గురుడు – అనే విచక్షణ లేకుండా అందరినీ చంపావు. ఎంతో పాపం మూటగట్టుకొన్నావు. బంధువులందరినీ చంపి నీవు పాలించేది దేన్ని?"

ఇదీ చార్వాక నీతి. ఇందులో మాధవాచార్యులుగాని, హరిభద్రసూరిగాని, కృష్ణమిశ్రుడు గాని చెప్పిన ఇంద్రియ సుఖలాలసత్వం ఎక్కడుంది?

చార్వాకుడి ఈ హఠాత్సంఘటనకు బ్రాహ్మణులంతా నివ్వెరపోయారు. నైతికంగా తప్పు చేసినందుకు ధర్మరాజు గాయపడి చావాలనుకొన్నాడు. కాని కొంతసేపటికి పురోహితవర్గం తెలివితెచ్చుకుని చార్వాకుణ్ణి తాను పంపలేదనీ, ఈతడు దుర్యోధనుని స్నేహితుడైన రాక్షసుడని చెప్పి – ధర్మరాజుని పొగడి, చార్వాకుణ్ణి దహించివేశారు.

చార్వాకుడు రాక్షసుడనీ, దుర్యోధనుడి స్నేహితుడనీ చెప్పిన ఈ కథ కల్పితమని తెలుస్తూనే వుంది. ఇది చాల దుర్బుద్ధితో కూడుకొన్న పని. అయితే ఇక్కడ ఓ విషయం గమనించాలి.

చార్వాక – లోకాయతపదాలు పర్యాయపదాలు. చార్వాకుడికంటగట్టిన భావాలు లోకాయతకు గూడా వర్తిస్తాయి.

ఇక్కడ ధర్మరాజు చేసిన పని – స్వీయ బంధువుల్ని, గురువుల్ని చంపడం, సామాన్యజనాన్ని గాదు. రక్తసంబంధీకుల్ని చంపడమనేది సాంఘిక మానవుడి నీతికి విరుద్ధం. అటవిక నీతికి భంగం కలిగించటం. ప్రాథమిక మానవ సమాజ విలువల్ని ధర్మరాజు మంటగలిపాడు. వాటిని ధ్వంసం చేయటం తప్పని చార్వాకుడు ఎదురు తిరిగాడు. ఇందులో నీతి వుందా? తప్పు వుందా?

ఏ భావవాది దీన్ని దోషమంటాడో చెప్పమనండి.

అదే విషయం గీతలో కృష్ణుడు – బంధువుల్ని చంపటానికి వెనుకా ముందు ఆలోచిస్తున్న అర్జునుణ్ణి హింసకు పురికొల్పుతాడు.

"హతోవా ప్రాప్యసే స్వర్గం –

జిత్వావా భోక్షసే రాజ్యం" అంటాడు.

హింసకు ప్రేరేపించిన కృష్ణుడినీతి గొప్పదా? మానవ విలువల్ని కాలరాయటం తప్పని ధర్మరాజును నిలదీసిన లోకాయతుడిది తప్పా? ఏది ధర్మం? ఏదధర్మం?

ఎవరు ఇంద్రియ సుఖలాలసత్వాన్ని బోధిస్తున్నారు? ఎవరు ఉన్నత జీవన విలువల్ని భగ్నం చేస్తున్నారు? మనం ఆలోచించాలి.



## లోకాయతం – తత్వశాస్త్రం

లోకాయతం మనకు కనిపిస్తున్న ఈ లోకానికి సంబంధించిన తత్వశాస్త్రం. ఇది ఈ పదంలోనే కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ప్రజల దృక్పథం – అని లోకాయతకు అర్థం చెప్పుకోనేటప్పుడు దీన్ని మనం వేరేవిధంగా అన్వయించలేం.

అంతేగాక, ఇతర తత్వశాఖలకు ఆయా వ్యక్తులు కర్తలుగా వున్నారు. కాని, ఇది ఒక వ్యక్తి ప్రచారం చేసిన తత్వశాస్త్రంగాదు. ప్రజల ఆలోచనల నుంచి బయలుదేరిన ప్రజాతత్వశాస్త్రం. ఈ లోకానికి సంబంధించింది కాబట్టి భౌతిక తత్వశాస్త్రంగానే ఘంటాపథంగా చెప్పవచ్చు. ఇది ప్రజల చరిత్రతో విడదీయరాని సంబంధం వున్న శాస్త్రం.

ప్రపంచ సృష్టిని గూర్చి లోకాయతులు ఏమంటారు? ఇది ఏ అతీతశక్తివల్లనూ ఏర్పడింది కాదంటారు. భౌతిక పదార్థాల పరిణామం వల్ల ఈ జగత్‌సృష్టి ఏర్పడిందనీ, దానికి ఏ భగవంతుడు కారణం కాదని అంటారు.

"కామస్తనదగ్రే సమవర్త తాధి
మనసోరేతః ప్రథమం యదాసీత్ ।
నతో బంధమనతి నిరనిందన్ హృది
ప్రతీష్యాక వయో మనీషా" ॥

ఆంతరంగిక పరిణామం వల్లనే ఈ విశాల విశ్వం ఏర్పడ్డది. ప్రకృతి శక్తికి మొదట బీజం అట్లా ఏర్పడ్డదే. విజ్ఞానులు తమతమ విజ్ఞాన సంపత్తిచే, చేతనాచేతన విశ్వాన్ని విశ్లేషించారు.

"ఇయం వి సృష్టిర్యత అబభూవ
య దివాదదే య దివాన
యో అస్యాధ్యక్షః పరమే
వ్యో మన్సో అగ వేదయదివా న వేద

విశ్వసృష్టి ఎక్కడ నుంచి వచ్చిందో? ఇది సృష్టించబడ్డదా? కాదా? ఈ విషయాన్ని ఏదో స్వర్గలోకంలో వుండి పరిశీలించినవాడుగానీ, పరిశోధించినవాడుగానీ, విచారించినవాడుగానీ ఎవడైనా వున్నాడా? నాస్తికుల్ని దేహాత్మవాదులంటారు. అంటే వేదాంతులు చెప్పే ఆత్మ అనేది శరీరానికి భిన్నమైంది ఏదీ లేదని లోకాయతులు చెప్పారు. ఉపనిషత్తుల్లోనూ, బ్రాహ్మణాల్లోనూ విభిన్న దేహవాదం – అసురతత్వంగా ప్రచారం చేశారు. అంటే లోకాయతుల దేహవాదం – అసురుల దేహవాదం అభిన్నాలనే చెప్పాలి. తంత్రవాదుల దేహవాదం కూడా దీనితో అభిన్నంగానే కనిపిస్తుంది.

ఆత్మ సిద్ధాంతం గురించి మైత్రాయణీ ఉపనిషత్తులో వుంది. ముందుగా దాన్ని తెలుసుకుందాం.

"దేవతలూ – రాక్షసులూ బ్రహ్మ గురించి తెలుసుకోవటానికి బ్రహ్మ దగ్గరకు వచ్చారు. ఇద్దరూ బ్రహ్మకు నమస్కారం చేసి – "ఆత్మ"ను గురించి తెలుసుకోవాలని అనుకొంటున్నాం. దానిని గురించి చెపుతారా? అని అడిగారు. ఆ మాటలు విన్న బ్రహ్మ కొంతకాలం, ఆలోచించి తనలో తాను ఇట్లా అనుకొన్నాడు. "ఈ రాక్షసులు ఆత్మ కావాలని వచ్చారు. వీళ్ళకు ఆత్మను గురించి కాక దానికి వ్యతిరేకమైంది చెపుతాను" అని అనుకొని అసురుల్ని పిలిచి వాళ్ళ వరకు ప్రత్యేకంగా ఆత్మకు వ్యతిరేమైంది చెప్పాడు. మూర్ఖులైనవాళ్ళు బ్రహ్మ చెప్పిన ఆత్మకు వ్యతిరేకమైనదాన్నే ఆత్మగా భావించి, దానిపై ఆధారపడి – ప్రయోజనకరము – శాశ్వతము – అయిన రక్షణను పోగొట్టుకొని అనేక ఇబ్బందులలో చిక్కుకుని జీవితాలను గడుపుతున్నారు. గారడీలోలాగానే – అసత్యమైనదాన్ని సత్యంగా భావించి ప్రచారం చేస్తున్నారు. వేదాల్లో చెప్పిందే సత్యం, దాన్నే విజ్ఞులైనవాళ్ళు ఆచరిస్తారు, దాని ఆధారంగానే జీవిస్తారు. బ్రాహ్మణుడైనవాడెవడూ అవైదికమైనదాన్ని చదువరాదు"

ఇదే కథ 'ఛాందోగ్యోపనిషత్తు'లో కొంచెం వివరంగా వుంది. అందులోని ఇంద్ర విరొచనుల కథ చూడడం అవసరం.

"ప్రజాపతి – హృదయాంశంలో వుండే ఆత్మ, పాపరహితం – చావు పుట్టుకలు – ముసలితనం – ఆకలిదప్పులు లేనిది. అది సత్యకామాలూ – సత్య సంకల్పాలూ కలది. దానినే వెదకాలి. దానినే తెలుసుకోవాలి. దాన్ని ఎరిగినవాడు సర్వలోకాలూ –సర్వకామాలూ పొందుతాడు' అని అన్నాడు.

ప్రజాపతి ఈ మాటల్ని దేవతలూ, అసురులూ ఇద్దరూ కర్ణాకర్ణికగా విన్నారు. ఏ ఆత్మజ్ఞానం వల్ల సమస్త లోకాలయొక్కయు, సర్వ కామాలయొక్కయు ప్రాప్తి కల్గుతుందో ఆ ఆత్మను తెలుసుకోవాలనీ వాళ్ళిద్దరూ మనస్సుల్లో కోరుకొన్నారు.

దేవతల తరఫున ఇంద్రుడు –అసురుల తరఫున విరోచనుడు ఆత్మను తెలుసుకోవాలని బయలుదేరారు. చేతుల్లో దర్భలు ధరించి ఇద్దరూ ఒకరికి తెలియకుండా ఒకరు ప్రజాపతి దగ్గరకు వచ్చారు.

ఇంద్ర విరోచనులిద్దరూ ముప్ఫై రెండు సంవత్సరాలు ప్రజాపతి ఆశ్రమంలో బ్రహ్మచర్యంతో వున్నారు. ఒకనాడు ప్రజాపతి వాళ్ళను చూచి –

'ఏం కోరి మీరీ ఆశ్రమంలో ఇంతకాలం వున్నారు?' అని అడిగాడు.

ఆ మాటలకు వాళ్ళు 'భగవన్! ఆత్మ పాప రహితమైందనీ, జనన మరణాలు లేనిదనీ, ఆకలిదప్పులు లేనిదనీ – సత్యకామాలూ, సత్య సంకల్పాలు కలదనీ, అది తప్పనిసరిగా తెలుసుకోదగ్గదనీ, దాన్ని తెలుసుకొన్నవాడు సర్వలోకాలూ, సర్వకామాలూ పొందగలదనీ– మీరు చెప్పినట్టుగా విని, ఆ ఆత్మను తెలుసుకోవటానికై మీ ఆశ్రమానికి వచ్చాం" అని సమాధానం చెప్పారు.

వాళ్ళు చెప్పిన సమాధానం విన్న ప్రజాపతి –



'ఈ కళ్ళకు కనబడే పురుషుడే ఆత్మ – ఆది అమృతం, అభయం, బ్రహ్మం – అయివుంది' అని వాళ్ళతో చెప్పాడు.

ప్రజాపతి ఈ మాటలు విన్న ఇంద్ర విరోచనులిద్దరూ–

'భగవాన్! ఈ నీళ్ళల్లోనూ, ఈ అద్దంలోనూ కనబడే ఆత్మ ఏది?' అని అడిగాడు.

దానికి ప్రజాపతి –

'నీటిలోనూ, అద్దంలోనూ కనబడే ఆత్మా: కళ్ళకు కనబడే ఆత్మ ఒక్కటే' అని చెప్పాడు.

ఇంకా –

'ఒక పాత్రలో నీళ్ళు పోసి – దానిలో మిమ్మల్ని మీరు చూచుకొండి. తరువాత ఆత్మను గూర్చి మీకు తెలియని విషయాలను నన్నడగండి' అని ఇంద్ర విరోచనులకు ప్రజాపతి చెప్పాడు.

వాళ్ళిద్దరూ ప్రజాపతి చెప్పినట్లే నీటి పాత్రలో తమ్ముతాము చూచుకొన్నారు.

'మీకేమి కనబడింది?' అని ప్రజాపతి ఇద్దర్నీ అడిగాడు.

ఇద్దరూ –

భగవాన్! మాకు మా పూర్ణరూపం కనబడుతోంది. రోమముల నుండి గోళ్ళ వరకూ మా ప్రతిరూపం మా ఛాయ కనబడుతోంది' అని సమాధానం చెప్పారు.

ప్రజాపతి మళ్ళా వాళ్ళను చూచి–

"మీరు బాగా అలంకరించుకొని, మంచి మంచి బట్టలు ధరించి బాగా శుద్ధి చేసుకొని, ఇంకోసారి నీటి పాత్రలో చూడండి" అని అన్నాడు.

ఇంద్ర విరోచనులిద్దరూ అట్లాగే చేశారు.

"మీరేమి చూస్తున్నారు?" అని ప్రజాపతి ఇద్దరినీ ప్రశ్నించాడు.

ఇద్దరూ–

"భగవాన్! మేమెట్లా అలంకరించుకొన్నామో, మంచి బట్టలు ధరించి వున్నామో, శుద్ధి చేసుకొని వున్నామో – అట్లాగే మా ప్రతిబింబాలున్నాయి' అని ప్రజాపతికి సమాధానం చెప్పారు.

ఆ సమాధానం విన్న ప్రజాపతి–

'ఇదే ఆత్మ! అమృతం – అభయం – బ్రహ్మం' అని వాళ్ళకు చెప్పాడు.

ప్రజాపతి చెప్పిన ఆ మాటలు విని ఇద్దరూ శాంత హృదయులై వెళ్ళిపోయారు.

ఇట్లా శాంత హృదయులై వెళుతున్న ఇంద్ర విరోచనులను జూచి ప్రజాపతి "వీళ్ళిద్దరూ ఆత్మను పొందకయే, తెలిసికొనకయే వెళుతున్నారు. వీళ్ళిద్దరిలో ఎవదు – ఈ దేహమే ఆత్మ – అదో ఉపనిషత్తుకు అనుయాయి అవుతాడో వాడు పరాజితుడవుతాడు' అని తనలో తాను అనుకొన్నాడు. విరోచనుడు శాంత

హృదయంతో రాక్షసుల్ని సమీపించి శరీరాన్ని ప్రకాశవంతంగా, సుందరంగా అలంకరించుకోవటంలోనే విరోచనుని చిత్తం మునిగిపోయింది. అతడు – 'ఈ దేహమ్ ఆత్మ' – అని అసురులకు ఉపదేశించాడు. 'ఈ దేహమే ఆత్మ' – దీనినే పూజించాలి; దీనికే సేవలు చేయాలి. ఇట్లా చేసి మనుష్యుడు ఈ లోకాన్ని, పరలోకాన్ని పొందుతాడు – అని విరోచనుడు అసురులకు బోధించాడు.

ఇక ఇంద్రుడు దేవతల దగ్గరకు పోకముందే అతనికి భయం వేసింది. ప్రజాపతి ఉపదేశం వల్ల అతడాత్మ యొక్క వాస్తవిక రూపాన్ని తెలుసుకోలేకపోయాడు. కాబట్టి ఇట్లా ఆలోచించాడు– "నీటిలో కనబడ్డ నీడ శరీరం బాగా అలంకరించుకొంటే, అది కూడా అలంకరించబడుతుంది. శరీరం పరిష్కృతమైతే, ఆ నీడ కూడా పరిష్కృతమవుతుంది. ఇట్లాగే శరీరం గ్రుడ్డిదైతే, ప్రతిబింబం గుడ్డిదౌతుంది. మెల్లకన్ను కలదైతే, అది కూడా మెల్లకన్ను కలదే అవుతుంది. శరీరం కుంటిదైతే – ప్రతిబింబం కూడా కుంటిదవుతుంది. శరీరం నశిస్తే ప్రతిబింబం నశిస్తుంది. కాబట్టి ప్రతిబింబమెట్లా ఆత్మ అవుతుంది? ఈ సిద్ధాంతంలో మంచి – మేలు కనిపిస్తుంది – అని ఇంద్రుడాలోచించాడు.

మరలా ఇంద్రుడు చేతిలో దర్భలు పట్టుకొని ప్రజాపతి దగ్గరకు వచ్చాడు. ప్రజాపతి ఇంద్రుణ్ణి చూచి "ఇంద్రా! విరోచనుడితోపాటు శాంతహృదయుడవై వెళ్ళితివి గదా! మళ్ళా ఏమి కోరి ఇక్కడకి వచ్చావు?" అని ప్రశ్నించాడు. ఆ మాటలు విని ఇంద్రుడు "భగవాన్! నీటిలో కనబడ్డ ప్రతిబింబం శరీరం ఎట్లా అలంకరిస్తే అట్లా కనబడుతుంది. శరీరం గుడ్డిది. మెల్లకన్ను గలది. కుంటిది – అయితే ప్రతిబింబం కూడా అట్లాగే కనబడుతుంది. శరీరం నశిస్తే – ప్రతిబింబం నశిస్తుంది. కాబట్టి శరీరమే ఆత్మ – అదే సిద్ధాంతం నాకు తోచలేదు– అని చెప్పాడు.

"ఇంద్రా! నీవు బాగా తెలుసుకొన్నావు. ఆత్మను గురించి నేను నీకు మరలా ఉపదేశిస్తా! నీవు ఇంకా ముప్పై రెండు సంవత్సరాలు బ్రహ్మచర్యంతో నా ఆశ్రమంలో వుండాలి" అని ప్రజాపతి చెప్పాడు. సరేనని ఇంద్రుడు అట్లాగే అన్నాడు.

ప్రజాపతి ఇంద్రునికి వివిధ మార్గాలద్వారా ఆత్మను గూర్చి చెప్పినట్టు తక్కిన భాగమంతా సాగింది.

దీన్ని బట్టి చూచినా ఆత్మ అనేది ప్రత్యేకంగా శరీరానికి భిన్నంగా వుందని లోకాయతులు చెప్తున్నట్టు లేదు. అసురవాదంగా చెప్పేదంతా లోకాయత సిద్ధాంతమే.

బ్రాహ్మణ వ్యవస్థను వ్యతిరేకించినవారిని ప్రజల నుంచి దూరం చేయటానికి – వాటి పురోహితవర్గం చాలా తంటాలు పడవలసి వచ్చింది. నయానా, భయానా



చేసింది చాలక, సాహిత్యంలో అడుగడుగునా వివిధ రూపాల్లో ప్రజల సిద్ధాంతాన్ని సర్వనాశనం చేసింది.

## లోకాయతం విశిష్టత

చార్వాకంగా, నాస్తికంగా ప్రసిద్ధిచెందిన లోకాయత సిద్ధాంత విశిష్టత భౌతికవాదులుగా మనం చెప్పుకోవటం అతిశయంగా కనిపిస్తుందేమో గాని వాస్తవాన్ని ఆలోచిస్తే యిది నగ్నసత్యమనే తేలుతుంది.

భారతీయ తత్త్వశాస్త్రాన్ని అధ్యయనం చేసే పెద్దలు దీన్ని కాదనలేకపోయారు. ఈ ఉపఖండపు తత్త్వశాస్త్ర శాఖల్లో అన్నిటిపైనా దీని ప్రభావం వుంది. అది కూడా సామాన్యమైన ప్రభావం కాదు.

ఒకవైపు వైదిక సాహిత్యం మీదా, మరో వైపు అవైదిక సాహిత్యం మీదా అమేయమైన తన ప్రభావాన్ని చూపిస్తూనే, రాజీలేని బ్రతుకు బ్రతికిందీ లోకాయత సిద్ధాంతం.

దర్శనశాఖలు ఆరింటిలో పూర్వ మీమాంస – ఉత్తర మీమాంస – న్యాయ – వైశేషిక – సాంఖ్య – లోకాయత అనే ఆరింటిలో నాలుగు నాస్తిక దర్శనాలే అని అంటే భావవాద మిత్రులకు బాధ కలుగుతుందేమో గాని అది నిజం. అందుకే దర్శనాలు ఆస్తిక – నాస్తిక భేదంతో రెండు రకాలైనాయి.

వైదిక పురోహిత వర్గం కూడా దీన్ని పఠించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే బౌద్ధాన్ని మార్చగలిగినట్టుగా దీన్ని మార్చలేకపోయారు. ఒకవేళ దీన్ని మార్చటానికి బ్రాహ్మణవర్గం ప్రయత్నించినట్లయితే, మొత్తం మొత్తంగానే వాళ్ళ పునాదులు కూలిపోయేవి. తమ మనుగడకే ప్రమాదం తెచ్చిపెట్టుకునే తెలివితక్కువ జాతి కాదు ఆర్యజాతి.

## తాత్త్విక పునరుజ్జీవనోద్యమం కావాలి

మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న సకల రుగ్మతలు తొలగాలంటే, మన ఆలోచనా పథం మారాలి. దీనికి తాత్త్విక పునాది వుంటేనే అది కూడా సరైన మార్గంలో వుంటుంది.

దాదాపు ఐదు వేల సంవత్సరాలనాడు మనం, మన స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని కోల్పోయామన్న సంగతి విస్మరించరాదు. సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, వైజ్ఞానికంగా బహుళ సంఖ్యాకులైన ప్రజలు ఈ దేశంలో అణగారి వుండటానికి దారితీసిన పరిస్థితిని గమనించటం అవసరం.

ఏ పరిస్థితినైనా, వ్యవస్థనైనా మార్చుకొనే శక్తి మన చేతుల్లో వుంది. ఒకప్పుడు అవైదికము, బ్రాహ్మణ వ్యతిరేకము, వర్గరహితము, మాతృస్వామికము, వ్యవసాయక ప్రధానము అయిన మన వ్యవస్థ దానికి పూర్తి భిన్నమైన స్వరూపం దాల్చటానికి కారణం ఏమిటి? అనేది మనం ఆలోచించవద్దా?

ఏ వ్యవస్థ అయినా దాని ఉపరితలం నిలబడాలంటే దానికి పునాది గట్టిగా వుండాలి. కాబట్టి పాలకవర్గాలు తాము నిలబెట్టుకోవాలనుకొన్న వ్యవస్థ కలకాలం వుండాలంటే దానికి కావలసిన తాత్త్విక పునాదిని చాల బలంగా, లోతుగా వుండేట్టు చూచుకుంటారు. ప్రస్తుత వ్యవస్థకు పునాదిగా వున్న భావజాలం ఆ పనే చేస్తుంది. ఈ విషయం మనకు అడుగడుగునా స్పష్టంగా కనిపిస్తుంది. నేడు మనం భావిస్తున్న సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ దుష్పరిణామాలన్నీ ఈ భావవాదపు గొప్పదనమే అని చెప్పాలి.

అధిక సంఖ్యాకులైన ప్రజలు అల్పసంఖ్యాకుల పాదాల క్రింద అణగి మణిగి వుండడానికి కారణం ఏమిటి? వాళ్ళు పన్నిన భావజాలపు ఉచ్చు గాదా?

నేడు మనం ప్రస్తుత వ్యవస్థలో నానా యాతనలు అనుభవిస్తున్నాం. ఇది పనికిరాదనీ, దాని స్థానంలో కొత్త వ్యవస్థను నెలకొల్పాలనీ ఆలోచిస్తున్నాం. అయితే ఇది అంతంతమాత్రం చేతనే సాధ్యమౌతుందా? మనం ముందుగా మన ప్రాచీనతను తిరిగి సంతరించుకోవాలి. అందుకే మనం పునరుజ్జీవనోద్యమాన్ని ప్రారంభించాలి.

నేడున్న బ్రాహ్మణ వ్యవస్థకు ప్రత్నామ్నాయ వ్యవస్థను కోరుకొనేటప్పుడు ప్రత్నామ్నాయ తాత్త్విక పునాదిని తిరిగి నిర్మించుకోవలసిన అవసరం వుంది.

ఈనాడు వ్యవస్థ మార్చుకోవాలని కోరుకునే ఉద్యమాలు, ప్రచారకులు చాలామంది వున్నారు. రాజకీయ ఉద్యమాలున్నాయి. సాంఘిక సాంస్కృతిక ఉద్యమాలున్నాయి. అయితే ఇవి ఉద్యమాలకు తాత్త్విక పునాదిని నిర్మించుకోకపోతే, ఆ పునాదిని ఆధారం చేసుకుని పనిచేయకపోతే, ఆ వుద్యమాలు సత్ఫలితాన్ని సాధించవు. అంతేగాదు, అవి ఎక్కువకాలం నిలువలేవు.

అందుకే ఈనాడు మనం తాత్త్విక పునరుజ్జీవనోద్యమాన్ని ప్రారంభించాలి.

## ఆధునీకరించాలి

శాస్త్ర విజ్ఞానం నేడున్నంతగా లేని కాలంలో బయలుదేరిన లోకాయతం నాటి పరిస్థితులకు సరిపడేంతవరకే ప్రచారం పొందింది. దీనికి సంబంధించిన వివరాలు మనకు శత్రువుల రాతల్లో ఖండఖండాలుగా దూషణ భూషణ తిరస్కారాల రూపంతో వుంది. అయితే మనం ఆ రాతల ఆధారంగా జాగ్రత్తగా, చిదిమిన ఇటుకల్నీ ఒక చోట పేర్చి శిథిల సౌధాన్ని పునర్నిర్మించుకొన్నట్లే లోకాయతాన్ని నిర్మించటానికి యత్నం చేయవలసి వుంది. అట్లా చేసినా ఇది నేటి మన ఆధునిక వ్యవస్థ నిర్మాణానికి పూర్తిగా పనికివస్తుందా? అంటే దీన్ని తిరిగి నేటి పరిస్థితులకు తగ్గట్టుగా అభివృద్ధి చేయవలసిన అవసరం వుంది.



నాస్తికత్వం అవసరమా? నాస్తికత్వం అన్ని సమస్యల్ని పరిష్కరిస్తుందా? ఇది సమగ్రమైందా? ఇది వుంటేనే సరిపోతుందా? తక్కిన ఏ ఉద్యమాలూ అవసరం లేదా? వంటి చొప్పదంటు ప్రశ్నలు వేసే మిత్రులు లేకపోలేదు. ఇవన్నీ ఈర్ష్యతోనూ, అసూయతోనూ వేసేవే గాని, నిజంగా దీన్ని గూర్చి తెలుసుకొందామని వేసే ప్రశ్నలు మాత్రం గాదు. నాస్తికత్వం సత్తా ఏమిటో భావవాదులకు మొదటి నుంచీ తెలుసు. కాబట్టే దీన్ని ఏ రకంగా నామరూపాలు లేకుండా చేయాలా – అని ప్రయత్నించి విఫలులైనారు.

నేడు నూతన వ్యవస్థ కావాలని కోరుకొనే మిత్రులందరికీ ఒకటే విజ్ఞప్తి. ఈ దేశంలో పుట్టి ప్రత్యామ్నాయ వ్యవస్థను పునాదిగా వేల సంవత్సరాల నుంచి కొన ఊపిరితో బ్రతుకుతున్న లోకాయతానికి – లేక పదార్థవాదానికి ఆధునిక రూపం తీర్చిదిద్దవలసిన అవసరం వుంది. లేకపోతే, ఎంత తీవ్రంగా వున్న ఉద్యమాలు నడిపినా అవేవీ నేటి పీడక పాలకవర్గాలకు ప్రత్యామ్నాయం కాజాలవనీ, ఎక్కువ రోజులు నిలవవనీ రూఢిగా చెప్పవచ్చు. ఈ విషయంలో ఎవ్వరూ బాధ పడవలసిన పనిలేదు.

## మన కర్తవ్యం

లోకాయతాన్ని ఆధునీకరించడంతో మన పని పూర్తయిందని తలంపరాదు. దానితోపాటు మన ముందు గురుతర కర్తవ్యం వుంది.

దాదాపు ఐదు వేల సంవత్సరాలనాడు మనం మన సహజత్వాన్ని కోల్పోయి, పరాయీకరణ పాలయ్యాం. దాని నుండి ఒకేసారి బయటపడజాలం. వివిధ రంగాలలో మన మస్తిష్కాలు వాళ్ళ వశమయ్యేట్టు పథకాలు వేసి మనలనంతా వాళ్ళల్లోకి మార్చుకొన్నారు. తుమ్మినా, దగ్గినా, లేచినా, కూర్చున్నా, నిద్రపోతున్నా, మేల్కొన్నా, చచ్చినా, పుట్టినా జీవితమంతా భావవాద– అందులో బ్రాహ్మణ మత భావజాల ప్రభావంతో నిండి వుంది.

ఇంత సుప్రతిష్ఠితమైన, నిర్మాణయుతమైన భావజాలాన్ని కాలదన్ని నూతన భావజాలాన్ని సామాన్య ప్రజల మెదళ్ళలో నింపడమంటే మాటలతో అయ్యే పనిగాదు. భారతీయ పదార్థవాదాన్ని ప్రజలు జీర్ణింపచేసుకోవాలి.

మత భావజాలమే పరమ పవిత్రమైందనీ, అదే తమకు విముక్తి కలిగిస్తుందనీ, దాని నీడనే తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చనీ భ్రమలతో వున్న ప్రజా సమూహం తేలికగా లోకాయతాన్ని అంగీకరిస్తుందా? దీన్ని సొంతం చేసుకుంటుందా? ఇది అనుకొన్నంత తేలిక పనిగాదు. అందుకు కావలసిన కార్యక్రమం రూపొందించాలి.

ఆనాడు బ్రాహ్మణమతాన్ని వ్యతిరేకించి, ప్రజల్ని దాని విషవలయం నుండి బయట పడవేయటానికి బుద్ధుడు బాగా కృషి చేశాడు. ఈ విషయంలో అతని కృషి మనకు మార్గదర్శకంగా వుంటుంది.

(1) నూతన సాహిత్యసృష్టి జరగాలి.

(2) నూతన విద్యావిధానం రూపొందించుకొని, మతభావాలకు మన సంతానాన్ని

దూరంగా వుంచాలి.

(3) ప్రచార కేంద్రాలను స్థాపించి, వాటిని నిర్మాణయుతంగా నడపగలగాలి.

(4) అన్నిటినీ మించి ప్రత్యేక నాస్తిక ఉత్సవాలు నిర్వహించాలి.

ఈ పై రూపాలలో అవిరామంగా కృషి జరిగితే తప్ప, మనం తీవ్రమైన మతభావం నుండి ప్రజల్ని బయట పడవేయలేం. ఈనాడిది మరీ అవసరంగా మన ముందు కనిపిస్తుంది. పై విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎదుటివారి భావజాలాన్ని గానీ, వ్యవస్థను గాని తిట్టినంత మాత్రాన, అదే కార్యక్రమంగా తీసుకొన్నంతమాత్రాన మనకు ఒరిగేదేమీ లేదు.

చిత్తశుద్ధితో వ్యవస్థ మార్పు కోరే మిత్రులు ఈ విషయాలు ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

ఈ 'చార్వాకం' పుస్తకంలోని శ్లోకాలు వివిధ ఉపనిషత్తులు, వేదాలనుండి స్వీకరించబడినవి.

మీ

**రామకృష్ణ**



# చార్వాకం

1) కోదదర్శ ప్రథమం జాయామానమస్థ స్వంతం
యదనవస్థా విభర్తి
భూమ్యా అసురసుగాత్మాక్వస్విత్
కోవిద్వాంస ముపగాత్ ప్రష్టుమేతత్

**భావం:**

ప్రకృతి సహజంగా ఈ ప్రపంచం నిర్మాణం జరిగేటప్పుడు ఎవడు చూచాడు? చూచినవాడున్నాడా? ప్రాణంగాని, రక్తం గాని ఈ భూమి నుండి ఏర్పడ్డాయి. వీటికి సృష్టికర్త భగవంతుడనేవాడు ఎవ్వడూ లేడు. ఆత్మ అనేది లేదు. ఆత్మ ఎక్కడి నుంచి వస్తుంది? ఈ ప్రశ్న అవివేకులు వేసే ప్రశ్న.

2) నాసదాసీన్నో సదాసీత్తదానీం
నాసీద్రజో నోవ్యోమా పరోయత్
కిమావరీవః కుహకస్య
శర్మన్నంభః కిమాసీద్గహనం గభీరమ్

**భావం:**

సత్ గాని, అసత్ గాని అప్పుడు లేదు. అంటే ప్రాథమిక దశలో ప్రాణులుగాని, అప్రాణులు గాని లేవు; గాలి లేదు. అంతేగాదు. ఈ విశ్వానికి ఆవల స్వర్గమనేది కూడా ఏదీ లేదు. ఒకవేళ వున్నదంటే అది ఎక్కడ వుంది? అది ఎవరిచేత సృష్టించబడ్డది? అదీగాక గహనమూ, గంభీరమూ ఐన నీరైన వున్నదా?

3) న మృత్యురాసీదమృతం న తర్హి
న రాత్ర్యా అహ్న అసీత్ ప్రకేతః
ఆ నీదవాతం స్వభయాతదేకం
తస్మాద్ ధాన్యన్న పరః కించానస ॥

**భావం:**

మృత్యువుకాని, శాశ్వతమైన ప్రాణం కాని ఏదీ లేదు. రాత్రి పగలు అనేవి కూడా పోలిక గలవి లేవు. నిర్వాయుస్థితి – వాయు స్థితి అనేవి సహజంగా ఏర్పడ్డవే. వీటికావల ఏ అతీతశక్తి వుండి ఈ పరిస్థితిని కలిగించదు.

4) తమ ఆసీత్తమసా గూఢ్హమగ్రే ప్రకేతం
సలిలం సర్వమా ఇదమ్ః ।
తుచ్ఛ్యేనామ్వ పిహితం యనాసీత్తపస
స్తన్మ హినాజాయతై కమ్ ॥

**భావం:**

మొదట ప్రకృతి అంతా చీకటిమయంగా వుండేది. ఈ విశ్వం గంభీరమూ ద్రవమయంగానూ వుండేది. ఉష్ణశక్తి వల్ల ఒకటి ఉత్పన్నమైంది.

5) కామస్తదగ్రే సమవర్తతాధి
మనసోరేతః ప్రథమం యథాసీత్
సతో బంధమసతి నిరవిందన్ హృది
ప్రతీష్యాకవయో మనీషా

**భావం:**

అంతరంగిక పరిణామం వల్లనే విశ్వనిర్మాణం జరిగింది. ప్రకృతి శక్తికి మొదట బీజం అట్లా ఏర్పడ్డదే. విజ్ఞానులు తమ తమ విజ్ఞాన బల సంపత్తిచే చేతనా విశ్వాన్ని విశ్లేషించారు.

6) కో అద్ధావేదక ఇహ ప్రవొచత్కృత
అజాతా కృత ఇయం విసృష్టి ।
అర్వాగ్దేవా అస్వ విజర్జనే నాధా
కోవేదయత అబభూవ ॥

**భావం:**

ఈ విశ్వసృష్టి ఎక్కడ నుంచి వచ్చిందో? ఎక్కడ నుంచి పుట్టిందో? తెలిసినవాడు గాని, చూచినవాడుగాని ఎవరైనా వున్నారా?

ఈ ప్రపంచోత్పత్తితో పాటే దైవదృష్టి కూడా జరిగిందా? కాలక్రమంగా జరిగిందా?

7) ఇయం విసృష్టిర్యత ఆబభూవ
యది వాదధే యదివానః
యో అస్యాధ్యక్షః పరమే
వ్యోమన్సో అగవేద యదివానవేద

**భావం:**

విశ్వసృష్టి ఎక్కడ నుంచి వచ్చిందో? అది సృష్టించబడ్డదా? కాదా? ఈ విషయాన్ని ఏదో స్వర్గలోకంలో వుండి పరిశీలించినవాడు, పరిశోధించినవాడు, విచారించినవాడు ఎవడైనా వున్నాడా? ఒకవేళ వుంటే అతనికైనా ఈ వివరాలు తెలుసా?



8) సబ్బేధమ్మా అవత్తాతి
యవా పఞ్ఞయ పస్సతి ।
అధ నిబ్బిందతీ దుఖ్ఖే
ఏ సమగ్గో విసుద్ధియా ॥

**భావం:**

మతాలూ – మత ధర్మాలూ – అహేతుకాలనీ – అనర్ధకాలనీ – నిరుపయోగాలనీ – కాల్పనికాలనీ మానవుడు తన వివేకంతో తెలుసుకొన్ననాడు మానవుడి బాధలన్నీ తొలగిపోతాయి. మతాన్ని నమ్మినంతకాలం మానవ బాధలకు అంతం కాని, పరిష్కారం కాని లేవు, మానవ సమాజాన్ని అలముకొన్న సమస్త రోగాలకిదే పరిష్కారమార్గం. సరైన మార్గం.

9) కింతే జటాహి దుమ్మేధ
కింతే అజిన సాటియా ।
అబ్బంతరంతే గహనం
బాహిరం పరిమజ్జసి ॥

**భావం:**

మూర్ఖుడా! అట్టగట్టిన జడలను ధరించడం వల్లగాని, అజిన (జింక) చర్మం ధరించడం వల్ల గాని ఫలితం వుందా? ఎందుకు ధరిస్తున్నారు? ఇవన్నీ అర్థరహితమైనవి కావా?

అజ్ఞానాంధకారంలో మునిగిన నీ ఆలోచనలు నిస్సారమైనవి.

బాహ్యమైన వేషభాషల వల్ల ఫలితం శూన్యం.

10) నక్ఖత్తం పతిమా నేస్తం
అత్థోబాలం ఉపచ్చగా ।
అత్థో అత్థస్స నక్ఖత్తం
కిం కరిస్పంతి తారకా ॥

**భావం:**

తమ జీవిత భవిష్యత్తు కోసం జ్యోతిషశాస్త్రాన్ని నమ్ముకొని ఆకాశంలోని చుక్కల వంక చూచేవారు నిజంగా జీవితంలో ఓడిపోయినవారే. మంచి నక్షత్రం –తమ జీవిత గమ్యాన్ని నిర్ధారణ చేస్తున్నదనే విశ్వాసం అశాస్త్రీయమైంది.

నక్షత్రాలకు విశ్వంలోని చేతనాచేతన వస్తుజాలంలో దేన్నీ శాసించే శక్తి లేదు. అవి దేనినీ సృష్టించలేవు; నాశనం చేయలేవు.

11) రోదితేన హవేబ్రహ్మో
మతోపేతో సముట్టహే
నబ్బేనం గమ్మరోదామ
అఞ్ఞా మఞ్ఞాస్స ఞాతకే ॥

**భావం:**

మనిషి చస్తే ఏడుస్తాం గదా! ఎందుకు ఏడుస్తాం? చచ్చిన మనిషి బ్రతికి వస్తాడనా? ఒకవేళ అదే నిజమైతే, అందరం చాలా పెద్దగా ఏడిస్తే తొందరగా బ్రతికివస్తాడు గదా!

12) దృశ్యమానే వినాశేచ
ప్రత్యేక్షే లోక సాక్షికే ।
ఆగమాత్ పరమ స్తీతి
బ్రువన్న పి పరాజితః ॥

**భావం:**

మరణించిన వ్యక్తిని లోకంలో అంతా చూస్తూనే వుంటారు. 'ఆత్మ' అనేది ఏదీ చచ్చిన వ్యక్తి శరీరం నుండి బయటకి వెళుతున్నట్టు ఎవరూ గమనించలేదు.

కాని ఆత్మవాదులు శరీరంలో ఆత్మ అనేది శరీరానికి భిన్నంగా వుంటుందని మొండిగా చెపుతారు. వీళ్ళు చెప్పే మాటలు హేతువుకి నిలబడవు.

13) ఆనాత్మా హ్యాత్మనో మృత్యుః
క్లేశో మృత్యుర్జరామయః ।
ఆత్మానం మన్యతే మోహాత్
తదసమ్యక్ పరం మతమ్ ॥

**భావం:**

వ్యక్తి మరణించటంతో పాటే, శరీరాన్ని అంటిపెట్టుకొన్న చైతన్యం కూడా నశిస్తుంది. చైతన్యాన్నే భావవాదులు ఆత్మ అని అంటారు. శరీరాన్ని అలముకొన్న రోగమూ, విచారం వంటివి మరణానికి దారితీస్తాయి.

శరీరానికి భిన్నంగా ఆత్మ అనేది వుంటుందనే సంగతి అవాస్తవమైంది. కేవలం మూర్ఖులు మాత్రమే ఆత్మను నమ్ముతారు. మూర్ఖత్వమే ఆత్మ సిద్ధాంతానికి దారితీసింది.

14) అధచే దేవమప్యస్తి
యల్లో కేనోప పద్యతే
అజరోయ మమృత్యుశ్చ
రాజాసౌ వన్యతేయధా ॥

**భావం:**

రోగాలను, చావును శాసించే రాజు ఉన్నాడనీ, వాటికతీతంగా అతడుంటాడనీ నమ్మటం ఎట్లాంటిదో, శరీరాని కతిరిక్తంగా (భిన్నంగా) ఆత్మ అనేది వుంటుందని చెప్పటం కానీ, నమ్మటం కానీ అట్లాంటిదే.

చావునూ, రోగాలనూ శాసించే రాజొకడున్నట్లు ఋజువు చేయలేము గదా! అట్లాగే శరీరానికి భిన్నమైన ఆత్మ వుందని కూడా ఋజువు చేయలేము.



15) ప్రత్యక్షం హ్యేతయోర్మూలమ్
కృతాంతై తిహ్య యోరపిః ।
ప్రత్యక్షేణాగమో భిన్నః
కృతాం తోవా నకించన ॥

**భావం:**

ప్రత్యక్షమే జ్ఞానానికి పరమావధి. ఎన్ని ప్రమాణాలున్నా చివరికి ప్రత్యక్ష ప్రమాణానుమతికి లొంగక తప్పదు. మత ప్రమాణ గ్రంథాలన్నీ అనుభవానికి భిన్నంగా వుంటాయి. కాబట్టి యివి ప్రత్యక్ష ప్రమాణానికి నిలవవు. ఋజువుకు పనికిరావు– అందుకే అవి అశాస్త్రీయ గ్రంథాలు.

16) యత్రయత్రాను మానేస్మిన్
కృతం థావయతో పిచ ।
నాన్యో జీవః శరీరస్య
నాస్తికానాం మతేస్థితః ॥

**భావం:**

అనుమాన ప్రమాణానికి సంబంధించి వున్నంతవరకు ఏదీ ముఖ్యమైంది గాదు. అశాస్త్రీయ గ్రంథాలను ఆధారం చేసుకొని గానీ, అనుమాన ప్రమాణాన్ని ఆధారంగా చేసుకొని గానీ – ఆత్మ సిద్ధాంతాన్ని అంటే ఆత్మ ఉనికిని ఋజువు చేయలేం. అవి నిర్ధారణకు నిలిచేవి కావు.

17) రేతోవటకనీ కాయాం
ఘృతపాకాధి వాసనమ్ ।
జాతిః స్మృతిరయస్కాంతః
సూర్యకాంతోం ఋమక్షణమ్ ॥

**భావం:**

విత్తనం నాటితే చెట్టు అవుతుంది. ఆ చెట్టు ఆకుల్ని, పూలను, ఫలాలనూ, బెరడునూ ఇతరాలను ఇస్తుంది.

ఆవు గడ్డి తింటుంది, నీరు తాగుతుంది, కాని పాలనిస్తుంది. పాల ద్వారా వెన్న వస్తుంది. ఆవు తినే ఆహారానికి భిన్నమైన పదార్థాలను పాలను, వెన్నను అది ఇస్తుంది. ఇది ఎట్లా సంభవిస్తుంది?

అట్లాగే మానవ రేతస్సు తన వంటి ఆకారాన్ని ఇస్తుంది. పుట్టిన శిశువుకు బుద్ధి – చైతన్యం – మెదడు మొదలైనవి అబ్బుతాయి. అంతేకాని ఏ దేవుడు దీనికి కారణం కాదు.

18) జీవితంచ శరీరంచ
జాత్యైవ సహజాయతే ।
ఉభేసహ వివర్ధేతే
ఉభే సహవివశ్యత ॥

**భావం:**

ప్రాణమూ శరీరమూ రెండూ ఒకసారి ఏర్పడతాయి. ఈ రెండు సన్నియోగశిష్టాలు. ఉంటే రెండు వుంటాయి. నశిస్తే రెండూ ఒకసారి నశిస్తాయి. అంటే శరీరానికి బయట వేరే జీవుడు అనేది గాని, ఆత్మ అనేది గాని ఏదీ లేదు. ప్రాణం శరీరం రెండు కలిస్తేనే దేహి.

19) భూతానాం నిధనం నిష్ఠా
స్రోత సామిప సాగర ।
నై తత్ సమ్యగ్వి జానంతో
నరా ముహ్యంతి వజ్రధుక్ ॥

**భావం:**

నదులన్నీ సముద్రంలో కలుస్తాయి. సముద్రంలో కలిశాక వీటికి స్వయం ప్రతిపత్తి వుండదు. వాటి రూపమే కనపడదు.

అట్లాగే సకల ప్రాణులూ మరణిస్తాయి. మరణించిన తరువాత వాటికావిధమైన ఉనికి వుండదు.

20) తస్మిన్ పంచత్వ మాపన్నే
జీవఃకి మనుధావతి ।
కింవేదయతి వాజీవః
కిం శృణోతి బ్రవీతిచ ॥

**భావం:**

పంచ భూతాలతో తయారైన ఈ శరీరం మరణిస్తే, వేదాంతులు చెప్పే శరీరంలోని జీవుడు దేన్ని అనుసరిస్తుంది? దేన్ని తెలుసుకుంటుంది? ఏమి మాట్లాడుతుంది? ఏమి వింటుంది? అంతా వట్టిదే. దేహం కంటే భిన్నమైన ఆత్మగాని జీవుడు గాని ఏదీ లేదు.

21) ఏషాగౌః పరలోకస్థమ్
తారయిష్యతి మామితి ।
యోదత్వామ్రియతే జంతుః
సాగౌః కంతారయిష్యతి ॥



**భావం:**

మరణించిన తరువాత పరలోకంలో తనకు పుణ్యగతులు కలిగిస్తుందనే భ్రమతో, పురోహితులకు గోదానం చేస్తారు. ఒకవేళ దానం చేయబడ్డ ఆవు దాత కంటె ముందే చనిపోయిందనుకోండి - అది ఎట్లా తరింపజేస్తుంది?

ఇవన్నీ పొట్టకోటిరాయుళ్ళు స్వార్థం కోసం పెట్టిన ఆచారాలు.

22) గౌశ్చ, ప్రతిగ్రహీతాచ,
దాతాచైవ సమంయదా ।
ఇహైవ విలయం యాంతి
కుతస్తేషాం సమాగమః ॥

**భావం:**

దానం చేయబడ్డ ఆవు, దానం తీసుకున్న గ్రహీత, దానం చేసిన దాత, అంతా అనుకోకుండా ఒకేసారి చనిపోతే, ఈ ముగ్గురు ఎక్కడ కలుస్తారు?

మరణించిన తరువాత వీళ్ళ సమాగమానికి అవకాశమే లేదు.

23) విహగైరుప భుక్తస్య
శైలాగ్రాత్ పతితస్యచ ।
అగ్నినాచోపభుక్తస్య
కుతః సంజీవనం పునః ॥

**భావం:**

చనిపోయిన శరీరాన్ని గ్రద్దలు మొదలైన పక్షులు భక్షిస్తాయి. ఒకవేళ పర్వతంపై నుంచి పడితే శరీరం తునాతునకలౌతుంది. కాలిస్తే బూడిదవుతుంది. ఈ పరిస్థితుల్లో చనిపోయిన శరీరం - తిరిగి బ్రతకటం సాధ్యమా? అంతా బూటకం

24) ఛిన్నస్యయది వృక్షస్య
సమూలం ప్రతిరోహతి ।
బీజాన్యప్య ప్రవర్తంతే
మృతః క్వః పునరేష్యతి ॥

**భావం:**

చెట్టును సమూలంగా పెకలిస్తే - అది ఇక పుష్పించటం కాని, ఫలించటం కాని జరుగదు. కాని దాని విత్తనాల వల్ల తిరిగి అట్లాంటి వృక్షాలు మొలకెత్తి పుష్పఫల భరితాలౌతాయి. అట్లాగే మరణించిన మనిషి తిరిగి జన్మించటం జరగదు. మానవుడి వీర్యం మాత్రమే పునరుత్పత్తిని కలిగిస్తుంది.

25) లోక ప్రసిద్ధ మనుమానం
చార్వాకైర పరీష్యత ఏవయత్తు ।
కైశ్చిల్లౌకికం మార్గం
అతిక్రమ్యానుమాన ముచ్యతే తన్నిషిధ్యతే

**భావం:**

ఈ ప్రపంచానికి చెందిన అంటే వాస్తవమైన భౌతిక ప్రపంచానికి చెందిన అనుమానాన్ని – ఊహను మనం అంగీకరిస్తాం. అంతేగాని, ఈ ప్రపంచానికావల ఊహాత్మక – భ్రమజనితమైన అనుమానాన్ని మనం అంగీకరించం. ఈ ప్రపంచానికతీతంగా వున్నదాన్ని దేన్నీ ఋజువు చేయలేం. అది కేవలం నిరాధారమైన భ్రమ మాత్రమే.

26) పశ్యామిశృణో మిత్యాది
ప్రతీత్యామరణ పర్యంతమ్ ।
యావంతీద్రియాణి తిష్ఠంతి తాన్యేవాత్మా ॥

**భావం:**

ప్రాణి జీవించినంతకాలం వినటానికీ, చూడటానికీ, రుచికీ మొదలైన జ్ఞాన సంపాదనకు తోడ్పడ్డ అవయవాలే చైతన్యాన్ని కలిగి వున్నాయి. వీటికి మించి శరీరంలో 'ఆత్మ' అనేది ఏదీ లేదు.

27) నస్వర్గో నాసవర్గోవా
నైవాత్మా పారలౌకికః ।
నై నవర్ణాశ్రమాదీనామ్
క్రియాశ్చ ఫలదాయికాః ॥

**భావం:**

స్వర్గనరకాలనేవి లేవు; మరణించిన తరువాత పరలోకాలకు పోయే 'ఆత్మ' అనేది కూడా ఏదీ లేదు. కుల వ్యవస్థ అనేది కుటిలాత్ముల కల్పన. అట్లాగే బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు ఆశ్రమాలు కూడా నిరుపయోగమైనవే.

28) అగ్నిహోత్రం త్రయోవేదాః
త్రిదండం భస్మ గుంఠనమ్ ।
బుద్ధిపౌరుష హీనానామ్
జీవికేతి బృహస్పతి ॥

**భావం:**

యజ్ఞయాగాలు చేయటం, ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం అనే మూడు వేదాలు – శరీరానికి బూడిద పూసుకోవటం, త్రిదండం ధరించడం, వన్నీ బుద్ధిగాని,



పౌరుషం గాని లేని బ్రతుకుతెరువుగాళ్ళు తమ జీవనం కోసం పెట్టుకొన్నవి. అంతేగాని యదార్థాలు గావు. మానవ శ్రమను తక్కువగా చూచే మేథోజీవుల కల్పనే ఇదంతా!

29) పశుశ్చేన్ని హతః స్వర్గమ్
జ్యోతిష్టోమే గమిష్యతి ।
స్వపితాయజమానేన
తత్రకస్మాన్న హన్యతే ॥

**భావం:**

జ్యోతిష్టోమము మొదలైన యజ్ఞాలలో చంపబడ్డ జంతువు స్వర్గం చేరుతుందని యజమాని చెపుతూ వుంటాడు. ఇదే నిజమైతే – యజ్ఞకర్త తన తండ్రిని బలియిస్తే – తండ్రికి స్వర్గం వస్తుంది గదా! తన తండ్రి స్వర్గంలో ఎన్నో సుఖాలు అనుభవిస్తాడు. తండ్రిమీద ప్రేమ వున్న వాడెవడైనా యజ్ఞం మీద నమ్మకముంటే ఈ పని తప్పకుండా చేయాలి. కాని అట్లా చేయడు. కాబట్టే ఇదంతా అబద్ధమని తేలుతుంది.

30) మృతానామపి జంతూనామ్
శ్రాద్ధంచే తృప్తి కారణమ్ ।
నిర్వాణస్య ప్రదీపస్య
స్నేహః సంవర్ధమేచ్ఛిఖామ్ ॥

**భావం:**

చనిపోయిన పితరులకు శ్రాద్ధం పెడుతూ వుంటారు. శ్రాద్ధంలో పెట్టిన ఆహారం పరలోకంలో వున్న పితరుల ఆకలిని తీరుస్తుందని చెపుతారు. అయితే – ఆరిపోయిన దీపాన్ని తిరిగి వెలిగించకుండా, దానిలో నూనె పోస్తేనే సరిపోతుంది గదా! అదే మండుతోందా? కాదు.

అట్లాగే శ్రాద్ధంలో సంవత్సరానికోసారి మన యింటిలో పెట్టిన ఆహారం చచ్చిన పితరుల ఆకలిని చల్లార్చదు. చచ్చినవాడెట్లా వుంటాడు? ఎక్కడ వుంటాడు? పరలోకాలు అబద్ధమే గదా!

31) గచ్ఛతామిహ జంతూనామ్
వ్యర్థం పాథేయ కల్పనమ్ ।
గేహస్థకృత శ్రాద్ధేద
పధితృప్తిరవారితా ॥

**భావం:**

మనం శ్రాద్ధం జరుపుతూ ఆ రోజు ఇంటిలో పెట్టిన ఆహారం పరలోకంలోని పితరులకు చేరి వారి ఆకలి మంటను చల్లార్పుతుందని అంటారు. అయితే – పని మీద పొరుగు గ్రామానికి పోయిన మన యింటిలోని మనిషికి దారిలో కడుపు

నిండటం కోసం, వేళ ప్రకారంగా విస్తరిలో అన్నం పెడితే ఆకలి తీరుతూ వుంటుంది గదా! దీనితో శ్రమ లేకుండానే అతడు తన ప్రయాణాన్ని కొనసాగించవచ్చు గదా!

కాని యిది సాధ్యం గాదు.

32) స్వర్గస్థితా యదాతృప్తి
గచ్ఛేయుస్తత్రదానతః ।
ప్రాసాదస్యో పరిస్థానామ్
అత్రకస్మాన్నదీయతే ॥

**భావం:**

శ్రాద్ధంలో మనం పెట్టిన ఆహారం తెలియని దూరంలో వున్న స్వర్గంలోని పితరులకు తృప్తిని కలిగిస్తుందంటారు. అట్లాంటప్పుడు మేడ పై భాగాన వున్న కుటుంబసభ్యులు భోజనానికి క్రిందికి దిగివచ్చే పని లేకుండా, క్రిందనే వున్న వంటగదిలో వేళ ప్రకారం ఆహారం ఆకులోనో, పళ్ళెంలోనో వడ్డిస్తే, పైవారి ఆకలి తీరుతుంది గదా!

ఎక్కడో అల్లంత దూరాన తెలియని లోకంలోకి భూమి మీద మనం పెట్టిన శ్రాద్ధపు కూడు చేరితే, ఇంటిలోనే క్రింద నుంచి పై అంతస్తులోకి చేరకుండా వుంటుందా!

ఇది అబద్ధమైతే, పితర లోకంలోకి శ్రాద్ధం చేరటం కూడా అబద్ధమే.

33) యావజ్జీవేత్ సుఖం జీవేత్
నాస్తి మృత్యుతగోచరః ।
తస్మీభూతస్య దేహస్య
పునరాగమనం కుతః ॥

**భావం:**

బ్రతికినంత కాలం సుఖసంతోషాలతో బ్రతుకు. కంటికి కనిపించని చావుకు భయపడవలసిన పనిలేదు. అది లేదు, చనిపోయిన తరువాత కాలి బూడిదైన శరీరం - అంటే ఈ జన్మ తిరిగిరాదు. మరల, మరల పుడతామని చెప్పే మాట అబద్ధం.

ఇక్కడ దీనికి రెండో పాదం.

"ఋణం కృత్యాఘృతం పివాత్" అని, కొన్ని చోట్ల వుంది. దీనికి "అప్పు చేసి నేయి తాగు" అని అర్థం చెప్పి - నాస్తికులు జీవనం కోసం పరుల దగ్గర అప్పు తీసుకొని తిని, విలాసాలు అనుభవించి, అప్పు తిరిగి తీర్చకుండా ఎగవేస్తారని చెడుగా ప్రచారం చేస్తారు.



34) యదిగచ్ఛేత్ వరం లోకమ్
దేహా దేష వినిర్గతః ।
కస్మాత్ భూయోన చాయాతి
బంధు స్నేహ సమాకులః ॥

**భావం:**

చనిపోయిన తరువాత పాంచభౌతికమైన ఈ శరీరాన్ని విడిచి, ఆత్మ అనేది బయటకు పోయినట్లయితే, తన కోసం ఏడ్చిన బంధువులను ఇతర ఆప్తులను చూడడానికి ఆ ఆత్మ తిరిగిరాదేమి? ఆత్మ అనేది వుంటే గదా!

35) తతశ్చజీవనోపాయో
బ్రాహ్మణైర్విహితస్త్విహ ।
మృతాణాం ప్రేతకార్యాణి
నత్వన్యద్విద్యతే క్వచిత్ ॥

**భావం:**

చచ్చిన తరువాత చేసే కర్మకాండ గాని, తద్దినాలు, శ్రాద్ధకర్మలు గాని పురోహిత వర్గం తమ పొట్టకూటి కొసం పెట్టుకొన్నవే గాని, ఇంకో రకమైన ప్రయోజనం కలవి గావు.

36) త్రయోవేదస్య కర్తారః
ధూర్తభాండ విశాచరాః ।
జర్భరీ తుర్ఫరీత్యాది
పండితానాం వచః కుతః ॥

**భావం:**

ఋగ్వేదం, యజుర్వేదం సామవేదం అనే ఈ మూడు వేదాలకు దొంగలు, మూర్ఖులు, తిరుగుబోతులు కర్తలు - వాళ్ళే వీటిని రాశారు. లేకపోతే జర్భరీ, తుర్భరీ మొదలైన అర్థవిహీనములైన పదాలను పండితులైనవారు ఎవరూ రాయరు.

37) అశ్వస్యాత్రహి శిశ్నంతు
పత్నీగ్రాహ్యా ప్రకీర్తితమ్ ।
భాండై స్తద్వరిత్వరం చైవ
గ్రాహ్యాజాతప్రకీర్తితమ్ ॥

**భావం:**

అశ్వమేధయాగం చేసే సమయంలో, యాగం చేసే యజమాని భార్య - గుర్రపు లింగాన్ని తన యోనిలో పెట్టుకోవాలి. ఈ విషయం యజుర్వేదంలో వుంది. ఇది ఎంత పిచ్చితనమో ఆలోచించండి. ఈ రకమైన ఆచారాలు ఇంకా వున్నాయి. ఈ పనికిమాలిన రాతలు మూర్ఖులు రాసినవే. కాబట్టి మనం వేదాలను అనుసరించరాదు.

38) న కంటకానాం ప్రకరోతి తైక్ష్ణ్యమ్
విచిత్ర భావం మృగపక్షిణాంచ ।
మాధుర్యమిక్షోః కటుతాంచనింబ
స్వభావతః సర్వమిదం ప్రవృత్తమ్ ॥

**భావం:**

ముళ్ళకు పదునుగాని, పక్షులకు విచిత్రమైన రంగులు గాని, పశువులకు వివిధ స్వభావాలు గాని, చెరకునకు తీపి గానీ, నిమ్మకు పులుపు గాని, ఇంకా ప్రకృతిలోని వివిధ పదార్థాలకు ఆయా లక్షణాలు గాని ఏ అతీతశక్తి వల్లనో వచ్చినవిగావు, వాటి స్వభావంగానే ప్రతిదానికీ ఆయా లక్షణాలు కలిగాయి.

39) నగ్న శ్రమణక దుర్బుద్ధే
కామక్లేశ పరాయణ ।
జీవికార్థే విచారస్తే
కేనత్వమపి శిక్షితః ॥

**భావం:**

ఓయి దిగంబర సన్యాసీ! బుద్ధి హీనతతో శరీరాన్ని పనికిమాలిన నియమాల పేర కష్టపెడుతున్నావు, ఇది మంచిది కాదు. ఈ రకంగా జీవితం గడుపుమని నీకెవ్వరు చెప్పారు?

40) తృణానామి వహివ్యర్థం
నృణాంజన్మ సుఖద్విషామ్ ।
దోషాస్తు పరిహర్తవ్యా
ఇత్యాచార్యైః స్థిరీకృతమ్ ॥

**భావం:**

మానవశ్రమకు విలువనీయని, జీవిత సుఖాన్ని పరిగణించని – శ్రమకు దూరంగా వుండేవాళ్ళు – ఈ జీవితం వ్యర్థమనీ, కష్టాలతో కూడుకొన్నదనీ చెప్పి ఈ ప్రపంచాన్ని కూడా మాయగా చిత్రించారు. శ్రమను గౌరవించేవాళ్ళు జీవితంలోని కష్టనష్టాలను తొలగించుకుంటూ జీవిత సౌఖ్యాన్ని అనుభవించాలని చెపుతారు.

41) బీజమాత్రం పితాజంతోః
శుక్రశోణిత మేవచ ।
సంయుక్తమ్ ఋతుమన్మాత్రా
పురుషస్వేహ జన్మతత్ ॥

**భావం:**

మానవ సంతతి తల్లిదండ్రుల వల్లనే కలుగుతుంది. స్త్రీ పురుషుల శుక్ర శోణితాల కలయిక వల్ల ప్రాణి ఏర్పడుతుంది. అంతేగాని, భగవంతుడెవరో వుండి మనుషుల్ని పుట్టించలేదు.



42) అష్టకా పితృదైవత్య
మిత్యయం ప్రస్తుతోజనః
అన్నస్యోపద్రవం పశ్య
మృతోహికిమ శిష్యతి

**భావం:**

చచ్చిన పితరుల కోసం శ్రాద్ధ రూపంలో చేసేదంతా వ్యర్థమే. శ్రాద్ధ రూపంలో మనం పెడుతున్న ఆహారాన్ని చచ్చిన పితరులు తింటారా? తినరు గదా! అట్లాంటప్పుడు ఆ ఆహారమంతా వృధాగా పోయేదే గదా! శ్రమ విలువ తెలియని వాళ్ళు పెట్టిన పలికిమాలిన ఆచారం కాబట్టి శ్రమతో ఉత్పత్తిచేసిన ఆహార పదార్థాలను వ్యర్థం చేస్తున్నారు.

43) దాన సంవహనాహ్యేతే
గ్రంథామేధావిభిః కృతాః
యజస్వ దేహిదీక్ష స్వ
తపస్తప్యస్వ సంత్యజ

**భావం:**

శ్రమ చేయటానికి ఒడలు వంచని సోమరులు వివిధ ధర్మశాస్త్రాలు రాసి మనపై రుద్దారు. అందుకే వాటిల్లో మన నుండి సంపదను కాజేసే రాతలు రాశారు.

"త్యాగం చేయండి, దానం చేయండి, మతకర్మ కాండలకు సర్వస్వాన్ని ధారపోయండి" మొదలైన రీతిలో అమాయకుల్ని ప్రేరేపించి, సామాన్యుల సంపదను కొల్లగొట్టి పురోహితవర్గం తమ బొజ్జలు పెంచుకున్నారు.

44) సనాస్తి పర మిత్యేతత్
కురుబుద్ధిం మహామతే ।
ప్రత్యక్షంయత్తదాతిష్ఠ
పరోక్షం పృష్ఠతఃకులు ॥

**భావం:**

ఓ వివేకీ! మనం నివసిస్తున్న ఈ భౌతిక ప్రపంచాని కవతల దీన్ని నడిపించేది గాని, ఇతరమైనదేదీ పరమమైంది వుందని నమ్మబోకు. ఆ మాటలన్నీ అబద్ధం. నీ కంటికి కనిపిస్తున్న ఈ విశ్వం వాస్తవం. ఇది మిథ్య అనీ– మాయ అనీ చెప్పే అబద్ధాలను విశ్వసించరాదు.

45) వైశ్యానర ప్రసాదాత్తు
దుఃఖదా ఇహ ప్రాణినామ్ ।
యజ్ఞ శ్రాద్ధం కృతంక్షుద్రైః
ఐహికస్వార్థ తత్పరైః ॥

**భావం:**

యజ్ఞయాగాది వైదిక కర్మలు శ్రమజీవుల హింసను ఎక్కువ చేస్తున్నాయి. వాళ్ళ సంపదను హరిస్తున్నాయి. శారీరకంగానూ, మానసికంగానూ హింస కలిగిస్తున్నాయి. యజ్ఞం కాని, శ్రాద్ధకాని, ఏ ఇతర కర్మకాండ గాని పనిపాటు చేయని స్వార్థపురోహితవర్గంచే సృష్టించబడ్డాయి. శ్రమను అగౌరవంగా చూచే సోమరిమూక శ్రమజీవుల శ్రమపైనే ఆధారపడి బ్రతకటం నేర్చుకొంది.

46) నిస్వర్గోనైవ మోక్షోత్ర
లోకాః క్లిశ్యంతివై వృధా ।
హింసాయామాస్థితో విష్ణుః
కథం మోక్షం గమిష్యతి ॥

**భావం:**

స్వర్గం గాని, మోక్షం గాని లేవు. ప్రజలు బ్రతికుండగానే పనికి మాలిన ఆచారాలపేరుతో చిత్రహింసల పాలౌతారు. విష్ణువు అవతారం ఎత్తినప్పుడల్లా ప్రజల్ని చంపుతూనే వున్నాడు. ఇట్లా ప్రజాహంతకుడైన విష్ణువు మోక్షం ఇస్తాడా?

47) హింసాప్రాయాః పదాక్రూరా
మాంసాదాః పాపకారిణః ।
సురాస్తు మద్యపానేన
మాంసాదా బ్రాహ్మణాస్త్వమీ ॥

**భావం:**

దేవతలుగా చలామణి అయ్యేవాళ్ళంతా హింస చేసేవాళ్ళు, క్రూరులు, మాంసాహారులు, పాపవర్తనులు – ఇక భూమిలో దేవతలుగా చెప్పబడే పుడమి దయ్యాలు (బ్రాహ్మణులు) కుత్తుకదాకా మాంసం తిని, పీకదాకా సారా త్రాగుతారు.

48) ధర్మేణానేనకః స్వర్గమ్
కథం మోక్షంగ మిష్యతి ।
యచ్ఛయజ్ఞా ది కంకర్మ
స్మార్తం శ్రాద్ధాదికం తథా॥

**భావం:**

మత కర్మకాండలను పాటించినందువల్ల స్వర్గంగాని, మోక్షం గాని రావు, శ్రాద్ధం మొదలైన స్మృతివిహీన కర్మలను ఆచరించినందు వల్లనూ ఫలితం శూన్యం.

49) యూపం (వృక్షాన్) ఛిత్వా పశూన్ హత్వా
కృత్వారుధిర కర్ధమం ।
జత్యేవంగమ్యతే స్వర్గం
నరకంకేన గమ్యతే ॥



**భావం:**

యూప స్తంభాన్ని నరికి, జంతువులను చంపి, రక్తం మడుగు కావించినవాళ్ళు స్వర్గానికి పోతే– ఇంకా నరకం ఎవరు పోతారు! హింస మొదలైన క్రూర కార్యాలు చేసినవాళ్ళు స్వర్గం వెళితే, నరకానికి మంచివాళ్ళు వెళతారా? ఇదంతా సమంజసంగానే వుందా?

యజ్ఞం వద్ద బలి ఇచ్చే జంతువులను ఒక స్తంభానికి కట్టివేస్తారు. ఆ స్తంభాన్ని యూపస్తంభమంటారు.

50) యదిభుక్త మిహాన్యేన
తృప్తిరన్యస్య జాయతే ।
దద్యాత్ ప్రవసతః శ్రాద్ధం
నసభోజన మాహరేత్ ॥

**భావం:**

శ్రాద్ధకర్మలో భోక్తలు తింటే, పరలోకంలోని పితరులకు కడుపు నిండుతుందంటారు. ఒకరు తింటే– ఇంకొకరి పొట్ట ఎట్లా నిండుతుంది? అదే నిజమైతే, పొరుగూరు పోయిన మన కుటుంబ సభ్యుల కడుపు నిండటం కోసం – వేళ ప్రకారం ఇక్కడ మనం తింటే సరిపోతుందా? ఇది జరిగే పనేనా? ఎంత అసంబద్ధమైన విషయం?

51) తారాం బృహస్పతేర్భార్యాం
హృత్వాసోమః పురాగతః ।
తస్యాం జాతో బుధః పుత్రో
గురుర్జగ్రాహ తాంపునః ॥

**భావం:**

ప్రజలచే పూజలందుకొనే దేవతల వ్యక్తిత్వం ఎట్లాంటిదో పరిశీలిస్తే తెలుస్తుంది.

చంద్రుడనేవాడు తన గురువైన బృహస్పతి భార్యను తారను కోరి రమించాడట ఆమెతో. పుత్రుడితో సమానుడైన శిష్యుడు రమిస్తే – తారకు, చంద్రుడికి బుధుడు అనే కొడుకు పుట్టాడట. ఆ తరువాత భార్య సంగతి తెలిసి కూడా బృహస్పతి, తారను యథావిధిగానే స్వీకరించాడట. ఇదీ దేవతలనబడే వారి చరిత్ర.

52) గౌతమస్య మునేః పత్నీ
అహల్యానామ నామతః ।
అగృహ్ణాత్తాం స్వయంశక్రః
వశ్యధర్మో యథాస్థితః ॥

**భావం:**

ఇట్లాంటిదే ఇంకో వృత్తాంతం–

గౌతమముని భార్య అహల్య అనే ఆమెతో ఇంద్రుడు రమించాడు. అది తెలిసిన గౌతముడు భార్యను రాయి కమ్మని శపించాడు.

మతధర్మంలో నీతి ఎంత వుందో తెలుస్తోంది గదా!

53) ఏతధస్యచ్ఛ జగతి
దృశ్యతే పారదారికమ్ ।
ఏవం విధో యత్ర ధర్మః
పరధర్మో మతస్తుకః ॥

**భావం:**

ఈ విధంగా పరుల భార్యలతో రమించిన దేవతలు, ఇతర పురాణాల రుషులు కోకొల్లలు. పురాణాల నిండా ఇట్లాంటి కథలే. కదిలితే, మెదిలితే కనిపిస్తాయి. ఇట్లాంటి బూతు మతం ప్రజలకు సన్మార్గాన్ని చూపిస్తుందా?

దేవతలే రంకు దేవతలైతే, వీళ్ళు ప్రసాదించే మోక్షంగాని, చేసే మేలుగాని ఏముంటుంది? నీతిలేని మతం బూతుకంటే రోత గాదా?

54) నైతద్యుక్తి సహం వాక్యం
హింసాధర్మాయ చేష్యతే ।
హ వీంష్య వలదగ్ధాని
ఫలాయేత్యర్భ కోదితమ్ ॥

**భావం:**

యజ్ఞాదుల్లో హింస చేయటం మతధర్మం కోసమని చెప్పే మాట శోచనీయం. అట్లాగే – హోమగుండంలో వేసే హవిస్సు కూడా నిరుపయోగమైందే గదా! అగ్నిగుండంలో కాలి బూడిదైన హవిస్సు ఏ ఫలితాన్నిస్తుంది? ఇదంతా చిన్నపిల్లలు చెప్పేదానికంటే ఘోరమైనది.

55) యజ్ఞైరనేకైర్దేవత్వ
మవాప్యేంద్రేణ భుజ్యతే ।
శమ్యాదియది చేత్కాష్ఠం
ద్వరం పత్ర భుక్ పశుః ॥

**భావం:**

వంద యాగాలు చేస్తే గాని ఇంద్రుడు గాడు. ఎవరైనా నూరు యజ్ఞాలు చేస్తే, అతడు ఇంద్రుడైపోతాడు. ఆ తరువాత ఇతరులు చేసే హోమాదులలోని హవిస్సు కాలిన బూడిద రూపంతో ఇంద్రుడు గ్రహిస్తాడని అంటారు. జమ్మి మొదలైన కర్రలతో



హోమం చేస్తారు. కాలిన జమ్మి కర్ర బూడిదను ఇంద్రుడు స్వీకరిస్తాడు. ఇంద్రుడి కంటే పశువే నయం. అది తన కిష్టమైన ఎన్నో రకాల ఆకుల్ని మేస్తుంది.

కాలిన కట్టెల బూడిద స్వీకరించే ఇంద్రుడి కంటే సజీవమైన వివిధ వృక్షాల ఆకుల్ని తినే పశువు ఎంతో మేలు గదా! ఈ రకమైన ఇంద్రుణ్ణి చూస్తే నిజంగా జాలి వేస్తుంది.

56) జనశ్రద్ధే యమిత్యేత
దవగమ్య తతోవచః ।
ఉపేక్షా శ్రేయసే వాక్యమ్
రోచతాం యన్మయేరితమ్ ॥

**భావం:**

సత్యాన్ని చెప్పే ఈ వాక్యం విని, అర్థం చేసుకొని ప్రజల్లో ప్రచారం చేయి. మతాలు చెప్పే బూటకాన్ని బయటపెట్టి – వాటి గుట్టు విప్పి చెప్పాలి. దీనివల్ల సమాజానికి – నీకు మేలు కలుగుతోంది.

57) లోకాయతిక పక్షేతు
తత్త్వం భూతచ తుష్టయమ్
పృధివ్యాపస్తథా తేజో
వాయురిత్యేవ నాపరమ్

**భావం:**

ప్రాచీనకాలపు లోకాయతుల (నాస్తికుల, చార్వాకుల) దృష్టిలో నాలుగే భూతాలున్నాయి. భూమి, నిప్పు, నీరు, గాలి.

ఈ నాలుగు భూతాల కలయిక వల్లనే విశాల విశ్వం – అందులో ప్రాణికోటి ఏర్పడింది.

58) ప్రత్యక్ష గమ్మమేవాస్తి
వాస్త్వదృష్ట మదృష్టతః ।
అదృష్టవాది భిశ్చాపి
నాదృష్టమ్ దృష్టముచ్యతే ॥

**భావం:**

ప్రత్యక్షంగా మనం దేనిని చూస్తున్నామో – అంటే వాస్తవమైన ఈ భౌతిక ప్రపంచం సత్యం, దీనికి అతీతంగా, కనిపించకుండా వున్నదేదీ లేదు. అట్లాంటిది వుండటానికే వీలు లేదు. అదృష్టశక్తి అంటే మనకు కనిపించని శక్తి ఏదో వుందని చెప్పేవాళ్ళు కూడా అతీతశక్తిని చూడలేదు. తామే చూడని దానిని వాళ్ళు ఎట్లా ఋజువు చేస్తారు?

59) క్వాపిదృష్ట మదృష్టంచే
దదృష్టం బ్రువతే కథమ్ ।
నిత్యాదృష్టం కథం సత్స్యాత్
శశశృంగా దిభిస్సమమ్ ॥

**భావం:**

అదృష్టమైన అతీతశక్తిని ఎవరైనా చూచివుంటే, అది అదృష్టం కాదు. ఎందుకంటే కనిపించింది కాబట్టి; అది ఏ రకంగానూ ఎవరికీ కనిపించలేదు కాబట్టి. అది లేదనే చెప్పాలి. దాన్ని ఋజువు చేసే మార్గమే లేదు. కనిపించని దాన్ని కనిపించినట్లు చెప్పటమంటే కుందేటి కొమ్మును చూపడం వంటిదే.

కుందేలుకు కొమ్ములుండవు. కాని నేను కుందేలు కొమ్ములు చూశానని ఎవరైనా చెపితే, అది ఎంత వాస్తవమో – ఈ వాస్తవ ప్రపంచానికి అవతల కనిపించని అతీతశక్తి వుందని చెప్పటం కూడా అంతే వాస్తవం.

60) శిఖిన శ్చిత్రయేత్కోవా
కోకిలాన్ కః ప్రతూలియేత్ ।
స్వభావ వ్యతిరేకేణ
విద్యతే, నాత్రకారణమ్ ॥

**భావం:**

నెమళ్ళకు చిత్రవర్ణాలను గాని, కోకిలకు కాకులీ కలస్వనం గాని ఎవరు పెట్టారు? ఆయా పశుపక్ష్యాదులకు, వస్తుజాలానికి గల లక్షణాలు స్వభావంగా వచ్చినవే గాని, దేవుడనేవాడెవ్వడూ పెట్టలేదు.

61) స్థూలోహం తరుణోవృద్ధో
యువేత్యాది విశేషణైః ।
విశిష్టోదేహ ఏవాత్మా
నతతో న్యో విలక్షణః ॥

**భావం:**

"నేను లావుగా వున్నాను, నేను యువకుణ్ణి, నేను ముసలివాణ్ణి – మొదలైన విశేషణాల వల్ల శరీరమే ఆత్మ – అని తేలుతుంది. శరీరానికి భిన్నమయిన ఆత్మ వేరే ఏదీ లేదు."

ఇక్కడ భావవాదులు నేను లావుగా వున్నాను, మొదలైన వాటిల్లో వుండే నేను – అనేది ఎవరు? లావుగా అనేది దానికి విశేషణం గదా! కాబట్టి నేను అనేది ఆత్మ అనీ, లావుగా అనేది వేరే– అనీ చెపుతారు. కాని ఇక్కడ దీనిని కర్మధారయం అను అర్థం చేసుకోవాలి.



62) జడభూత వికారేషు ।
చైతన్య యత్తు దృశ్యతే ।
తాంబూలపూగ చూర్ణానామ్
యోగాద్రాగ ఇవోత్థితమ్ ॥

**భావం:**

జడ పదార్థాలైన నిప్పు, నీరు, గాలి, అగ్ని అనే భూతాల కలయిక వల్ల చైతన్యం కలుగుతుంది. మన శరీరంలో వున్న చైతన్యం – ఆత్మ అనే వేరే అలౌకిక శక్తితో కలుగుతున్నది గాదు. భూతాల కలయిక వల్లనే ఈ శరీరం ఏర్పడ్డది. వీటి అంతర్గత గుణాల కలయికే చైతన్యానికి కారణం.

తమలపాకులు, వక్క, సున్నం వేసుకుంటే నోరు ఎర్రబడుతుంది. ఈ ఎర్రదనం ఎక్కడ నుంచి వచ్చింది? దీనికి బయట కారణం ఏదైనా వుందా? కాదు– ఈ మూడు వస్తువులలోని అంతర్గత శక్తి వల్లనే – కలయిక వల్లనే ఆ గుణం ఏర్పడింది.

అట్లాగే జడ పదార్థాల కలయిక వల్ల చైతన్యం ఏర్పడుతుంది.

63) ఇహ లోకాత్పరో నాన్యః
స్వర్గోస్తి నరకోనచ ।
శివలోకాదయో మూఢైః
కల్ప్యంతేన్యైః ప్రతారకైః ॥

**భావం:**

వాస్తవమైన మనం నివసించే ఈ భూమి కావల స్వర్గం – నరకం అనే లోకాలు లేవు. శివలోకం – అనేది వుంటుందనీ చెప్పటం కూడా అబద్ధం, ఇవన్నీ మూఢులు, అజ్ఞానులు, మోసకారులు సృష్టించిన పదాలు. స్వర్గ నరకాలు మూఢుల సృష్టి అయితే, శివలోకాదులు లోక వంచకుల కూట సృష్టి.

64) అతస్తదర్భం నాయాసం
కర్తృమర్హతి పండితః
తపోభిరూప వాసాద్యై
ర్మూఢఏవ ప్రశుష్యతి ॥

**భావం:**

వివేకం గల వాళ్ళెవరూ స్వర్గ నరకాది లోకాల గురించి ఆలోచించరు; కష్టపడరు. ఇవన్నీ భ్రమలు మాత్రమేనని పండితులైన వారికి తెలుసు.

తెలియని మూఢులు మాత్రం స్వర్గాదులు పొందాలని భావించి, తపస్సు – ఉపవాసాది వ్రతాలు చేస్తారు. అవి ఊహా నిర్మితాలనీ, భ్రమాన్వితాలనీ వాళ్ళకు తెలియదు.

65) పాతివ్రత్యాది సంకే తో
బుద్ధిమద్దుర్బలైః కృతః ।
సువర్ణభూమి దానాదిమ్
ఇష్టా మంత్రణ భోజనమ్ ॥
క్షుత్ క్షామకుక్షిభిర్లోకైః
దరిద్రై రూపకల్పితమ్ ॥

**భావం:**

స్త్రీకి పాతివ్రత్య ధర్మాన్ని అంటగట్టి, అణచివేశారు. ఇది దుర్బలుల ఘనకార్యం. శ్రమ చేయని సోమరితనపు పురోహితవర్గం సువర్ణ దానం, గోదానం, భూదానం వంటి దానాలను చేయండని పురికొల్పారు. ఇదంతా తిండిపోతుల పన్నాగం.

66) నిరంజనస్య కింధూపై
ర్దీ పైర్వా సర్వ సాక్షిణః ।
విజానందైన తృప్తస్య
నైవేద్యం కింభవేదిహ ॥

**భావం:**

నిరంజనుడు, నిర్గుణుడు, సర్వసాక్షి అయిన భగవంతుడికి ధూప దీప నైవేద్యాల వల్ల ప్రయోజనమేమిటి? ఆత్మానందంతో తృప్తిపడే సకలాంతర్యామికి నైవేద్యం వల్ల ఒరిగేదేమిటి?

అంతా చూస్తుంటే గమ్మత్తుగా వుంది గదా!

67) విశ్వానంద యిత్తుస్త స్య
కిం తాంబూలం ప్రకల్ప్యతే ।
ప్రదక్షిణాహ్య నంతస్య
హ్యద్వయస్య కుతోనతిః ॥
వేదవాక్యైర వేద్యస్య
కుతః స్తోత్రం విధీయతే ॥

**భావం:**

ఆనంద స్వరూపుడైన భగవంతుడికి తాంబూలాదుల సమర్పణ ఎందుకు? అనంతుడూ, అద్వంద్వుడూ అయినవానికి ప్రదక్షిణలు చేయటం ఎందుకు? ఎట్లు? వేదవాక్యాలకే పట్టుపడని వానికి స్తోత్రం ఎందుకు?

68) స్వయం ప్రకాశ మానస్య
కుతో నీరాజనం విభోః ।
అంతర్బహిశ్చ పూర్ణస్య
కథ ముద్వాసనం భవేత్ ॥



**భావం:**

స్వయంప్రకాశం గల ఈశ్వరుడికి నీరాజనం సమర్పించటం ఎందుకు? ఇందుగలడందు లేడని – సర్వాంతర్యామియైన భగవంతుడికి ఉద్వాసనం ఏమిటి?

69) లోకాయతా వదంత్యేవం
నాస్తిదేవోన నిర్వృతిః ।
ధర్మా ధర్మౌన విద్యేతే
నఫలం పుణ్య పాపయోః ॥

**భావం:**

దేవుడు గాని, స్వర్గ నరకాలు గాని, మతం గాని, మతాచారాలు గాని లేవు. పాప పుణ్యాలకు ఫలితాలు పరలోకాలలో కలుగుతాయని చెప్పే మాట కూడా అబద్ధం. పాపం – పుణ్యం అనేవి నిరాధారమైనవి – అంటే ఆస్తికులు చెప్పే పరిభాషలో అవి లేవని భావం.

70) ఏతావానేవ లోకోయం
యావదింద్రియ గోచరః ।
భద్రేవృకపదం పశ్య
యద్వదంతి బహుశ్రుతాః ॥

**భావం:**

మన కంటికి కనిపిస్తున్న ఈ భౌతిక ప్రపంచం వాస్తవమైనది. దీనికంటె భిన్నమైన ఇంకో లోకం లేదు. పర లోకాలున్నాయని చెప్పే మాట దబ్బర, మోసం వంచన, కాపట్యం.ఒక పురుషుడు తన స్త్రీకి తోడేలు పాదం చూపిస్తానని వేళ్ళతో ఏదో చూపి భ్రమింపచేస్తాడు. అట్లాగే భావవాదులు పరలోకాలను కూడా భ్రమింపజేసి అమాయకులైన ప్రజల్ని మోసం చేస్తారు.

71) కించ పృధ్వీజలం తేజో
వాయుభూత చతుష్టయం ।
చైతన్య భూమి రేతేషాం
మానంత్వక్షజమేవహిః ॥

**భావం:**

భూమి, నీరు, అగ్ని, వాయువు అనేవి నాలుగు మూల పదార్థాలు. చైతన్యోత్పత్తికి ఈ పదార్థాలే కారణభూతాలు.

ప్రత్యక్ష ప్రమాణం తప్ప, వేరే ప్రమాణాన్ని అంగీకరించనవసరం లేదు.

72) పృధ్వాధిభూత సంహత్యాం
తథా దేహాది సంభవః ।
మదశక్తిః సురాలీగేభ్యో
యద్వత్ తద్వత్ స్థితాత్మతా ః ॥

**భావం:**

భూమి మొదలైన మూల పదార్ధాల వల్లనే శరీరం – దానిలో చైతన్యం కలుగుతున్నాయి. సారా తయారు చేయడానికి వాడు వస్తువుల వల్ల సారాలో మత్తు కలుగుతుంది గదా! అట్లాగే భూమి మొదలగు వాటి కలయిక వల్ల నూతన గుణం ఏర్పడుతుంది. అదే చైతన్యం. ప్రాణం.

73) తస్మాదృష్ట పంత్యాగాత్
అదృష్టేచ ప్రవర్తనామ్ ।
లోకస్వ తద్వి మూఢత్వమ్
చార్వాకాః ప్రతిపేవిరే ॥

**భావం:**

మనకు కనిపిస్తున్న ఈ వాస్తవ ప్రపంచం మిధ్య అనీ, మాయ అనీ, కంటికి కనిపించని బ్రహ్మ సత్యమని, నిత్యమని చెప్పటం, అవివేకం. ఇది మూఢులు, మూర్ఖులు, అవివేకులు, శ్రమజీవనాన్ని వ్యతిరేకించేవాళ్ళు చెప్పేమాట.

74) యదినాను గతో భావః
కశ్చిదవ్యత్రి విద్యతే ।
పరలోకస్త దానస్యాత్
అభావాత్ పరలోకినః ॥

**భావం:**

పునర్జన్మ ఎత్తటానికి అనుసరించేది ఏదీ లేదు. ఉందని కూడా తెలియరావడం లేదు. ఆ పరిస్థితుల్లో ఆత్మ తిరిగి ఇంకో శరీరంలో ప్రవేశిస్తుందని చెప్పటానికి ఆధారాలే లేవు. ఆత్మ అనేది వునికే లేనప్పుడు అది తిరిగి జన్మించడం అనేది అబద్ధమే గదా!

75) దేహబుద్ధీం ద్రియాదీనాం
ప్రతిక్షణ వినాశనే ।
నయుక్తం పారలోకిత్వమ్
నాన్యశ్చా భ్యాపగమ్యతే ॥

**భావం:**

శరీరం, బుద్ధి, సమస్త ఇంద్రియాలూ ప్రతిక్షణం మారుతూ నశిస్తూ వుంటాయి. ప్రతిదీ మారుతూ వుంటుంది. మారకుండా వుండేది ఈ విశాల విశ్వంలో ఏదీ



లేదు. ఈ పరిస్థితుల్లో మార్పు పొందనిది, అవినాశి అయిన బ్రహ్మ పదార్ధం కాని, ఆత్మ అనేది కాని ఏదీ లేదు; పునర్జన్మ అనేది కూడా ఏదీలేదు.

76) సన్నివేశ విశేషేతు
క్షిత్యాదీనాం వివేశ్యతే ।
దేహేంద్రియాది సంజ్ఞేయం
తత్త్వం నాన్యద్ధి విద్యతే ॥

**భావం**

భూమి మొదలైన నాలుగు భౌతిక మూల పదార్ధాలు ఆయా పాళ్ళల్లో కలపటం వల్లనే మన శరీరంగాని, ఇతర అవయవాలు గాని ఏర్పడ్డాయి. ప్రాణం గూడా అట్లా ఏర్పడ్డదే. అంతేగాని ఇంతకుమించి ఆత్మ అనేది ఏదీ లేదు. ఆత్మ లేకపోతే పునర్జన్మ అనేది కూడా లేదు.

77) కార్యకారణతా నాస్తి
వివాదపద చేతసోః ।
విభిన్న దేహ వృత్తిక్వాత్
గవాశ్వజ్ఞాన యోరివ ॥

**భావం:**

ప్రస్తుతం మనం జీవిస్తున్న ఈ ఆత్మకు కారణం పూర్వజన్మ అని చెబుతున్నారు. పూర్వజన్మలో చేసిన పాప పుణ్యకార్యాల వల్ల పునర్జన్మ వస్తుందని, పూర్వజన్మ పైనే పునర్జన్మ ఆధారపడి వుంటుందని అంటే– పూర్వజన్మ – పునర్జన్మ వుంటాయని అంటారు. కాని, పూర్వజన్మ–పునర్జన్మ, రెండు శరీరాలకు సంబంధం ఏమిటి? ఆవు, గుర్రం ఈ రెండు జంతువులైనప్పటికి, ఈ రెంటికి సంబంధం వుందంటామా? ఈ రెండు జంతువుల సంబంధం వంటిదే రెండు ఆత్మల సంబంధం కూడా!

78) న వివక్షి తవిజ్ఞాన
జవ్యావా మతయో మతాః ।
జ్ఞానత్వాదన్య నంతాన
సంబద్ధా ఇవబుద్ధయః ॥

**భావం:**

ఏ రెండు శరీరాలకు ఏ రకమైన కార్యకారణ సంబంధం వుండదు. ఏ శరీర లక్షణాలు అంటే – ఏ వ్యక్తి లక్షణాలు ఆ వ్యక్తికి వుంటాయి. ఇద్దరు వ్యక్తులు ఒక రకంగా ఎప్పుడూ వుండరు. ఆ పరిస్థితుల్లో పూర్వజన్మ ఫలితమే పునర్జన్మ అని చెప్పటానికి వీలు లేదు.

79) సరాగమరణం చిత్తం
నచిత్తాంతర సంధికృత్ ।
మరణజ్ఞాన భావేన
వీతక్లేశస్యతదృధా ॥

**భావం:**

మనిషి తాను చస్తానని తెలుసు. అయినప్పటికి కార్యకారణశక్తి తెలిసినవాడు ఈ ప్రపంచంతో సంబంధం పెట్టుకోవాలనిభావించడు. వ్యక్తి మనస్సుగాని, ఇతర అవయవాలుగాని, భౌతిక పదార్థ నిర్మితాలు. ఇది తెలిసినవాడెవ్వడూ పునర్జన్మను అంగీకరించడు.

80) కాయాదేవతతో జ్ఞానమ్
ప్రాణాపానా ధ్వధిష్ఠితాత ।
యుక్తం జాయత ఇత్యేతత్
కంబళాశ్వ తరోదితమ్ ॥

**భావం:**

వ్యక్తి చైతన్యం గాని, కార్యకారణశక్తిగాని ప్రాణం, అపానం మొదలైనవాటికి ఆధారభూతమైన శరీరంవల్లనే కలుగుతాయి. అంతేగాని – అగోచరమూ, అసంబద్ధమూ, అసత్యమూ అయిన ఏ అతీతశక్తి వల్లనూ కలగవు. శరీరం నాశనమైన తరువాత ఏమీవుండదు. మహాపండితుడు, నాస్తికుడైన కంబళాశ్వతరుడీ విషయం చెప్పాడు.

81) కలలాదిషు విజ్ఞాన
మస్తీత్యేతచ్ఛ సాహసమ్ ।
అసంజాతేంద్రియత్వార్థి
న తత్రార్ధావ గమ్యతే ॥

**భావం:**

ప్రాథమిక పిండ దశలోనే సకల విజ్ఞానం వుంటుందని చెప్పే మాట నిజం కాదు. ఆ పిండదశలో జ్ఞాన సంపాదనకు అవసరమైన జ్ఞానేంద్రియ నిర్మాణం జరుగదు. ఇంద్రియాలు లేకుండా జ్ఞానసంపాదన సాధ్యం కాదు.

82) నచార్థావ గతేరస్యత్
రూపం జ్ఞానస్య యుజ్యతే ।
మూర్ఛాదావసితేనాస్య
సద్భావోనోపపద్యతే ॥

**భావం:**

ఇంద్రియాల ద్వారా సంపాదించిన వస్తుజ్ఞానం తప్ప ఇంకో రకంగా జ్ఞానాన్ని సంపాదించడం అనేది అసత్యం. అంటే ఇంద్రియాల ద్వారా కాక ఇంకోరకంగా



ఆత్మ అనే ద్వారా జ్ఞానం సంపాదిస్తామని చెప్పటం మూర్ఖుల వాదన. ఇంద్రియాలు పనిచేయకుండా వున్నా – మూర్ఛ, మొదలైన అవస్థల్లో ప్రపంచ జ్ఞానం లభ్యం కావటం లేదు గదా! ఇంద్రియాల కతీతంగా జ్ఞాన సంపాదనకు మూలమైన ఆత్మ అనేది కనుక వుంటే మూర్ఛ, మూగ, చెవుడు, గ్రుడ్డి మొదలైన పరిస్థితుల్లో గూడా ప్రపంచజ్ఞానం కలగాలి. కాని అటువంటిదేమీ కలగడం లేదు. కాబట్టి ఇంద్రియాల కతీతమైన ఆత్మ అనేది ఏదీ లేదని తెలుస్తుంది.

83) నచాపిశక్తి రూపేణ
తదా ధీరవతిష్ఠతే ।
నిరాశ్రయ త్వాచ్ఛక్తీనాం
స్థితిర్నహ్యేవ కల్ప్యతే ॥

**భావం:**

జ్ఞాన సంపాదనకు ఆధారభూతాలైనవి జ్ఞానేంద్రియాలు. అవి పనిచేయకపోతే జ్ఞాన సంపాదన లేదు. ముక్కు పనిచేయకపోతే వస్తువాసన తెలియదు. నాలుక పనిచేయకపోతే రుచి తెలియదు. చెవులు పనిచేయకపోతే శబ్దజ్ఞానం లేదు. కన్ను పనిచేయకపోతే వస్తు స్వరూపం తెలియదు, శరీరం మొద్దుబారితే స్పర్శజ్ఞానం లేదు. ఈ స్థితిలో – జ్ఞానేంద్రియాలు పనిచేయకుండా వుంటే, ఏదో శక్తి పనిచేస్తుందని భ్రమించటం వాస్తవం తెలియకనే. మూర్ఛరోగుల్ని, పిచ్చివాళ్ళని, ఇతర మానసిక రోగుల్ని మనం అర్థం చేసుకోలేక వాళ్ళకేదో శక్తి వున్నట్లుగా భ్రమిస్తున్నాం. మూలాధారాలైన ఇంద్రియాలు పనిచేయకపోతే జ్ఞానం లేదు.

84) జ్ఞానాధారాత్మనో సత్వే
దేహ ఏవతదాశ్రయః ।
అంతే దేహ నివృత్తే చ
జ్ఞానవృత్తః కి మాశ్రయా ॥

**భావం:**

ఏ విధంగా చూచినా శరీరంలో ఆత్మ అనేది లేదు. జ్ఞానానికి ఆధారభూతం శరీరం, దాని జ్ఞానేంద్రియాలు మాత్రమే. పాంచభౌతికమైన ఈ శరీరం నశించిన తరువాత జ్ఞానానికి ఆధారం లేదు. ఇక పునర్జన్మ గాని, పరలోకం గాని, ఆత్మగాని ఎక్కడున్నాయి?

85) తదనంతర సంభూత
దేహాంతర సమాశ్రయః ।
యదిదేహో పరోదృష్టః
కథమస్తీతి గమ్యతే ॥

**భావం:**

మరణించిన తరువాత శరీరం నశిస్తుంది. తిరిగి జన్మించటం కల్ల. కాని మరణానంతరం తిరిగి జన్మించటం జరుగుతుందనీ, చైతన్యం తిరిగి వస్తుందనీ అంటారు. మరణించిన తరువాత తిరిగి జన్మించటం ఎవరు చూచారు?

86) ఏకోజ్ఞానా శ్రయస్తస్మాత్
అవాది నిధనో నరః ।
సంసారీ కశ్చి దేష్టవ్యో
యద్వానాస్తికతాపరా ॥

**భావం:**

చైతన్యానికి మూలమైన దానిని. అనాది, అజాతం, అవినాశి, బన దానిని పరిశోధించి తెలుసుకో. అట్లాంటిదేమీ, ఎక్కడాలేదు, దానిని ఋజువు చేయటం ఎవరి వల్లనూ కాదు. కాబట్టి నాస్తికత్వాన్ని (లోకాయతాన్ని, చార్వాకాన్ని) అనుసరించండి.

87) కేచిత్ స్వభావాదిత వర్ణయంతి
శుభాశుభం చైవ భవాభవౌచ ।
స్వాభావికం సర్వమిదం చాయస్మాత్
అతోపిమో ఘో భవతి ప్రయత్నః ॥

**భావం:**

మంచి-చెడు, చావు-పుట్టుకలు; సుఖ-దుఃఖాలు ఇవన్నీ స్వాభావికంగా కలిగేవే. దీని కోసం ఏ దేవుడి మీద ఆధారపడవలసిన పని లేదు.

88) యదింద్రియాణాం నియతః ప్రచారః
ప్రియా ప్రియత్వం విషయేషుచైవ ।
సంయుజ్యతే యజ్జరయార్తిభిశ్చ
కస్తత్రయత్నోననుస స్వభావః ॥

**భావం:**

ఆయా ఇంద్రియాలకు, ఇంద్రియ జ్ఞానం నిర్దేశించబడే వుంది, ఐదు జ్ఞానేంద్రియాలకు ఐదు రకాల జ్ఞానాలున్నాయి. ముక్కుతో వాసనే చూస్తాం. దీనితో రుచి చూడం. అట్లాగే తక్కిన ఇంద్రియాలు కూడా.

కొన్ని వస్తువులు సుఖాన్ని, ఆనందాన్ని కలిగిస్తే కొన్నిటి వల్ల బాధ, దుఃఖమో కలుగుతాయి. ఇదంతా ఎట్లా జరుగుతుంది? ఎవరైనా వీటినిలా నిర్ణయించారా? లేదు. ఆయా పరిస్థితుల బట్టి అది స్వభావంగానే కలుగుతుంది.



మునలితనం వస్తే కొంత కష్టం కలుగుతుంది. జబ్బు చేస్తే బాధ కలుగుతుంది. అంతేగాని ఇదంతా మనం చేసే పాప పుణ్య కార్యాల ఫలితంగా వచ్చే కర్మఫలం అని భావించరాదు.

89) అద్భిర్హుతాశః శమమభ్యుపేతి
తేజాంసిచాపో గమయంతి శేషమ్ ।
భిన్నా నిభూతాని శరీరసంస్థా
న్యైక్యంచగత్వా జగదుద్వహన్తి ॥

**భావం:**

అగ్ని నీటిచే చల్లార్చబడుతుంది. అట్లాగే తక్కిన భౌతిక పదార్థాలు నీరు, గాలి, నేల అనేవి కూడా ఆయా కారణాల వల్ల ఉపశమనం పొందుతాయి; విచ్ఛిన్నం చెందుతాయి. ఈ భౌతిక పదార్థాలు ఆయా పాళ్ళల్లో కలిసి విశ్వ నిర్మాణానికి దోహదపడతాయి.

90) యుతపాణి పాదోదర పృష్ఠమూర్ధ్నా
నివర్తతే గర్భగత స్వభావః ।
యదాత్మనస్తస్యచ తేనయోగః
స్వాభావికం తత్కధయంతి తతజ్ఞాః ॥

**భావం:**

పిండం తల్లి గర్భంలో అభివృద్ధి చెందుతోన్న క్రమంలోనే కాళ్ళు - చేతులు మొదలైన అవయవాలను పొందుతుంది. ఇదంతా క్రమ పరిణతిలో జరిగేదే. అట్లాగే ఇంద్రియ నిర్మాణం జరిగిన తరువాత జ్ఞానం- చైతన్యం కూడా కలుగుతాయి. ఇది స్వాభావిక పరిణామ ఫలితంగా ఏర్పడేదే గాని, ఏ అలౌకిక శక్తి వల్లనో ఏర్పడేది గాదు.

91) కః కంటకస్య ప్రకరోతి తైక్ష్ణ్యమ్
విచిత్రభావం మృగపక్షిణాంచ ।
స్వభావతః సర్వమిదం ప్రవృత్తం
నకామకారోస్తికుతః ప్రయత్నః ॥

**భావం:**

ముంటికి (ముల్లు) వాడి, జంతువులకు, పక్షులకు వివిధ రంగులు, ప్రవృత్తులు స్వభావం వల్ల వచ్చినవే. అంతేగాని ఎవరిదో కోరిక మేరకు వాటికి ఆయా లక్షణాలు రాలేదు; ఎవరూ పెట్టలేదు.

92) వేద ప్రామాణ్యం స్వచిత్ కర్తృవాదః
స్నానేధర్మేచ్ఛా జాతివాదావలేపః ।
సంతాపారంభః పాపహానాయచేతి
ధ్వస్త ప్రజ్ఞానాం లింగాని పంచజాడ్యే ॥

**భావం:**

వేదాలను ప్రమాణంగా అంగీకరించటం, విశ్వానికి సృష్టికర్త భగవంతుడని చెప్పటం, గంగ మొదలైన వాటిల్లో మునగటం, గొప్ప కులమనే గర్వం, పాప విమోచన కోసమని శరీరాన్ని బాధల పాలు చేయటం – అనే ఈ ఐదు పరమ మూర్ఖుల కృత్యాలు.

93) స్వర్గః కర్తృ క్రియాద్రవ్య
నాశేపి యదియజ్వనామ్ ।
భవేద్దావాగ్ని దగ్ధానాం
ఫలంస్యాత్ భూరిభూరుహామ్ ॥

**భావం:**

యజ్ఞయాగాలలో అగ్నిలో పేల్చిన వస్తువులు తగలబడి బూడిదైపోతాయి. హవిస్సులను బూడిదగా, నిరర్ధకంగా కాల్చినందుకు యజమానికి స్వర్గఫలం – లభిస్తుందంటారు. అయితే – దావాగ్నిలో ఎన్నో చెట్లు తగలబడిపోతాయి. ఆ స్థితిలో ఇంకెంత ఫలితం రావాలి.

యజ్ఞంలో తగులబడిపోయిన వస్తువుల కంటె దావాగ్నిలో కొన్నిరెట్లు ఎక్కువ తగులబడుతాయి. కాబట్టి ఫలితం కూడా కొన్ని రెట్లే వుండాలి.

94) ఆత్మాస్తి దేహాత్ వ్యతిరిక్తమూర్తిః
భోక్తా సలోకాతరితః ఫలానామ్ ।
ఆశేయమా కాశతరోః ప్రసూనాత్
ప్రదీయపః స్వాదుఫల ప్రసూతౌ ॥

**భావం:**

శరీరానికి వ్యతిరిక్తమైన ఆత్మ అనేది ఒకటి వున్నదనీ, అదే లోకాంతర ఫలాలను అనుభవించే భోక్త అని చెపుతారు.

ఆకాశవృక్షం పుష్పించి, తీయని ఫలాన్ని ఇస్తుందని చెప్పే మాట ఎట్లాంటిదో, శరీరం కంటే వేరుగా ఆత్మ వుండి, పరలోక ఫలాలని అనుభవిస్తుందని చెప్పటం కూడా అట్లాంటిదే – నిరాధారమైనది.



95) యన్నాస్త్యేవ తదస్తివ స్త్వితి మృషాజల్పద్భిరే వాస్తికై
ర్వాచాలైర్బహుభిస్తు సత్యవచసో నింద్యాకృతా నాస్తికాః ।
హంహోవశ్యత తత్త్వతోయది పునశ్ఛిన్నాదితోవర్ష్మణో
దృష్టఃకిం పరిణామ రూషిత చితేర్జీవః పృధక్కైరపి ॥

**భావం:**

వేదానుయాయులైన ఆస్తికులు అబద్ధాలకోరులు. వాస్తవంగా వున్న ప్రపంచాన్ని లేదని చెపుతారు. లేని ఆత్మను, బ్రహ్మను సత్యమనీ, అదే ఏకమనీ, అద్వితీయమనీ అంటారు. ఇదంతా ఋజువుకు చిక్కనిది. సత్యాన్ని చెప్పే నాస్తికుల్ని అబద్ధాలకోరులైన, అసత్యవాదులైన ఆస్తికులు నిందించడం కూడా జరుగుతుంది.

నిజంగా ఆత్మ అనేది వుంటే, శరీరాన్ని కోసినపుడు అది కనిపించాలి; కాని అట్లా జరగడం లేదు. నిజంగా ఆత్మ అనేది అజ్ఞాతంగా గాక జ్ఞాతంగా వుందని భావిస్తే, శరీరం విచ్ఛిన్నమైనపుడు, దాని అవయవాలన్నీ నాశనమైనపుడు అది ఎక్కడ వుంటుంది? అజ్ఞాతంగా ఎక్కడైనా వుంటుందా! దీనికి సరైన సమాధానం చెప్పేవాడెవడూ లేడు.

96) త్యాజ్యం సుఖం విషయ సంగమ జన్మపుంసామ్
దుఃఖోపసృష్టమితి మూర్ఖ విచారణై షా ।
వ్రీహీన్ జిహాసతి సితోత్తమ తండులాఢ్యాన్
కోనామ భోస్తు షకణోపహితాన్ హితార్థీ ॥

**భావం:**

కష్ట నష్టాలతోను, బాధలతోను కూడిన జీవితానందాన్ని విడిచిపెట్టాలని ఆస్తికులు చెపుతారు. ఇది మూర్ఖుల వాదన. జీవితమంటే సుఖ దుఃఖ సమ్మిశ్రితం. బాధలనుభవిస్తూనే వాటిని అధిగమించి జీవిత సౌఖ్యాన్ని అనుభవిస్తాం.

ధాన్యంపై పొట్టు వుంది గదా! అని బియ్యం తినకుండా వుంటున్నామా? ధాన్యంపై పొట్టు ఒలిచి లోపల వున్న బియ్యాన్ని ఆహారంగా తీసుకొంటున్నాం.

ఆ రకంగానే జీవిత సుఖాలను కప్పిపుచ్చే బాధల్ని తొలగతీసుకొని, జీవిత సౌఖాన్ని అనుభవించాలి.

97) త్యక్త్వాయదై హికాన్ భోగాన్
పరలోకాయ యత్యతే ।
హిత్వాహస్తగతం లేహ్యం
కూర్పరా లేహనం హితత్ ॥

**భావం:**

ఎక్కడో, ఎప్పుడో రాబోయే పరలోక సుఖాలను కోరి, ఈ లోకంలో వున్న సుఖాలను విడిచిపెట్టమని చెప్పటం అవివేక విలసితం.

చేతిలో వున్న లేహ్యాన్ని విడిచిపెట్టి, ఎదుటవాని మోచేతిని నాకటం వంటిదే అవుతుంది.

98) పరలోక ఫలో ధర్మః
కీర్త్యతే తదసంగతమ్ ।
పరలోకోపి నాస్త్యేవా
భావతః పరలోకినః ॥

**భావం:**

ఈ జన్మలో చేసిన మంచి చెడులకు ఫలితాన్ని పరలోకంలోనో, పునర్జన్మలోనో అనుభవిస్తారని చెప్పటం బూటకమే అవుతుంది. పరలోకమే లేదు. ఆ పరిస్థితుల్లో పారలోకిక సౌఖ్యంగాని, పునర్జన్మగాని ఎక్కడ నుంచి వస్తాయి?

99) పృథ్వ్యప్తే జస్సమీరేభ్యః
సముద్భవతి చేతనా ।
గుడపిష్టోదకాదిభ్యో
మదశక్తి రివస్వయమ్ ॥

**భావం:**

మూల పదార్థాలైన భూమి, నీరు, అగ్ని, గాలి అనే వాటి సంయోగం వల్ల చైతన్యం కలుగుతుంది. బెల్లం, పిండి, నీరు వీటిని కలిపి పులియబెట్టితే మత్తు అనే గుణం వస్తుంది గదా!

100)శరీరాన్న పృథక్ కోపి
శరీరీ హంత విద్యతే ।
పరిత్యజ్య శరీరం యః
పరలోకం గమిష్యతి ॥

**భావం:**

మరణానంతరం దేహాన్ని విడిచి పరలోకం పోయే, శరీరానికి భిన్నమైనది ఆత్మ – దేహి అనేది ఏదీ లేదు.

101)నిశ్శంకముపభోక్తవ్యమ్
తతో వైషయికం సుఖమ్ ।
స్వాత్మాన పంచనీయోయం
స్వార్థ భ్రంశోహి మూర్ఖతా॥



**భావం:**

మానవుడు పరలోక కాంక్షతో తన జీవితాన్ని కష్టమయం చేసుకోకూడదు. జీవితంలో సంభవించిన సుఖాలను సంకోచం లేకుండా అనుభవించాలి.

ఆస్తికుల మాటలు, రాతలు చూచి, విని ఇతరులను వంచించరాదు. ఆస్తికుల రాతలకు ఇతరులను మోసం చేయడం మూర్ఖత్వం అవుతుంది,

102) స్నపనే నాంగరాగేణ
మాల్యవస్త్ర విభూషణైః ।
యదేకః పూజ్యతేగ్రావా
పుణ్యంతేన వ్యథాయికిమ్ ॥

**భావం:**

రాతిని విగ్రహంగా చేసి, నిలిపి దానికి అభిషేకం చేసి, విలువైన వస్త్రాలు కట్టబెట్టి – పువ్వులతోనూ, వివిధాభరణాలతోను అలంకరిస్తారు. అయితే ఆ రాయి మోటు రూపం వీడి విగ్రహ రూపం దాల్చి, యిట్లా పూజలందుకోవటానికి అది పూర్వ జన్మలో ఏ పుణ్యం చేసిందో చెపుతారా?

103) ఉత్పద్యంతే ప్రలీయంతే
కర్మణాయది జంతవః ।
ఉత్పద్యంతే ప్రలీయంతే
బుద్బుదాః కేన కర్మణా ॥

**భావం:**

పూర్వ జన్మలో చేసుకొన్న శుభాశుభకర్మల ఫలితంగా సకల ప్రాణులు పుడుతూ గిడుతూ వుంటాయని చెపుతారు.

కాని, నీటి బుడగలు పుట్టి వెంటనే నశిస్తూ వుంటాయి గదా! అవి ఏ జన్మలో ఏ కర్మలు చేసి వుంటాయి?

చావు పుట్టుకలు సహజమైనవే గాని, లేని పూర్వజన్మ కర్మలపై ఆధారపడి వుండవు.

104) తదస్తి చేతనో యావత్
చేష్టతే తావదిచ్ఛయా ।
చేతనస్య వినష్టస్య
విద్యతే న పునర్భవః ॥

**భావం:**

కదలికల కన్నిటికీ మూలమైన చేతనాశక్తి, తనను తాను వదిలించుకొనే స్థితిలో పునర్జన్మను మనం అంగీకరించవచ్చు. చేతనత్వం తన వ్యక్తిత్వాన్ని కోల్పోయి శరీరంతో పాటే తానూ నశిస్తుంది. ఆ పరిస్థితుల్లో పునర్జన్మకు అవకాశమే లేదు.

105) య ఏవమ్రియతే జంతుః
యఏవో త్పద్యతే పునః ।
ఇత్యేద పివాజ్మాత్రం
సర్వధానుప పత్తిభిః ॥

**భావం:**

ప్రతి ప్రాణిలోను శరీరానికి భిన్నమైన ఆత్మ అనేది వుంటుందనీ, అది చావదనీ, నిత్యమనీ, సత్యమనీ అంటుంటారు. దేహం నశించిన తరువాత అదే ఆత్మ తిరిగి ఇంకో శరీరంలో దూరుతుందనీ అంటారు. ఇది కేవలం వాచాలత్వం తప్ప యధార్థం కాదు. కారణం - అట్లాంటిది అసంభవం.

106) భోజ్యాన్యమృత రూపాణి
పేయానిచ యథారుచి ।
ఖాద్యంతాం స్వామినా స్వైరం
నవైరీయో నిషేధతి ॥

**భావం:**

తినదగినవి, రుచ్యములైనవి తినవచ్చును. అట్లాగే ప్రాణి తాను తాగుటకు అర్హమైన పానీయములను తాగవచ్చును. కాని కొంతమంది స్వార్థబుద్ధులు - కుటిల బుద్ధులు భోజ్యములను పేయములను నిషేధించడం జరుగుతుంది. అతడు నిజంగా మానవజాతికి శత్రువు.

యజ్ఞయాగాలు చేసి మాంసం తినటం, సోమరసం పేర మత్తు పానీయములను పీకలదాకా తాగటం, స్వర్గంలో రంభాది అప్సరసలతో సంభోగం కోరటం వంటివి ఆస్తికులు చేస్తూ వాటికంటే నీచమైనవేవో వున్నాయని వీటిని నిషేధించడం విచిత్రంగా వుంది.

నాస్తికులు అర్థ కామాలకు ప్రాధాన్యమిస్తారని కూడా వంకర కూతలు కూస్తారు. వాళ్ళు చేసే దుష్ట చర్యలకన్నా నీచమైనవి ఏమన్నా వుంటాయా?

107)కర్పూరాగరు కస్తూరీ
చందనాది ఖిరాచి తరి ।
ఏకసౌరభ్య నిష్పన్న
ఇవతిష్ఠది వానిశమ్ ॥

108)ఉద్యానయాన జగతీ
చిత్రశాలాది శారియత్ ।
తత్తత్ క్షితీశ ప్రేక్షస్వ
చక్షుః ప్రీత్యై ప్రతిక్షణమ్ః ॥



109)వేణు వీణా మృదంగాను
నాది ఖిర్గీతని స్వనైః ।
దివానిశం తవ స్వామిన్
అస్తుకర్మ రసాయనమ్ ॥

**భావం:**

మానవుడు ఈ లోకంలో వున్న ఆనందింపదగిన వాటితో తన జీవితాన్ని మేళవించి, ఆనందంగా బ్రతకాలి. కర్పూరము, అగరుబత్తి, గంధం, ఉద్యానవనాలు, చిత్రశాలలు, పిల్లనగ్రోవి, వీణ మొదలైన సంగీత వాయిద్యాలు - అన్నీ మానవుడు తన మానసికానందం కోసం సృష్టించుకున్నవే. ఇవి కూడా ఏ భగవంతుడి కోసమో ఉన్నాయని ఎవడైనా చెప్పితే అది మూర్ఖత్వమే అవుతుంది.

110) యావజ్జీవేత్ సుఖంజీవేత్
తావ ద్వైషయికైః సుఖైః ।
నతామేద్ధర్మ కార్యాయ
ధర్మాధర్మ ఫలంక్వ తత్ ॥

**భావం:**

అసత్యమైన పరలోక సుఖాల కోసమని, ఈ జన్మలో లభ్యమైన సుఖమయ జీవితాన్ని విడిచిపెట్టి, కష్టాలు కొని తెచ్చుకోరాదు. బ్రతికినంతకాలం జీవితంలో లభ్యమైన సుఖాలను అనుభవించాలి. మత కర్మకాండను పాటించడం వ్యర్థం.

111)గ్రావోన్మజ్జనవత్ యజ్ఞ
ఫలేపి శృతి సత్యతా ।
కాశ్రద్ధాతత్రధీ వృద్ధా
కామాధ్వా యత్థిలీకృతః ॥

**భావం:**

ఓ వివేకీ! వేదాల్లో చెప్పబడు జ్యోతిష్టోమం మొదలైన యజ్ఞాలు చేస్తే స్వర్గఫలం వస్తుందని చెపుతారు.

ఏదైనా ఒక రాతిముక్కను నీళ్ళలో పడవేసి అది ఈదుతుందని చెపితే సరిపోతుందా? రాయి నీటి ఉపరితలంపై ఈదడం జరగదు. అది రెండో ప్రక్కన గల ఒడ్డుకు చేరటం జరుగదు. అట్లాగే యజ్ఞం చేసినవాడు స్వర్గంలోకి పోవటం కూడా అంతే. స్వర్గమే అబద్ధం గదా!



చదవండి !　　　　　　చదివించండి !!




నాస్తిక సాహిత్యం కోసం సంప్రదించండి :

చార్వాకాశ్రమం, నిడమర్రు, మంగళగిరి,

గుంటూరు జిల్లా-522 503. ఫోన్ : 08645 - 231778

# చార్వాకం

## రామకృష్ణ గారి రచనలు

1. చార్వాక తెలుగు వాచకం- 5
2. చార్వాకుడు (నాటకం)
3. బి.రామకృష్ణ రచనలు (శతకాలు, వ్యాసాలు)
4. చార్వాకం
5. గుడ్డినమ్మకాల గుట్టుమట్టులు.
6. సంజయ రాయబారం
7. వచన సూతపురాణం - 12భాగాలు
8. వచన గబ్బిలం
9. జంబుకుడు (నాటకం)
10. ఉత్తర గబ్బిలం (కావ్యం)
11. నేతబిడ్డ (పద్యాలు)
12. చార్వాక తెలుగువాచకం (1,2,3,4 భాగాలు)
13. మతమంటే ఏమిటి?
14. నాస్తికత్వ సిద్ధాంతం
15. వేమన విప్లవం
16. మూఢవిశ్వాస వనకుఠారం - 1
17. ప్రశస్తపాదుడు (నాటకం)
18. అరెరే.. రంగనాయకమ్మగారూ... మీకూ నాస్తికత్వం తెలుసా..?

చార్వాకాశ్రమ ప్రచురణ